శనివారం
13•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 18
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

బంగారు ఆభరణాలపై ఆషాఢం ఆఫర్లు
ది చెన్నయ్ జ్యువలర్స్

ఖేడ్ మున్సిపాలిటీ ఓటరుగా మంచు మనోజ్!

నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ: నారాయణఖేడ్ మున్సిపాలిటీలో తాజాగా ప్రకటించిన ఓటరు జాబితాలో సినీహీరో మంచు మనోజ్ పేరు నమోదు కావడం చర్చనీయాంశమయింది. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు, ఇంటినంబర్ 2-35 చిరునామాతో ఓటరు జాబితాలో 428 వరుససంఖ్యలో మంచు మనోజ్ పేరు ప్రత్యక్షమయింది. తండ్రి మోహన్‌బాబు పేరుతో సహా నమోదు చేశారు. ఈ విషయంపై నారాయణఖేడ్ మున్సిపాలిటీ కమిషనర్ జీ శ్రీనివాస్ వివరణ కోరగా.. ఓటరు జాబితాలో మంచుమనోజ్ పేరు పొరపాటున నమోదయిందని చెప్పారు. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా జరిగిన సాంకేతిక లోపమే దీనికి కారణమన్నారు. జాబితా సవరణలో భాగంగా దీనిని తొలగించి తుదిజాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు.



ఖేడ్ ఓటరుగా హీరో మంచుమనోజ్‌కు చెందిన ఓటరు గుర్తింపు కార్డు

రాష్ట్రంలో పేటెంట్ సమాచార కేంద్రం

- త్వరలో కరీంనగర్‌లో వైజ్ఞానిక కేంద్రం
- టీఎస్ కాస్ట్ సభ్య కార్యదర్శి రవికుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో త్వరలోనే 'పేటెంట్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్' ఏర్పాటు కాబోతున్నది. శాస్త్రసాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలు చేసేవారి మేధోపరమైన హక్కులను కాపాడేందుకు ఈ కేంద్రం సహాయం చేస్తుందని రాష్ట్ర శాస్త్రసాంకేతిక మండలి (తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-టీఎస్ కాస్ట్) సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ రవికుమార్ పులి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్రసాంకేతిక విభాగం రాష్ట్రంలో పేటెంట్ సమాచార కేంద్రం నిర్వహణకు మొదటివిడుతగా రూ.15 లక్షలను మంజూరు చేసిందని, ఇకపై ఏటా 15 లక్షలు విడుదల చేస్తుందని వెల్లడించారు. త్వరలో అరణ్య భవన్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామని చెప్పారు. వరంగల్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్ ద్వారా వైజ్ఞానిక ప్రదర్శనలతో ఎందరో ప్రతిభను ప్రదర్శించి ఉన్నతావకాశాలను పొందుతున్నారని, త్వరలో కరీంనగర్‌లో కూడా మరో వైజ్ఞానిక కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని, అందుకు రూ.15 కోట్లు అవసరమవుతాయని చెప్పారు. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధుల మంజూరుకు సమ్మతి తెలిపిందని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వైజ్ఞానిక కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించిందని ఆయన తెలిపారు.

హైదరాబాద్‌లోని ఎంసీహెచ్చార్డీలో శుక్రవారం నిర్వహించిన బోనాల ఉత్సవంలో పాల్గొన్న సాధారణ పరిపాలన విభాగం ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బీపీ ఆచార్య తదితరులు

వైభవంగా బీరన్నకు బోనాలు

వరంగల్‌లో బీరన్నల బోనాల సందడి నెలకొన్నది. తొలి ఏకాదశి సందర్భంగా శుక్రవారం కరీమాబాద్, రంగశాయిపేటలో కురుమలు తమ ఆరాధ్య దైవం బీరన్నకు బోనమెత్తారు. కురుమడోలు వాయిస్తూ పురవీధుల గుండా బోనాలు బయలుదేరాయి. బోనాలు కరీమాబాద్‌లోని బురుజు సెంటర్‌కు రాగానే బీరన్నలు గొర్రెను గావుపట్టారు. బీరన్నకుంటలోని స్వామి ఆలయంలో బీరన్నస్వామి , కామరతి కల్యాణం వైభవంగా నిర్వహించారు.
-కరీమాబాద్(వరంగల్)

33% శాతం లోటు వర్షపాతం

- 11 జిల్లాల్లో సాధారణం, 21 జిల్లాలో లోటు వర్షపాతం
- పడిపోయిన భూగర్భజల మట్టాలు
- భూగర్భ జలవనరులశాఖ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా 2019 - 20 సంవత్సరానికి 33 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రాష్ట్ర సగటు వార్షిక వర్షపాతం 129.2 మిల్లీమీటర్లు కాగా.. 87.1 మిల్లీమిటర్లు నమోదైనట్టు భూగర్భజల వనరులశాఖ శుక్రవారం ప్రకటించిన నివేదికలో పేర్కొన్నది. రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలో సాధారణంకంటే అధిక వర్షపాతం నమోదైంది. 11 జిల్లాల్లో సాధారణ, 21 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఫలితంగా భూగర్భజలాలు తగ్గిపోయాయి. ముఖ్యంగా నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో అతితక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో 58 మండలాల్లో అధిక వర్షపాతం, 138 మండలాల్లో సాధారణ వర్షపాతం, 271 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. కాగా మరో 122 మండలాల్లో అతితక్కువస్థాయి వర్షపాతం నమోదైంది. దీంతో భూగర్భజలాలు భారీగా పడిపోయినట్టు భూగర్భ జలవనరుల శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం 2018 జూన్ 30 నాటికి 12.27 మీటర్లు ఉండగా, ప్రస్తుతం 14.40 మీటర్లుగా నమోదైంది. గత ఏడాది జూన్‌తో పోలిస్తే రాష్ట్రసగటు భూగర్భజల మట్టాలు 2.13 మీటర్లు తగ్గాయి. 2019 మే నెలతో పోలిస్తే 0.16 మీటర్ల పెరుగుదల నమోదైంది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కుదబాక్షపల్లిలో 66.91 మీటర్ల భూగర్భజల మట్టాలు ఉన్నాయి. 2019 మేతో పోలిస్తే జూన్‌లో నల్లగొండ జిల్లా నేరడుగొమ్మ మండలం కొత్తపల్లిలో 8.45 మీటర్ల మేర భూగర్భ జలమట్టం పెరుగగా, నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కుదబాక్షపల్లిలో అత్యధికంగా 12.67 మీటర్లు, అత్యల్పంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండలో 1.46 మీటర్లు పడిపోయినట్టు భూగర్భ జలవనరుల శాఖ వెల్లడించింది.

సివిల్ జడ్జి పోస్టుల స్క్రీనింగ్ టెస్ట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సివిల్ జడ్జి పోస్టులకు నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. రెండో దశ రాతపరీక్షలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలు తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు హైకోర్టు రిజిస్ట్రార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 67 పోస్టులకు మే నెలలో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు.

ప్రభుత్వంపై నమ్మకం ఉంది

- వర్క్‌టు రూల్ కార్యక్రమాల రద్దు
- ట్రెసా, టీజీటీఏ సంయుక్త ప్రకటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తాసిల్దార్ల బదిలీల విషయంలో ప్రభుత్వంపై తమకు నమ్మకమున్నదని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా), తెలంగాణ తాసిల్దార్ల సంఘం (టీజీటీఏ) నాయకులు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీల అంశంపై ఇచ్చిన వర్క్ టు రూల్ ఇతర కార్యక్రమాల షెడ్యూల్‌ను రద్దుచేస్తున్నట్టు వెల్లడించారు. తాసీల్దార్ల బదిలీల అంశంపై రెండురోజులుగా ప్రభుత్వ ఉన్నతాధికారులతో రెండుసంఘాల నాయకత్వం చర్చించిందని, ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ప్రక్రియను చేపట్టి బదిలీలను పూర్తిచేయాలని కోరినట్లు వివరించారు. బదిలీపై తీసుకునే ఏ కార్యక్రమమైనా రెండు సంఘాలు కలిసి నిర్ణయం తీసుకుంటాయని వెల్లడించారు. ఇప్పటివరకు మద్దతుగా నిలిచిన రెవెన్యూ ఉద్యోగులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

ఓదెల: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్- పెద్దపల్లి మధ్య శుక్రవారం రైలు పట్టా విరిగిన ఘటనలో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. 292/7-5 కిలోమీటర్ వద్ద శుక్రవారం ఉదయం పట్టా విరిగింది. అదే సమయంలో ఇంటర్‌సిటీ వస్తుండగా, అప్రమత్తమైన కీమెన్ ఎర్రజెండాను పాతాడు. దీంతో పైలెట్ రైలు వేగాన్ని తగ్గించాడు. అనంతరం తాత్కాలిక మరమ్మతులు చేసి రైళ్లను యథావిధిగా నడిపించారు.

ఉమ్మడి వరంగల్‌లోని మున్సిపాలిటీలకు నిధులు

- ఒకేరోజు రూ.82 కోట్లు విడుదల
- మంత్రి ఎర్రబెల్లి ప్రత్యేక చొరవ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించిన ప్రభు త్వం.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 4 మున్సిపాలిటీలకు నిధులు విడుదలచేసింది. నాలుగు మున్సిపాలిటీలకు ఒకేరోజు రూ.82.41 కోట్లు మంజూరయ్యాయి. తొర్రూరు, పరకాల, మహబూబాబాద్, వర్ధన్నపేట మున్సిపాలిటీలకు వరుసగా రూ.20 కోట్లు, రూ.25 కోట్లు, 19.40 కోట్లు, రూ.18.01 కోట్లు విడుదల చేస్తూ పురపాలకశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణాల్లో పూర్తిస్థాయిలో మౌలికవసతులు కల్పించాలనే ఉద్దేశంతో మంత్రి ఎర్రబెల్లి నిధుల మంజూరులో ప్రత్యేక చొరవ చూపారు. స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. స్పందించిన సీఎం.. మంజూరుకు ఆమోదించారు. మిగిలిన మున్సిపాలిటీలకూ ఇదేస్థాయిలో నిధులు మంజూరుకానున్నాయి. ఇప్పటికే మొదటిదశకింద నర్సంపేటకు రూ.14.97 కోట్లు, వర్ధన్నపేటకు రూ.7.65 కోట్లు విడుదలయ్యాయి.

ఎంసెట్ రెండో దశ కౌన్సెలింగ్‌కు కసరత్తు

- తొలి విడుత సెల్ఫ్‌రిపోర్టింగ్‌కు 15 వరకు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తొలివిడుత ఎంసెట్ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఇంజినీరింగ్ కళాశాలల్లో రిపోర్టు చేయడానికి 15 వరకు గడువు విధించారు. ఈ నెల మూడోవారంలో రెండోవిడుత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అడ్మిషన్ కమిటీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. నెలాఖరుకల్లా కౌన్సెలింగ్ ముగించి ఆగస్టు 1నుంచి తరగతులు నిర్వహించాలని ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ మేరకు కౌన్సెలింగ్ ప్రక్రియను వేగవంతం చేశారు. తొలివిడుతలో సీట్లుపొందిన విద్యార్థుల్లో ఎంతమంది రిపోర్టు చేస్తారు? ఎన్ని సీట్లు మిగిలాయి? వాటిలో యూనివర్సిటీ కాలేజీలు, ప్రైవేటు కాలేజీలలో మిగిలిన సీట్లు ఎన్ని వంటి పూర్తి వివరాలను సేకరించాలి. ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం శుక్రవారం వరకు ఐదోవిడుత కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తైంది. ఎంసెట్-2019లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులే.. జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ ర్యాంకులు పొందారు. వారంతా ఐఐటీల్లో సీట్లు పొందుతున్నారు. ఐఐటీ, ఎన్ఐటీలలో సీట్లు రాని విద్యార్థులు తిరిగి ఎంసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి అవకాశం ఇవ్వాలని ఇప్పటికే ఎంసెట్ అడ్మిషన్ కమిటీ నిర్ణయించింది. ఐఐటీ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 19తో ముగియనున్నది. దీంతో 20 తర్వాతే రెండో విడుత ఎంసెట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కమిటీ భావిస్తున్నది.

సీఎంవోను నిర్ణయించాకే చాంబర్ల కేటాయింపు!

బీఆర్కే భవన్ భద్రతపై అధికారుల సునిశిత అధ్యయనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బూర్గులరామకృష్ణారావు భవన్‌లోని ఏ అంతస్తులో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని కేటాయించాలి అనేది నిర్ణయించాకే.. మంత్రులు, కార్యదర్శుల చాంబర్లు, వివిధశాఖలకు కార్యాలయాలు కేటాయించనున్నారు. సీఎంవో చాంబర్ నిర్ణయానికి మరికొంత సమయంపట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. వాస్తుదోషం లేకుండా, భద్రత పకడ్బందీగా ఉండేలా సీఎం కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈ మేరకు అన్ని విధాలుగా సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది. బీఆర్కేభవన్, పరిసరాల్లో భద్రతపై అధికారులు సునిశితంగా అధ్యయనం చేస్తున్నారు. భద్రతా పర్యవేక్షణకు ప్రస్తుత సచివాలయంలో దాదాపు 100 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇదేతరహాలో బీఆర్కేభవన్ చుట్టుపక్కల 100 సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు సమాచారం. తెలుగుతల్లి ఫ్లైఓవర్ వైపు సీసీ కెమెరాలతోపాటు భద్రతా బలగాలను ఫ్లైఓవర్‌పై కూడా ఉంచాలని యోచిస్తున్నారు. బీఆర్కేభవన్‌కు భద్రత ఎలా ఉండాలి.. సీసీకెమెరాల పర్యవేక్షణ, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలపై మరింత లోతుగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వనున్నారు.

సచివాలయాన్ని సందర్శించిన టెక్నికల్ కమిటీ

సచివాలయంలో ఉన్న భవనాల పరిస్థితిని విశ్లేషించేందుకు మంత్రివర్గ ఉపసంఘం నియమించిన టెక్నికల్ కమిటీ శుక్రవారం సచివాలయాన్ని సందర్శించింది. భవనాల నాణ్యత, వాటి జీవిత కాలపరిమితి తదితర కోణాల్లో ఈ కమిటీ పరిశీలించింది. దీనిపై త్వరలో మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక ఇవ్వనున్నది. సచివాలయాన్ని సందర్శించిన టెక్నికల్ కమిటీలో ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, మురళీధర్, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

శుక్రవారం బీఆర్కే భవన్‌లో ఉన్న కార్యాలయాల్లోని సామగ్రిని డీసీఎంలో తరలిస్తున్న సిబ్బంది

హైకోర్టులో ఎర్రమంజిల్‌పై కొనసాగిన వాదనలు

- సోమవారానికి వాయిదా వేసిన ధర్మాసనం

ఎర్రమంజిల్ ప్రాంతంలో అసెంబ్లీ, మండలి కాంప్లెక్స్ నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టులో దాఖలైన కేసుల్లో శుక్రవారం కూడా వాదనలు కొనసాగాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) యాక్ట్ 2008ను క్యాబినెట్ నిర్ణయం ఉల్లంఘిస్తున్నదని డెక్కన్ ఆర్కియాలజికల్ అండ్ కల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ట్రస్ట్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఆ చట్టం ప్రకారం హెచ్ఎండీఏ చేసిన జోనింగ్ రెగ్యులేషన్స్ ప్రభుత్వం ఆమోదం మేరకు అమలులోకి వచ్చాయని, వాటిని ఉల్లంఘించరాదని వాదించారు. హెచ్ఎండీఏ జోనింగ్ ప్రణాళికలకు తుది అనుమతిచ్చేది ప్రభుత్వమే అయినప్పుడు క్యాబినెట్ నిర్ణయం ఉల్లంఘించనట్టు ఎలా అవుతుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్ఎండీఏ ప్రభుత్వంలో భాగమేనని తెలిపింది. మరోవైపు రిటైర్డ్ ఇంజినీర్ ఒమిమ్ మానెక్‌షా తరపున న్యాయవాది రమాకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హుడా జోనింగ్ నిబంధనలు తొలిగించేందుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ 2015లో జీవో 183 జారీచేసిందని ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఈ జీ వో వల్లే ఎర్రమంజిల్ ప్యాలెస్‌కు తెలంగాణ హెరిటేజ్ చట్టంలో స్థానం దక్కలేదన్నారు. వాదనలను సోమవారానికి వాయిదా వేసింది.

నేటినుంచి అబ్రాడ్ ఎంబీబీఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్

- టీన్యూస్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవనంలో నిర్వహణ
- ముఖ్యఅతిథిగా ఎంపీ సంతోష్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వివిధ దేశాల్లోని ఎంబీబీఎస్ కళాశాలల్లో ప్రవేశాలు పొందడానికి విద్యార్థులకు వీలుకల్పించేలా టీన్యూస్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవనంలో శని, ఆదివారాల్లో అబ్రాడ్ ఎంబీబీఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్-2019 నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ఫెయిర్‌ను ఎంపీ సంతోష్ కుమార్ ప్రారంభిస్తారని నిర్వాహకులు ఉపేందర్ తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు ఫెయిర్ ఉంటుంది. విదేశాల్లో ఎంబీబీఎస్, హోటల్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ కోర్సులు చేయాలనుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆయాదేశాలకు వెళ్లడానికి కావాల్సిన ఏర్పాట్లపై అవగాహన కల్పించి, అనుమానాలు తీర్చడానికి ఫెయిర్ ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. దాదాపు 30 కన్సల్టెన్సీలు ఈ ఫెయిర్‌లో పాల్గొంటాయని చెప్పారు. వీటిలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన సౌత్ వెస్ట్రన్ వర్సిటీ, దావావో మెడికల్ వర్సిటీ, వాషింగ్టన్ యూనివర్సిటీ, కొలంబస్ సెంట్రల్ వర్సిటీ, కిర్గిస్టేట్ మెడికల్ అకాడమీ, ఆస్తాన మెడికల్ వర్సిటీ, సెమీ స్టేట్ మెడికల్ వర్సిటీ, అకాకి మెడికల్ వర్సిటీ, జార్జియా నేషనల్ వర్సిటీ, సెయింట్ పాల్ వర్సిటీలతో పాటు గుర్తింపు పొందిన అనేక యూనివర్సిటీలు పాల్గొంటున్నాయని తెలిపారు.

రాష్ట్రానికి పర్యాటకులను ఆకర్షించాలి

- సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి పర్యాటకులను ఆకర్షించేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించి, ప్రతిపాదనలను తయారుచేయాలని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టును అద్భుత పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దాలని.. ప్రాజెక్టుతోపాటు కాళేశ్వరం దేవాలయం సందర్శన కోసం ప్రత్యేక టూరిస్టు ప్యాకేజీని రూపొందించాలని సూచించారు. ఆదిలాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని పర్యాటక కేంద్రాలను మూడు కొత్త సర్క్యూట్లుగా తయారుచేసి, రాష్ట్రంలోని ఇతర చారిత్రక, వారసత్వ, ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానంచేయాలన్నారు. సమావేశంలో పర్యాటక శాఖ కమిషనర్ దినకర్ బాబు, టూరిజం ఎండీ మనోహర్‌రావు, జాయింట్ సెక్రటరీ రమేశ్, సమాచార, పౌర సంబంధాలశాఖ అదనపు సంచాలకుడు నాగయ్య కాంబ్లె పాల్గొన్నారు.

సచివాలయంలో పర్యాటక కేంద్రాలపై సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అటవీ భూముల తగాదాలకు చెక్

- రిమోట్‌సెన్సింగ్ ద్వారా సర్వే
- ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్న అటవీశాఖ అధికారులు
- ఒడిశా విధానంపై అధ్యయనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అటవీభూముల సరిహద్దు తగాదాలను శాశ్వతంగా పరిష్కరించడానికి ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సమగ్ర సర్వే చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించి డిజిటల్ మ్యాపింగ్ ద్వారా సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించడానికి ప్రణాళికలను సిద్ధంచేస్తున్నారు. ఇందుకోసం అటవీశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నది. శుక్రవారం అరణ్యభవన్‌లో అటవీ, పర్యావరణశాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో.. ఒడిశాకు చెందిన అటవీశాఖ అధికారి, రిమోట్‌సెన్సింగ్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రపుల్ అతిథిగా పాల్గొని ఆ రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఒడిశాలో అటవీభూముల సరిహద్దులను గుర్తించడానికి రిమోట్‌సెన్సింగ్ ద్వారా సమగ్ర సర్వే జరుగుతున్నది. దీనిపై రాష్ట్ర అధికారులు అధ్యయనంచేస్తున్నారు. రాష్ట్రంలో 1,968 గ్రామాలు అటవీప్రాంతాన్ని ఆనుకొని ఉన్నాయి. అక్కడ స్థానికులకు, అటవీశాఖ అధికారులకు తగాదాలు తలెత్తుతున్నాయి. రెవెన్యూ వంటి శాఖలతోనూ సరిహద్దు వివాదాలున్నాయి. సర్వేతో తగాదాలకు చెక్ పెట్టనున్నారు.

మంత్రాల ఆరోపణలు.. వృద్ధురాలి ఆత్మహత్య

వర్ధన్నపేట, నమస్తే తెలంగాణ: మంత్రాల నెపంతో అసభ్య పదజాలంతో దూషించగా అవమానంతో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేటలో శుక్రవారం జరిగింది. స్థానిక ఫిరంగిగడ్డకు చెందిన బొంత వెంకటమ్మ (60)ను తన ఇంటి సమీపంలోని ఓ మహిళకు మంత్రాలు చేశావని ఆరోపిస్తూ పెద్దమనుషులు గురువారం పిలిపించారు. బొట్టు పెడితే జ్వరం తగ్గుతుందని ఆమెపై ఒత్తిడి తెచ్చారు. తనకు మంత్రాలు రావని చెప్పినా వినకపోగా అసభ్య పదజాలంతో దూషించారు. మనస్తాపానికి గురైన వెంకటమ్మ గురువారం రాత్రి ఇంట్లో పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కొడుకు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతిలో ఘనాపాఠి తాసిల్దార్ లావణ్య

- బయటకొస్తున్న బాగోతాలు
- డబ్బు తీసుకొని సతాయించారని రైతుల ఆరోపణలు

కేశంపేట: భూమి రికార్డును ఆన్‌లైన్‌లో నమోదుచేసేందుకు ఓ రైతు నుంచి లంచం తీసుకోవడానికి వీఆర్వోను పురమాయించి.. ఏసీబీకి చిక్కిన తాసిల్దార్ లావణ్య బాధితులు ఒక్కొక్కరుగా బయటికొస్తున్నారు. పట్టామార్పిడి, ఆన్‌లైన్ నమోదు, సమస్యాత్మక పనుల్లో బయటకు పొక్కకుండా చేతివాటం చూపించిన తాసిల్దార్ లావణ్య పట్టుబడటంతో ఆమె అవినీతి చిట్టాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. భూములు కొనుగోలుచేసి, రిజిస్ట్రేషన్ అయ్యాక, పట్టామార్పిడుల కోసం తాసిల్ కార్యాలయానికి వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొన్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆన్‌లైన్‌లో భూముల వివరాలు తక్కువగా ఎక్కించి, మిగతా భూమిని నమోదుచేసేందుకు డబ్బు వసూలుచేసేవారని పేర్కొన్నారు. తమ భూమి వివరాలను ఆన్‌లైన్ సరిగా ఎక్కించలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కేశంపేట, ఇప్పలపల్లి, పాపిరెడ్డిగూడ, దత్తాయపల్లి గ్రామాల వీఆర్వోగా పనిచేసిన అనంతయ్యపైనే వందల సంఖ్యలో ఫిర్యాదులున్నాయి. పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, దత్తాయపల్లి తదితర గ్రామాల్లో బిల్డింగ్ బ్లాక్ వెంచర్లు ఏర్పాటయ్యాయి. వెంచర్ యజమానులు పట్టాభూములతోపాటు అసైన్డ్‌భూములను కూడా తమ వెంచర్లలో కలుపుకొని తాసిల్దార్‌కు ముడుపులు బాగానే ముట్టజెప్పినట్టు తెలుస్తున్నది.

శుక్రవారం కేశంపేట తాసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు. (ఇన్‌సెట్) లావణ్య (ఫైల్)

కార్యాలయంలో రైతుల ఆందోళన

శుక్రవారం తాసిల్దార్ కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చిన రైతులు సర్వేయర్ నాగేశ్‌పై భగ్గుమన్నారు. సర్వే రిపోర్టులు ఇవ్వడం లేదంటూ పలువురు ఆందోళనకు దిగారు. సర్వేయర్ డబ్బులు ఇవ్వనిదే సర్వేకు రాడని.. సర్వేచేసినా సర్వేరిపోర్ట్స్ ఇవ్వడానికి సతాయిస్తాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆందోళనకు దిగిన కొంతమంది రైతులకు సర్వేయర్ వెంటనే సర్వే రిపోర్ట్స్‌ను అందజేశారు. కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్ డబ్బు తీసుకొని ఇబ్బందులకు గురిచేశారని రైతులు ఆరోపించారు.

కార్యాలయంలో కొనసాగుతున్న ఏసీబీ తనిఖీలు

కేశంపేట తాసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు. పెండింగ్‌కు గల కారణాలను పరిశీలిస్తున్నట్టు బృందం తెలిపారు. కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు బీ గంగాధర్, శంకర్‌రెడ్డి, వై కమల్‌కుమార్, సీహెచ్ మురళీమోహన్, హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటిరెడ్డి, రఘు పాల్గొన్నారు.

GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF TECHNICAL EDUCATION
TS D PHARMACY -2019
CONVENOR /SPOT ADMISSION NOTIFICATION
PAYMENT OF PROCESSING FEE, SLOT BOOKING, CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING.
The eligible candidates who applied to Secretary, SBTET, Telangana for admission into Diploma in Pharmacy Course (M.P.C. & Bi.P.C Stream) are informed that the web counselling will commence on 19-07-2019. Further details and spot admission guidelines can be seen in the website: https://tsdpharm.nic.in .
Date: 12-07-2019 Sd/-Navin Mittal, IAS
Place: Hyderabad Convenor,TSDPHARMACY -2019 & CTE
DIPR RO. No. 610-DP/CL/Advt/1/2019-20, Dt: 12/07/2019

BHASKAR ENGINEERING COLLEGE (BSKR)
(Sponsored by J.B. Educational Society)
(Approved by AICTE, Affiliated to JNTU, Hyderabad)
Bhaskar Nagar, Yenkapally (V), Moinabad (M), R.R. District, Hyd - 075
Website: www.bec.edu.in, Ph:08413-235024 / 8008096774

శనివారం
13•7•2019
కరీంనగర్

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

16 అర్ధరాత్రి చంద్రగ్రహణం

- తెల్లవారుజామున 1:31 గంటలకు ప్రారంభం
- ఉదయం 4:30 గంటలకు ముగింపు
- గ్రహణం ఆసాంతం దేశమంతా వీక్షించే అవకాశం

5

నిరుద్యోగులకు శుభవార్త

బీసీ గురుకులాల్లో 1698 పోస్టుల భర్తీ

అనుమతిచ్చిన తెలంగాణ ప్రభుత్వం

టీఆర్ఈఐ-ఆర్బీ ద్వారా నియామకాలు.. ఉత్తర్వులు జారీచేసిన ఆర్థికశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ఈ విద్యాసంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయాల్లో పనిచేసేందుకు బోధకులు, ప్రిన్సిపల్, ఇతర పోస్టులను భర్తీచేయాలని నిర్ణయించింది. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ గురుకులాల్లో 1,698 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 1071 టీజీటీ, 119 పీఈటీ, 36 ప్రిన్సిపల్ సహా ఇతర పోస్టుల భర్తీకి అనుమతిస్తూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఆర్ఈఐ-ఆర్బీ) ద్వారా ఈ మొత్తం పోస్టుల నియామక ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. స్థానికత, ఆయా ప్రాంతాల్లో పోస్టుల ఖాళీలు, రోస్టర్‌పాయింట్ల ఆధారంగా అర్హులను ఎంపికచేసి నియమించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

పోస్టు క్యాటగిరీ	సంఖ్య
ప్రిన్సిపల్	36
ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ)	1071
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)	119
లైబ్రేరియన్	119
క్రాఫ్ట్/ఆర్ట్/మ్యూజిక్ ఇన్‌స్ట్రక్టర్	119
స్టాఫ్ నర్స్	119
జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్	110
జూనియర్ అసిస్టెంట్	05
మొత్తం పోస్టులు	1,698

280కి చేరిన బీసీ గురుకులాలు

వెనుకబడిన తరగతుల ఆర్థిక, సామాజికాభివృద్ధి కోసం టీఆర్ఎస్ సర్కారు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన సమయంలో

మిగతా 4వ పేజీలో

దూరదృష్టితో గురుకులాల బలోపేతం

కేజీ టు పీజీ ఉచిత విద్యావిధానాన్ని అమలుచేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో గురుకుల విద్యాలయాలను బలోపేతం చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 119 బీసీ గురుకులాలను ప్రారంభించుకున్నాం. వీటికోసం 1,698 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే నియామక ప్రక్రియ చేపడుతారు.

- కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి

ప్రత్యేక రాష్ట్రంలో విద్యాప్రగతి

ప్రత్యేక తెలంగాణలో విద్యాప్రగతిని సాధించగలుగుతున్నాం. సీఎం కేసీఆర్ దార్శనికతతో పాఠశాల విద్యను బలోపేతం చేస్తూనే.. కేజీ టు పీజీ ఉచిత విద్యావిధానం అమలుకు కృషిచేస్తున్నారు. గురుకుల విద్యాలయాలను పెంచడంతోపాటు వాటిలో నాణ్యమైన విద్యను అందించేలా నియామకాలను చేపడుతున్నారు. భవిష్యత్‌తరాలకు ఇది ఎంతో ప్రయోజనకరం.

- జగదీశ్‌రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి

మేడిగడ్డ బరాజ్‌లో నిలిచిన బ్యాక్‌వాటర్

విస్తరిస్తున్న గోదావరి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంప్‌హౌస్‌లో 1వ, 3వ, 4వ, 6వ నంబర్ మోటర్ల నుంచి గ్రావిటీ కెనాల్‌లోకి దుంకుతున్న గోదావరి జలాలు

- 42 కి.మీ. మేరకు బ్యాక్‌వాటర్
- కన్నెపల్లి వద్ద నాలుగు మోటర్లతో ఎత్తిపోత
- అన్నారం పంపుహౌస్ మోటర్లకు పరీక్షలు
- నాలుగైదు రోజుల్లో ఎత్తిపోతలు మొదలు!
- కాళేశ్వరం బరాజ్‌లలో పెరుగుతున్న నీటినిల్వ
- మేడిగడ్డ బరాజ్‌లో 4.50 టీఎంసీల నీరు
- అన్నారం బరాజ్‌కు చేరిన 2.50 టీఎంసీలు
- కాళేశ్వరం జలాలపై సీఎం కేసీఆర్ ఆరా
- జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌కు ఫోన్
- గోదావరి మాతకు పూజలపట్ల అభినందనలు
- ఇంద్రావతి కలయికతో పేరూరు వద్ద గోదావరి ఉధృతి
- ధవళేశ్వరం బరాజ్‌కు 95వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఇప్పటివరకు సముద్రంలో కలిసిన 31 టీఎంసీలు

4



అసెంబ్లీలో కర్ణాటక సీఎం కుమారస్వామి

కర్ణాటకం.. బ్రేక్ కే బాద్!

- రెబల్ ఎమ్మెల్యేలపై ఈ నెల 16 వరకు స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దన్న సుప్రీంకోర్టు
- బలపరీక్షకు సిద్ధమన్న ముఖ్యమంత్రి కుమారస్వామి
- సీఎం కోరిన సమయంలో నిర్వహిస్తామన్న స్పీకర్
- ఎమ్మెల్యేలను రిసార్టుకు తరలించిన బీజేపీ

5

ధర్మగంట

పట్టాభూమిని ప్రభుత్వభూమిగా మార్చారు!

- రెవెన్యూ అధికారుల తప్పులతో బాధితులకు తిప్పలు
- 20 ఏండ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం శూన్యం
- ధర్మగంటను ఆశ్రయించిన సిద్దిపేట జిల్లావాసి, జెన్‌కో రిటైర్డ్ ఎస్ఈ దేవేందర్‌రెడ్డి

9

నలుగురు అన్నదమ్ముల పేరిట ఉన్న 16 ఎకరాల భూమి.. రెవెన్యూ అధికారులు చేసిన తప్పులతో వారికి కాకుండాపోయింది. భూమిని కొన్న సమయంలో అధికారులు వారి పేరిట పట్టాదార్ పాస్ పుస్తకాలు కూడా ఇచ్చారు. పహాణీలోనూ వారి పేర్లు వచ్చాయి. అయితే, ఒక్కసారిగా ఆ పట్టా భూమి ప్రభుత్వ భూమిగా మారిపోయింది. పహాణీలో పేర్లు మాయమయ్యాయి. ఇరవై ఏండ్లుగా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. న్యాయం జరిగేలా చూడండంటూ సిద్దిపేట జిల్లా, రాయపోల్ మండలం, వడ్డేపల్లికి చెందిన నలుగురు అన్నదమ్ములు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

శుక్రవారం ముషీరాబాద్ గంగపుత్ర కాలనీలో టీఆర్ఎస్ సభ్యత్వ రసీదులు చూపుతున్న యువతులు

పోటాపోటీగా సభ్యత్వాలు

- లక్ష్యానికి చేరువగా నమోదు ప్రక్రియ
- టార్గెట్‌ను అధిగమించిన సూర్యాపేట జిల్లా, మేడ్చల్ సెగ్మెంట్
- జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లోనూ జోరు

7

మరోవారం మందగమనమే

చురుకుగా కదలని రుతుపవనాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో 9 సెం.మీ. వర్షపాతం

పలు జిల్లాల్లో ఓ మోస్తరు వానలు

శుక్రవారం వర్షాలకు నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలో పారుతున్న జన్నేపల్లి వాగు

4

ఎంపీటీసీని హతమార్చిన మావోయిస్టులు

- ఈ నెల 8న కిడ్నాప్.. 12న దండకారణ్యంలో హత్య
- తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీప్రాంతంలో మృతదేహం
- ఉలిక్కిపడిన మన్యం

7

నల్లూరి శ్రీనివాసరావు (ఫైల్)

ఎస్బీఐ ఖాతాదారులకు శుభవార్త

ఆన్‌లైన్ చార్జీలను పూర్తిగా ఎత్తివేసిన బ్యాంక్

8

తమిళనాడు వేలూరు జిల్లా జోలార్‌పెట్టై ప్రాంతం నుంచి బయలుదేరిన నీటి రైలు శుక్రవారం చెన్నైకి చేరుకున్న దృశ్యం

చెన్నైకి నీళ్లరైలు వచ్చింది

- వ్యాగన్ల ద్వారా 25 లక్షల లీటర్ల నీరు చేరవేత
- రోజుకు కోటి లీటర్ల సరఫరా లక్ష్యం
- నీటి ఎద్దడి నేపథ్యంలో ఆరునెలలపాటు అమలుకానున్న తరలింపు

5

శుక్రవారం తన జన్మదినం సందర్భంగా ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న టీఎస్‌టీఎస్ చైర్మన్ డాక్టర్ రాకేశ్ చిరుమిల్ల

బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్రం వివక్ష

టీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు విమర్శ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిందని టీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు విమర్శించారు. కొత్త రైల్వే లైన్లు, విస్తరణ, నూతన ప్రణాళికల గురించి ఎక్కడా ప్రస్తావించలేదని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేయాలని కోరారు. శుక్రవారం లోక్‌సభలో రైల్వేలైన్ల అభివృద్ధి, కేటాయింపులపై నామా ప్రసంగిస్తూ.. కొత్త రాష్ట్రమైన తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తెలంగాణ, ఏపీ మధ్య ఉన్న భద్రాచలం– సత్తుపల్లి– కొవ్వూరు లైన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్‌చేశారు.

అసెంబ్లీ సమావేశాలకు నోటిఫికేషన్

కొత్త పురపాలకచట్టం కోసం ప్రత్యేక భేటీ.. 18న అసెంబ్లీలో, 19న మండలిలో బిల్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలకోసం నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 18న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ, మరుసటిరోజు (19న) మధ్యాహ్నం రెండు గంటలకు కౌన్సిల్ సమావేశాలు ప్రారంభమవుతాయని ఈ నోటిఫికేషన్‌లో వెల్లడించారు. రాష్ట్రంలో నూతన పురపాలకచట్టం తీసుకురావడానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు గవర్నర్ నరసింహన్ తరపున నోటిఫికేషన్ విడుదలచేశారు. తొలిరోజు నూతన పురపాలక చట్టం బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడతారు. ఆ ప్రతులను ఎమ్మెల్యేలకు అందించనున్నారు. 19వ తేదీన ఈ బిల్లుకు సభ ఆమోదం తెలుపనున్నది. ఆ తర్వాత ఈ బిల్లును కౌన్సిల్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందనున్నారు. రాష్ట్రంలో నూతన పురపాలక చట్టం అమలులోకి వచ్చిన తర్వాతే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. పురపాలక బిల్లు ముసాయిదాకు తుదిరూపం ఇవ్వడానికి ఇప్పటికే న్యాయశాఖకు పంపించారు.

కన్వీనర్ కోటాలో ఆయుష్ సీట్ల భర్తీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ విద్యాసంవత్సరానికి కన్వీనర్ కోటాలో ఆయుష్ మెడికల్ కోర్సుల సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్, ఆయుష్ కళాశాలల్లో బీఏఎమ్మెస్, బీహెచ్ఎమ్మెస్, బీయూఎమ్మెస్, బీఎస్‌వైసీ కోర్సుల్లో ఏ క్యాటగిరీ సీట్లను భర్తీ చేయనున్నారు. నీట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 20వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ సూచించింది. పూర్తి వివరాల కోసం www.knruhs.in, www.knruhs.telangana.gov.In వెబ్‌సైట్‌ను చూడాలని కోరింది.

ఐఐటీ ప్రవేశాలకు ఐదోవిడుత కౌన్సెలింగ్ పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలతోపాటు ఇతరజాతీయ విద్యాసంస్థల్లో సీట్ల కోసం నిర్వహించిన ఐదో విడుత కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. ఇంకా రెండు విడుతల కౌన్సెలింగ్ కొనసాగనున్నది. 19న చివరి విడుత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) నిర్వాహకులు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు జోసా వెబ్‌సైట్‌ను సంప్రదించి, ఐఐటీలు, ఎన్ఐటీల్లో రిజర్వేషన్లవారీగా ప్రవేశాలు పొందుతున్నారు.

సోలార్ టెక్నాలజీపై ఉచితశిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిరుద్యోగ యువతకు సోలార్ విద్యుత్ టెక్నాలజీపై ఉచితశిక్షణ ఇవ్వనున్నట్టు సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రొగ్రాం డైరెక్టర్ మారంరాజు శేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామి రామానందతీర్థ మెమోరియల్ ప్రాంగణంలో సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ సహకారంతో 90 రోజులపాటు సూర్యమిత్ర పేరిట శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కూడా సమకూరుస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 15 నుంచి ప్రవేశాలు ప్రారంభిస్తామని.. ఐటీఐ (ఎలక్ట్రీషియన్, మెకానికల్), పాలిటెక్నిక్ (ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్), ఇంటర్మీడియట్ (ఒకేషనల్ ఎలక్ట్రికల్) పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు surabhiskills.in వెబ్‌సైట్ లేదా 9010191007 నంబర్‌లో సంప్రదించాలని శేఖర్ పేర్కొన్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 5.53 గంటలకు

సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, ద్వాదశి, నక్షత్రం: అనురాధ సాయంత్రం 4.28 వరకు, తదుపరి జ్యేష్ఠ, అమృతఘడియలు: తె.జా. 5.51 నుంచి ఉదయం 7.27 వరకు, రాహుకాలం: ఉదయం 9.07 నుంచి 10.45 వరకు, దుర్ముహూర్తం: తె.జా. 5.53 నుంచి ఉదయం 7.37 వరకు, వర్జ్యం: రాత్రి 10.18 నుంచి 11.54 వరకు.

విస్తరిస్తున్న గోదావరి

పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్ పరిధిలోని ఒడ్లపాలెం వద్ద పారుతున్న గోదావరి

42 కి.మీ. మేర బ్యాక్‌వాటర్

కన్నెపల్లి వద్ద నాలుగు మోటర్లతో ఎత్తిపోత

అన్నారం పంపుహౌస్ మోటర్లకు పరీక్షలు

నాలుగైదు రోజుల్లో ఎత్తిపోతలు మొదలు!

- కాళేశ్వరం బరాజ్‌లలో పెరుగుతున్న నీటినిల్వ
- మేడిగడ్డ బరాజ్‌లో 4.50 టీఎంసీల నీరు
- అన్నారం బరాజ్‌కు చేరిన 2.50 టీఎంసీలు
- ఇంద్రావతి కలయికతో పేరూరు వద్ద గోదావరి ఉధృతి
- ధవళేశ్వరం బరాజ్‌కు 95వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఇప్పటివరకు సముద్రంలో కలిసిన 31 టీఎంసీలు

జయశంకర్ జిల్లా ప్రతినిధి/ మంథని, హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దిగువనుంచి వస్తున్న జలాలతో గోదారి ఎదురెక్కుతున్నది. మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లతోపాటు.. మానేరు లోనూ పెద్దఎత్తున నీరు పోగుపడుతుండటంతో క్రమేణా విస్తరిస్తున్నది. ప్రాణహిత నుంచి వస్తున్న వరదనీటిని సాగునీటిశాఖ ఇంజినీర్లు మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లలో నిల్వచేస్తున్నారు. మేడిగడ్డలో మొత్తం అన్ని గేట్లను మూసివేయడంతో శుక్రవారానికి సుమారు 4.50 టీఎంసీల నీరు చేరింది. ఫలితంగా ఇక్కడ గోదావరిలో బ్యాక్‌వాటర్ 20 కిలోమీటర్ల వరకు విస్తరించింది. అటు అన్నారం బరాజ్‌లో నీటినిల్వ 2.50 టీఎంసీలు దాటింది. దీంతో ఇక్కడ బ్యాక్‌వాటర్ 22 కిలోమీటర్లవరకు నిలిచింది. అన్నారం బరాజ్ నిండుతుండటంతో మానేరులోనూ 3.8 కిలోమీటర్ల వరకు బ్యాక్‌వాటర్ వచ్చింది. మొత్తంగా మేడిగడ్డ, అన్నారం బరాజ్‌ల బ్యాక్‌వాటర్‌తో దాదాపు 42 కిలోమీటర్ల పొడవున గోదావరి నిండుకుండను తలపిస్తున్నది. కన్నెపల్లి వద్ద 12వేల క్యూసెక్కుల ప్రవాహం నమోదవుతున్న నేపథ్యంలో పంపుహౌస్‌లోని 1, 3, 4, 6 నంబర్ల మోటర్లతో 9600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో గ్రావిటీ కాల్వద్వారా జలాలు అన్నారం బరాజ్‌కు చేరుకుంటున్నాయి. ప్రాణహిత నదినుంచి వస్తున్న నీరు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం వద్ద గోదావరి నదిలో కలిసిన తర్వాత ఇక్కడ శుక్రవారం 11,500 క్యూసెక్కుల నీటిప్రవాహం నమోదైంది. ఈ నీటిలో కొంత కన్నెపల్లి పంపుహౌస్‌కు, మరికొంత మేడిగడ్డ బరాజ్‌కు చేరుతున్నాయి. మేడిగడ్డలోని మొత్తం 85 గేట్లను మూసివేటంతో ప్రాణహిత ద్వారా వచ్చే నీరు మొత్తం బరాజ్‌లోనే నిలిచిపోనున్నది.

మేడిగడ్డలో 4.50 టీఎంసీలు

మేడిగడ్డ బరాజ్‌లో శుక్రవారానికి నీటినిల్వ 95వ మీటర్ దాటిందని ప్రాజెక్టు ఈఈ వెంకటరమణారెడ్డి 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. మరోవైపు కన్నెపల్లి పంపుహౌస్‌లోని మోటర్లు నిరంతరం పనిచేస్తుండటంతో అన్నారం బరాజ్‌లో గంటకు రెండు అంగుళాల లెక్కన నీటిమట్టం పెరుగుతున్నట్టు బరాజ్ ఈఈ యాదగిరి వెల్లడించారు. అన్నారం బరాజ్ నుంచి నీటిని ఎత్తిపోసే పంపుహౌస్ పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగువద్ద ఉన్నది. అన్నారం బరాజ్ నుంచి ఎగువన 29 కిలోమీటర్ల దూరంలోని ఈ పంప్‌హౌస్‌కు బ్యాక్‌వాటర్ ఆదివారం చేరుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. సుందిల్ల బరాజ్ నుంచి నీటిని దిగువన అన్నారం పంపుహౌస్‌కు విడుదలచేశారు. ఇది నేరుగా అప్రోచ్ కెనాల్ నుంచి హెడ్ రెగ్యులేటర్ ద్వారా అన్నారం పంపుహౌస్ ఫోర్‌బేలోకి చేరింది. దీంతో అన్నారం పంపుహౌస్‌లోని మోటర్లకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. అన్నారం బరాజ్‌లో పెరిగే నీటి నిల్వతో గోదావరిలో నిలిచే బ్యాక్‌వాటర్ రాగానే ఇక్కడ ఎత్తిపోత ప్రారంభించేందుకు ఇంజినీర్లు మోటర్లను సిద్ధం చేస్తున్నారు. అన్నారం పంపుహౌస్ నుంచి నాలుగైదు రోజుల్లో గోదావరి జలాల ఎత్తిపోత ప్రారంభం కావచ్చని ఈఈ యాదగిరి చెప్పారు. సుందిల్ల బరాజ్‌కు కూడా జలాల తరలింపు మొదలైతే.. మరికొన్ని రోజుల్లో అక్కడి నుంచి ఎల్లంపల్లికి ఎత్తిపోత మొదలుకానుంది. దానితర్వాత ఎల్లంపల్లి జలాశయంలో నీటిమట్టం ఆధారంగా నందిమేడారం పంపుహౌస్ మోటర్లు ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి ప్యాకేజీ–7 ద్వారా జలాలను తరలించి రామడుగు పంపుహౌస్‌లోని బాహుబలి మోటర్లను నడిపే అవకాశాలపై అధికారులు దృష్టిసారించనున్నారు.

కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం వైపు గోదావరి జలాల పరుగు

అన్నారం బరాజ్‌లోకి చేరిన గోదావరి జలాలు

ఆశాజనకంగా ఆల్మట్టి

- వరుసగా మూడ్రోజులపాటు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం.. ప్రస్తుత సామర్థ్యం 73.78 టీఎంసీలు
- ఇలాగే కొనసాగితే పదిరోజుల్లో జూరాలకు వరద

హైదరాబాద్/ మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ: కృష్ణాబేసిన్‌లో వరద ప్రవాహం నెమ్మదిగా పెరుగుతున్నది. ఎగువన ఉన్న ఆల్మట్టికి లక్ష క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో స్థిరంగానే కొనసాగుతుండటం విశేషం. శుక్రవారం సాయంత్రానికి 1.10 లక్షల క్యూసెక్కులకు చేరుకున్నది. 129.72 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న ఆల్మట్టి జలాశయంలో ప్రస్తుతం నీటినిల్వ 73.78 టీఎంసీలకు చేరుకున్నది. సుమారుగా మరో 56 టీఎంసీలు వస్తే ఆల్మట్టి పూర్తిస్థాయిలో నిండుతుంది. ఆల్మట్టికి ఎగువన మహారాష్ట్రలో భారీగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో మూడ్రోజులుగా ఇన్‌ఫ్లో భారీగా ఉన్నది. ఈ మూడ్రోజుల్లోనే సుమారు 20 టీఎంసీల వరద జలాలు వచ్చి చేరాయి. ఆల్మట్టి, నారాయణపూర్.. ఈ రెండు ప్రాజెక్టులు నిండిన వెంటనే నీటిని విడుదలచేసే అవకాశం ఉన్నది. ఆల్మట్టికి ఎగువన భారీ వర్షాలు ఇలాగే కొనసాగితే మరో ఎనిమిదిరోజుల్లో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలు పూర్తిగా నిండుతాయని జూరాల ప్రాజెక్టు ఈఈ హెచ్‌టీ శ్రీధర్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు నిండిన తర్వాత జూరాలకు భారీగా ఇన్‌ఫ్లో ఉంటుందని చెప్పారు. ఆ నీటి రాకకోసం జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ పరిధిలోని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కృష్ణాలో ఉజ్జయినికి 45,168 క్యూసెక్కుల వరద వస్తుండగా.. తుంగభద్ర వద్ద 20,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది.

కాళేశ్వరం జలాలపై సీఎం కేసీఆర్ ఆరా

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు ముఖ్యమంత్రి ఫోన్
- గోదావరి మాతకు పూజలపై అభినందనలు

మంథని, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితాలపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్వయంగా ఆరాతీస్తున్నారు. ఎల్లంపల్లినుంచి మేడిగడ్డవరకు 104 కిలోమీటర్ల గోదావరి తీరం మంథని నియోజకవర్గంలోనే ఉన్నది. గోదావరి జలాలు కన్నెపల్లి పంపుహౌస్ ద్వారా అన్నారం బరాజ్‌కు చేరుకుని ఎదురెక్కుతున్న పరిస్థితిపై ముఖ్యమంత్రి శుక్రవారం ఉదయం పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకున్నారు. గోదావరి ఎదురెక్కుతూ గ్రామాలను తాకుతుంటే ఆయా గ్రామాల్లోని ప్రజల, రైతుల స్పందన ఎలా ఉన్నదో అడిగి తెలుసుకున్నారు. గోదావరితోపాటు పెద్దవాగు, పొక్కూరువాగు, మానేరు, బొక్కలవాగుల్లో పెరుగుతున్న జలాల గురించి తెలుసుకొని, వాటిద్వారా కలిగే ప్రయోజనాలపై మధుతో చర్చించారు. క్రమంగా గోదావరి ఎదురెక్కి పారే సన్నివేశాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సీఎం ఆదేశించారు. తాను కూడా ప్రతినిత్యం గోదావరిలో పెరుగుతున్న జలాలపై తెలుసుకుంటున్నట్టు వెల్లడించారు. ఎగబాకుతున్న గోదావరి మాతకు పసుపు, కుంకుమ, సారెతో ప్రత్యేక పూజలు చేయడంపై పుట్ట మధూకర్‌ను సీఎం అభినందించారు. ఎడారిగా ఉన్న గోదావరి నదిలోకి జలాలు ఎదురెక్కుతున్న అపూర్వ, అద్భుత దృశ్యాలకు సంబంధించిన వీడియో, ఫొటోలను పంపాలని కోరగా.. ఆ మేరకు మధూకర్ వాటిని సీఎంకు పంపారు.

గోదావరి మళ్లింపుపై ఎల్లుండి భేటీ

సిద్ధమవుతున్న ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు.. తుది ప్రతిపాదనలు కొలిక్కి!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణాబేసిన్‌కు గోదావరిజలాల మళ్లింపుపై చివరిదఫా సంయుక్తభేటీకి తెలంగాణ, ఏపీ ఇంజినీర్లు సిద్ధమవుతున్నారు. ఈ నెల తొమ్మిదోతేదీన సమావేశమైన రెండు రాష్ట్రాల ఇంజినీర్లు ఐదు ప్రతిపాదనలపై చర్చించిన విషయం తెలిసిందే. ప్రతిపాదనలను పరస్పరం మార్చుకుని, పరిశీలించి, మరోసారి భేటీకావాలని ఆ సమావేశంలోనే నిర్ణయించారు. తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ భేటీ 15న జరిగే పక్షంలో అంతకు రెండ్రోజులముందు అంటే శనివారం సమావేశమై, తుది నివేదికను సిద్ధంచేయాలని అనుకున్నారు. ఇప్పటివరకు ఇద్దరు సీఎంల సమావేశం ఖరారు కాకపోవడంతో ముందుగా అనుకున్నమేరకు 15న తుది సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ప్రతిపాదనలు ఒక కొలిక్కి వస్తాయని భావిస్తున్నారు.

నాలుగు మోటర్లతో పంపింగ్

కన్నెపల్లి వద్ద నాలుగు మోటర్లతో గోదావరి జలాల ఎత్తిపోత కొనసాగుతున్నది. గురువారం విరామం ఇచ్చిన ఒకటో నంబర్ మోటర్‌ను ఇంజినీర్లు తిరిగి శుక్రవారం ఉదయం ప్రారంభించారు.ప్రతిరోజు కన్నెపల్లి–అన్నారం గ్రావిటీ కెనాల్‌ద్వారా 8,400 క్యూసెక్కుల నీరు అన్నారం బరాజ్‌కు చేరుకుంటున్నదని ప్రాజెక్టు అధికారులు చెప్పారు. కన్నెపల్లి పంపుహౌస్‌లో 1, 3, 4, 6వ నంబర్ మోటర్లు నిర్విరామంగా నడుస్తుండగా.. ఐదో మోటర్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సముద్రంలోకి లక్ష క్యూసెక్కులు

ఇంద్రావతి కలిసిన తర్వాత పేరూరు వద్ద గోదావరి వరద ఉధృతి పెరిగింది. ప్రస్తుతం పేరూరు వద్ద సుమారు 69వేల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతున్నది. దిగువన ధవళేశ్వరం బరాజ్‌కు 95వేల క్యూసెక్కులవరకు ఇన్‌ఫ్లో వస్తుండగా.. సముద్రంలోకి 1.09 లక్షల క్యూసెక్కుల గోదావరిజలాల్ని వదులుతున్నారు. గత నెల ఒకటోతేదీనుంచి శుక్రవారం ఉదయంవరకు 31.046 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి.

విలోచవరం చేరిన గోదారమ్మ

అన్నారం బరాజ్ రోజురోజుకు నిండుతుండటంతో గోదావరి జలాలు శుక్రవారం మంథని మండలం విలోచవరందాకా చేరా యి. మరో నాలుగు కిలోమీటర్లు ప్రవహిస్తే అన్నారం పంపుహౌస్‌లోకి చేరే అవకాశం ఉన్నది. పంపుహౌస్ అప్రోచ్ చానల్‌లోకి నీరు చేరగానే గేట్లు మూసి సుందిల్ల బరాజ్‌ను నింపడమే తరువాయి. ఇందుకు సంబంధించిన అన్నిఏర్పాట్లను కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ నల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఈ క్రమంలో గోదావరి ఎండే సమయంలో ఎక్కడెక్కడ చివరగా నీరు కనిపించిందో అక్కడక్కడి నుంచి నీరు పైకి ఎక్కుతున్న అద్భుతమైన దృశ్యాన్ని చూడటానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అన్నారం బరాజ్ ద్వారా వెనక్కివస్తున్న నీళ్లు అన్నారం పంపుహౌస్‌కు చేరుకునేలోగానే మోటర్లను వెట్‌రన్‌కు సిద్ధంచేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో పంప్‌హౌస్‌కు ఎగువన ఉన్న సుందిల్ల బరాజ్‌లో నిల్వ ఉన్న 0.06 టీఎంసీల నీటిని 3వ గేటు ఎత్తివేసి మంగళవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ నీరు అన్నారం పంపుహౌస్ డ్రాఫ్ట్ ట్యూబ్ గేట్ల వద్దకు చేరుకున్నది. శుక్రవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి ఆదేశాల మేరకు అన్నారం పంపుహౌస్ ఈఈ ఎలకొండ యాదగిరి, డీఈలు వొల్లాల వెంకటేశ్వర్లు, బిట్ల మధుసూదన్ ప్రత్యేకపూజలుచేసి హెడ్ రెగ్యులేటరీ గేట్ల ను తెరిచారు. ఆ నీరు పంప్‌హౌస్ ఫోర్‌బేలోకి చేరింది. పంప్‌హౌస్‌లో నీటి మట్టం ఐదు మీటర్లు పెరుగగా 16 మీటర్ల వాటర్‌హెడ్‌కు చేరుకోగానే మరిన్ని పరీక్షలు చేసి మోటర్లను పనిచేయించనున్నారు.

తుపాకులగూడెం వద్ద తగ్గిన ప్రవాహం

ఇన్‌టేక్‌వెల్ వద్ద మూడు మోటర్లతో పంపింగ్

ఏటూరునాగారం(ములుగు): ఎగువ నుంచి వరదతో గోదావరి ప్రవాహం నిరాటంకంగా కొనసాగుతున్నది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద శుక్రవారం నీటిమట్టం 73.40 మీటర్లకు చేరుకున్నది. గత రెండ్రోజులుగా గోదావరి వరద తగ్గుముఖం పడుతున్నది. ఇక్కడ 72 మీటర్ల ప్రవాహం ఉంటే ఇన్‌టేక్ వెల్‌లోని మోటర్లు నడిచే అవకాశం ఉంది. ఇన్‌టేక్ వెల్‌లోని మొదటి, రెండో, మూడోదశల్లో ఒక్కో మోటర్‌తో నీటిని ఎత్తిపోస్తున్నట్టు అధికారులు తెలిపారు. దేవాదుల కిందిభాగంలో నిర్మిస్తున్న తుపాకులగూడెం బరాజ్‌వద్ద కూడా గోదావరి ప్రవాహం తగ్గుతున్నది. మరికొంత తగ్గితే ఇక్కడ పనులు చేపట్టే అవకాశం ఉన్నది. ఇక్కడి పరిస్థితిని శుక్రవారం ఈఈ జగదీశ్ పరిశీలించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలంవద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ తగ్గుతున్నది. శుక్రవారం ఉదయం 6 గంటలకు 14.9 అడుగులున్న గోదావరి.. సాయంత్రం ఆరు గంటలకు 14.4 అడుగులకు తగ్గింది.

భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

లోకం పోకడ



మరో వారం మందగమనమే

- చురుకుగా కదలని రుతుపవనాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో 9 సెం.మీ. వర్షపాతం
- పలు జిల్లాల్లో ఓ మోస్తరు వానలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రుతుపవనాలు మందగమనంలోనే సాగుతున్నాయి. ఉత్తర తెలంగాణలోని కొన్ని ప్రాంతాలు మినహా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి వానలు కూడా కరువయ్యాయి. ప్రస్తుతం ఉపరితల ఆవర్తనాలు, అల్పపీడనం వంటివి లేకపోవడంతో రుతుపవనాలు చురుకుగా కదిలే పరిస్థితి కనిపించడం లేదని, వారంరోజుల వరకు రుతుపవనాలు మందగమనంలోనే ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఉత్తర తెలంగాణలో రుతుపవనాలు కొంత చురుకుగా ఉన్నా, దక్షిణ తెలంగాణలో పరిస్థితి అంత ఆశాజనకంగా లేదని చెప్పారు. కాగా, గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు నిజామాబాద్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, నిజామాబాద్ జిల్లా నవీపేట, మాక్లూర్, బోధన్‌లో 8 సెం.మీ., ఎడపల్లిలో 7 సెం.మీ., కామారెడ్డి జిల్లా మద్నూరు, బీర్కూరు, నిజామాబాద్ జిల్లా కోటగిరి, మహబూబాబాద్‌లో 6 సెం.మీ., నిజామాబాద్, బాల్కొండ, ఆర్మూర్, మోర్తాడు, రేంజల్‌లో 5 సెం.మీ., భూపాలపల్లి జిల్లా ఏటూరునాగారంలో 4 సెం.మీ., రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో 3 సెం.మీ., కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పలు జిల్లాల్లో ఓ మోస్తరు వానలు పడ్డాయి. నిజామాబాద్ జిల్లాలో మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. జిల్లావ్యాప్తంగా గురువారం 34.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. వేల్పూర్‌లో 48.4 మి.మీ., మోర్తాడ్‌లో 47.5, కోటగిరిలో 44.2, ఏర్గట్లలో 43.3, వర్నిలో 42.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాఆసిఫాబాద్, పెంచికల్‌పేట్ మండలకేంద్రాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ములుగు జిల్లాలోని వాజేడు, ఏటూరునాగారం, వెంకటాపురం (నూగూరు) మండలాల్లో ఓ మోస్తరు వాన పడగా, మిగిలిన మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, ధారూరు మండలాల్లో శుక్రవారం ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. మోమిన్‌పేటలో 8.4 మి.మీ., నవాబుపేటలో 5.4 మి.మీ., వికారాబాద్‌లో 6.4 మి.మీ., పూడూరులో 6.4 మి.మీ., బంట్వారంలో 6 మి.మీ. వర్షం పడింది.

నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలో పారుతున్న జన్నేపల్లి వాగు

బీసీ గురుకులాల్లో 1698 పోస్టుల భర్తీ

మూడోపేజీ తరువాయి...

తెలంగాణలో బీసీ గురుకులాలు కేవలం 19 మాత్రమే ఉన్నాయి. రాష్ట్రంలోని బీసీ కుటుంబాల్లో విద్యా వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రత్యేక చొరవ చూపారు. 2016–17 విద్యాసంవత్సరంలో మాదిరిగానే.. ఈ విద్యాసంవత్సరం కూడా అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 బీసీ గురుకుల విద్యాలయాలను ఏర్పాటు చేశారు. దీంతో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాల సంఖ్య ప్రస్తుతం 280కి పెరిగింది. బీసీ గురుకులాల్లో వసతుల కల్పనతోపాటు బోధనా సిబ్బంది నియామకాలను సీఎం కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నారు.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక బీసీ గురుకుల విద్యాలయాల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం విడుదలచేసిన బడ్జెట్

ఆర్థికసంవత్సరం	బడ్జెట్ విడుదల రూ.కోట్లలో
2015–16	33.98
2016–17	51.45
2017–18	168.71
2018–19	246.47

ప్రజారోగ్యం, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి!

- బీజేపీ మహిళా ఎంపీలకు ప్రధాని మోదీ సలహా

న్యూఢిల్లీ, జూలై 12: బీజేపీ మహిళా ఎంపీలతో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం అల్పాహార సమావేశం నిర్వహించారు. ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ఈ భేటీ జరిగింది. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, పోషకాహారలోపాన్ని నిర్మూలించడం వంటి విషయాలపై దృష్టిసారించాలని మహిళా ఎంపీలకు ఆయన సలహా ఇచ్చారు. ఈ భేటీలో 30 మందికి పైగా ఎంపీలు పాల్గొని, వివిధ సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకొచ్చారు. మహిళా ఎంపీల విజ్ఞప్తులను ప్రధాని సావధానంగా విన్నారు. నైపుణ్యాలతో మహిళలు సులభంగా ప్రజలతో మమేకం కాగలరని ప్రధాని అన్నారు. పార్లమెంటులోని బీజేపీ ఎంపీలతో ప్రధాని మోదీ ఏడు సమావేశాలు నిర్వహిస్తారని ఇప్పటికే ఆ పార్టీ వెల్లడించింది. ఓబీసీ, ఎస్‌సీ, ఎస్‌టీ ఎంపీలతో పాటు పార్లమెంటుకు మొదటిసారిగా ఎన్నికైన ఎంపీలతో ఇప్పటికే ప్రధాని వేరువేరుగా భేటీలు నిర్వహించారు. పార్లమెంటులోని ఎంపీలు ప్రధానితో ముఖాముఖి మాట్లాడేందుకు, సమస్యలపై చర్చించి సలహాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు అవకాశం కల్పిస్తాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.

డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యం ముద్దు

బాటిల్ క్యాప్ చాలెంజ్‌తో యువతకు కేంద్రమంత్రి రిజిజు సందేశం

న్యూఢిల్లీ, జూలై 12: బాటిల్ క్యాప్ చాలెంజ్ పేరుతో సీసా మూత తెరిచే సవాల్ ఇటీవల భారత్‌లో బాగా ప్రాచుర్యం పొందింది. అక్షయ్‌కుమార్, సోనూ సూద్, సుస్మితా సేన్ వంటి సినీ నటులు, యువరాజ్ సింగ్ వంటి క్రీడాకారులు ఈ చాలెంజ్‌ను స్వీకరించగా తాజాగా రాజకీయ నేతలు వారిని అనుసరిస్తున్నారు. కేంద్ర క్రీడల శాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు బాటిల్ క్యాప్ చాలెంజ్ స్వీకరించి ఒక సీసా మూతను కాలితో తెరిచారు. దీనికి సంబంధించిన వీడియోను తన ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాల్లో పోస్టు చేశారు. దీంతో పాటు యువతకు ఓ సందేశం కూడా ఇచ్చారు.'యువతే మన దేశ భవిష్యత్. మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి. ఆరోగ్య భారత్ ప్రచారానికి సిద్ధంకండి' అని పిలుపునిచ్చారు. ఏకాగ్రత దృష్టితో విజయం సాధ్యం. మంచి ఆరోగ్యంతో చాలా సంతోషకరమైన జీవితం గడపవచ్చు' అని కిరణ్ రిజిజు యువతకు సందేశమిచ్చారు.

16న అర్ధరాత్రి చంద్రగ్రహణం

- 12:21 గంటలకు భూమి నీడలోకి చందమామ
- 17న తెల్లవారుజామున 1:31 గంటలకు గ్రహణం ప్రారంభం
- ఉదయం 4:30 గంటలకు ముగింపు
- గ్రహణం ఆసాంతం దేశమంతా వీక్షించే అవకాశం
- ఈ ఏడాదిలో ఇదే చివరి చంద్రగ్రహణం

న్యూఢిల్లీ, జూలై 12: ఈ నెల 16వ తేదీన అర్ధరాత్రి పాక్షిక చంద్రగ్రహణం సంభవించనున్నది. దాదాపు మూడు గంటలు సాగే ఈ చంద్రగ్రహణాన్ని దేశప్రజలందరూ వీక్షించవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతాలు మినహా దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా గ్రహణం ఆద్యంతం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈ ఏడాదిలో ఇదే చివరి చంద్రగ్రహణమని పేర్కొన్నారు. 16వ తేదీ అర్ధరాత్రి తర్వాత 12:12 గంటలకు చంద్రుడు భూమి ఉపచ్ఛాయలోకి ప్రవేశిస్తాడు. ఆ సమయంలో చందమామ చుట్టూ పలుచని నల్లటి పొర ఆవరించినట్టు కనిపిస్తుంది. చంద్రుడు 1:31 గంటల సమయంలో భూమి ప్రచ్ఛాయలోకి ప్రవేశించడంతో గ్రహణం ప్రారంభమవుతుంది. ఉదయం 3 గంటల ప్రాంతంలో గరిష్ఠ గ్రహణం కనిపిస్తుంది. తర్వాత మెల్లిగా బయటికి రావడం ప్రారంభం అవుతుంది. ఉదయం 4:30 గంటలకు ప్రచ్ఛాయ నుంచి బయటకు రావడంతో గ్రహణం పూర్తవుతుంది. ఉదయం 5:49 గంటలకు చందమామ భూమి ఉపచ్ఛాయ నుంచి బయటికి వస్తుంది.

- ఈ చంద్రగ్రహణాన్ని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వాటిచుట్టూ ఉన్న కొన్ని ద్వీపాలు, ఆఫ్రికాలో ఏ ప్రాంతం నుంచైనా చూడవచ్చు. ఆసియాలోని మారుమూల ఈశాన్య ప్రాంతాలు, ఐరోపాలో స్కాండినేవియాలోని మారుమూల ఉత్తర ప్రాంతాలు మినహా అన్ని చోట్లా వీక్షించే అవకాశం ఉన్నది. దక్షిణ అమెరికాలోని పలు చోట్ల గ్రహణం ఆవిష్కృతం అవుతుంది.
- చంద్రుడు భూమి ప్రచ్ఛాయలోకి ప్రవేశించే దృశ్యాన్ని న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, రష్యాల్లోని కొన్ని ప్రాంతాలు, ఉభయ కొరియాలు, చైనాలోని దక్షిణ మారుమూల ప్రాంతాల్లో స్పష్టంగా వీక్షించవచ్చు.
- అర్జెంటీనా, చిలీ, బొలీవియా, పెరూ, దక్షిణ అట్లాంటిక్ సముద్రం, బ్రెజిల్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి గ్రహణం ముగిసి చంద్రుడు ఉదయించే దృశ్యాన్ని స్పష్టంగా చూడొచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

కర్ణాటకం బ్రేక్ కే బాద్!

రెబల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ ఈ నెల 16 వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దు: సుప్రీంకోర్టు ■ బలపరీక్షకు సిద్ధం: ముఖ్యమంత్రి కుమారస్వామి

సీఎం కోరిన సమయంలో నిర్వహిస్తామన్న స్పీకర్ ■ ఎమ్మెల్యేలను రిసార్టుకు తరలించిన బీజేపీ

బెంగళూరు/న్యూఢిల్లీ, జూలై 12: కర్ణాటకలో నెలకొన్న రాజకీయ సంక్షోభానికి తాత్కాలిక బ్రేక్ పడింది. వారం నుంచి సాగుతున్న హైడ్రామా శుక్రవారం కొత్తమలుపు తిరిగింది. అధికార కూటమికి చెందిన 10 మంది రెబల్ ఎమ్మెల్యేల రాజీనామాపై ఈ నెల 16వ తేదీ వరకు ఏ నిర్ణయం ప్రకటించొద్దని స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. మరోవైపు తాము బలపరీక్షకు సిద్ధమని సీఎం కుమారస్వామి శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. అందుకు సమయం కేటాయించేందుకు స్పీకర్ రమేశ్‌కుమార్ సమ్మతించారు. అధికార కూటమికి చెందిన 16 మంది ఎమ్మెల్యేల రాజీనామా, ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించడంతో ప్రభుత్వం సంక్షోభంలో పడ్డ సంగతి తెలిసిందే.

16 వరకు ఎలాంటి చర్యలొద్దు

కాంగ్రెస్-జేడీఎస్ కూటమికి చెందిన 10 మంది రెబల్ ఎమ్మెల్యేల రాజీనామా, అనర్హత వేటు విషయంలో కర్ణాటక స్పీకర్ ఈ నెల 16 వరకు ఏ నిర్ణయం తీసుకోవద్దని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్‌లు దీపక్ గుప్తా, అనిరుద్ధ బోస్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీచేసింది. ఈ కేసులో పలు ప్రశ్నలు, రాజ్యాంగబద్ధ అంశాలు తెరపైకి వస్తున్నందున మరింత లోతుగా విచారణ జరుపాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో యథాతథ స్థితిని కొనసాగిస్తున్నామన్నది. రెబల్ ఎమ్మెల్యేల పిటిషన్లపై ఆర్టికల్ 32 కింద విచారణ జరుపడం, ఆర్టికల్ 190, 361ల ప్రాధాన్యం, అసెంబ్లీ స్పీకర్ ఎమ్మెల్యేల రాజీనామాలను అంగీకరించకముందే వారిపై అనర్హత వేటు వేసే అవకాశం ఉన్నదా? తదితర అంశాలపై విచారణ జరుపాలని ధర్మాసనం తెలిపింది. అంతకుముందు రెబల్ ఎమ్మెల్యేల తరపున ముకుల్ రోహత్గీ వాదిస్తూ స్పీకర్ కావాలనే 10 మంది ఎమ్మెల్యేల రాజీనామా లేఖల కన్నా ముందు వారిపై అనర్హత వేటేసే అంశాన్ని పరిశీలిస్తున్నారన్నారు. ఓవైపు రాజీనామాలను పరిశీలిస్తున్నానంటూనే, మరోవైపు సుప్రీంకోర్టు అధికారాలను ప్రశ్నిస్తున్నారన్నారు. స్పీకర్ వ్యవహారశైలి రెండు గుర్రాలపై స్వారీ చేస్తున్నట్లున్నదని చెప్పారు. 'ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. బడ్జెట్‌కనుకూలంగా ఓటేయాలని ప్రభుత్వం విప్ జారీచేసింది. రెబల్ ఎమ్మెల్యేలు వ్యతిరేకంగా ఓటేస్తే వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ భావిస్తున్నందునే రాజీనామాల అంశం పెండింగ్‌లో ఉంచారు. కాబట్టి రాజీనామాలపై నిర్ణయం తీసుకునే వరకు అనర్హత వేటు వేయకుండా నిర్దేశించాలి' అని రోహత్గీ కోరారు. సీఎం కుమారస్వామి, స్పీకర్ రమేశ్ కుమార్ తరపున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ 'సుప్రీంకోర్టు తీర్పును సవాల్ చేసే అధికారం స్పీకర్‌కు ఉన్నదా? రాజీనామా లేఖలను పరిశీలించకముందే అనర్హత వేటు వేయొద్దనే అంశంపై మేం ఏ ఆదేశాలివ్వొద్దని మీరు మాకు సూచిస్తున్నారా?' అని సింఘ్వీని ప్రశ్నించింది. దీనికి సింఘ్వీ అదేమీ లేదని, నిర్దేశిత గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించడం సరికాదన్నారు. రెబల్స్ అనర్హత వేటు తప్పించుకునేందుకే రాజీనామా చేశారని సింఘ్వీ చెప్పారు.

రిసార్టులకు ఎమ్మెల్యేలు

బలపరీక్షకు సిద్ధమని సీఎం కుమారస్వామి ప్రకటించడంతో రిసార్టు రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. బీజేపీ ఎమ్మెల్యేలను బెంగళూరు శివారులోని రిసార్టుకు తరలించినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం తమ ఎమ్మెల్యేలను కొనుగోలుకు ప్రయత్నిస్తున్నదన్న సమాచారంతో అంతా ఒకేచోట ఉండాలని నిర్ణయించుకున్నట్టు కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు యడ్యూరప్ప చెప్పారు. సీఎం ఎప్పుడు విశ్వాస పరీక్షను ఎదుర్కొంటారన్న దాన్ని బట్టి తమ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో రెబల్స్‌ల్లో మానసిక స్థైర్యం వచ్చిందన్నారు. వారు రాజీనామా చేసినందున ప్రభుత్వం జారీ చేసిన విప్ వారికి వర్తించదన్నారు.

బలపరీక్షలో గెలిస్తేనే సీఎంగా కొనసాగుతా

తాము బలపరీక్షకు సిద్ధమని శుక్రవారం కర్ణాటక అసెంబ్లీలో సీఎం కుమారస్వామి మాట్లాడుతూ సంచలన ప్రకటన చేశారు. సమయం కేటాయించాలని స్పీకర్ రమేశ్‌కుమార్‌ను కోరారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో బలపరీక్షకు వెళ్లాలని నేను నిర్ణయించుకున్నాను. సభ విశ్వాసం పొందితేనే నేను పదవిలో కొనసాగుతాను. కొందరు ఎమ్మెల్యేల చర్యలతో ఈ సంక్షోభం ఏర్పడింది. ఏ పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం. సీఎం కుర్చీని అంటిపెట్టుకోవడం, అధికార దుర్వినియోగానికి పాల్పడటం నాకు ఇష్టంలేదు' అని అన్నారు. బలపరీక్ష నిర్ణయం స్వతంత్రంగానే తీసుకున్నట్టు చెప్పారు. దీనిపై స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ స్పందిస్తూ సీఎం కోరుకున్న సమయంలో బలపరీక్షకు సమయం కేటాయిస్తామన్నారు. సమావేశం తర్వాత స్పీకర్ మీడియాతో మాట్లాడారు. 'ప్రస్తుత గందరగోళ పరిస్థితులను ఇంకా కొనసాగించడం, అధికార పీఠాన్ని అట్టిపెట్టుకొని ఉండటం తనకు ఇష్టం లేదని సీఎం చెప్పారు. సభ విశ్వాసాన్ని పొందుతానని, ఇందుకు తగిన సమయాన్ని కేటాయించాలని నన్ను కోరారు. బలపరీక్షకు సిద్ధమని ఆయన ప్రకటించిన మరునాడే నేను సమయం కేటాయిస్తాను' అని అన్నారు. శుక్రవారం సమావేశాలను ఇటీవల మరణించిన ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలకు సంతాపం ప్రకటించేందుకు కేటాయించారని, సీఎం వారికి నివాళులు అర్పించడాన్ని పక్కనబెట్టి బలపరీక్ష ప్రకటన ఎలా చేస్తారని బీజేపీ నేత కేఎస్ ఈశ్వరప్ప విమర్శించారు. మరోవైపు రాజీనామా చేసిన ఎమ్మెల్యేలు ఆనంద్ సింగ్, ప్రతాప్‌గౌడ పాటిల్, నారాయణ గౌడ వాదనలను స్పీకర్ శుక్రవారం విన్నారు. 224 మంది సభ్యులు గల కర్ణాటక అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 113 మంది ఎమ్మెల్యేలు కావాలి. కాంగ్రెస్, జేడీఎస్ కూటమికి 116 మంది సభ్యుల బలం ఉన్నది. వీరిలో 16 మంది రాజీనామాలు సమర్పించారు. వీటిని స్పీకర్ ఆమోదిస్తే కూటమి బలం 100కు పడిపోతుంది. ప్రభుత్వం కూలిపోతుంది. ప్రతిపక్ష బీజేపీకి 105 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఇద్దరు స్వతంత్రుల మద్దతు కూడా ఉన్నది.

స్పీకర్ అధికారమెంత?

కర్ణాటకలో రాజకీయ పరిస్థితులు మరోసారి స్పీకర్ అధికారాలపై చర్చను లేవనెత్తాయి. ఒక ఎమ్మెల్యే/ ఎంపీ ఇష్టమొచ్చినప్పుడు రాజీనామా చేయొచ్చా? వాటిని స్పీకర్ కచ్చితంగా ఆమోదించాలా? వంటి పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాజ్యాంగంలోని 190వ ఆర్టికల్ ప్రకారం ఒక ఎమ్మెల్యే/ఒక ఎంపీ తన పదవికి ఎప్పుడైనా రాజీనామా చేయొచ్చు. అయితే 'స్పీకర్ ఫార్మాట్'లో రాజీనామా చేయాలి. దీనిపై నిర్ణయాధికారం స్పీకర్‌దే. ముందు స్పీకర్ విచారణ జరిపి.. ఆ ఎంపీ/ఎమ్మెల్యే నుంచి వ్యక్తిగతంగా వివరణ కోరవచ్చు. ఆ వివరణ సరైనదేనని, వారిపై ఒత్తిడి లేదని భావిస్తే ఆ రాజీనామాను స్పీకర్ ఆమోదిస్తారు. లేదంటే తిరస్కరిస్తారు. నిర్దేశిత గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలన్న నిబంధనేమీ లేదు. స్పీకర్ అనుమతి లేకుండా 60 రోజులు సమావేశాలకు గైర్హాజరైతే ఆ ఎంపీ/ఎమ్మెల్యేను పదవి నుంచి తొలిగించే అవకాశం ఉన్నది. ఏదైనా అంశంపై ఓటింగ్ సమయంలో పార్టీ విప్‌ను ఉల్లంఘించిన వారిపై స్పీకర్ అనర్హత వేటు వేయొచ్చు.

బ్యాంకు పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై సైద్ధాంతిక పోరాటం కొనసాగిస్తానన్న కాంగ్రెస్ నేత

అహ్మదాబాద్, జూలై 12: గుజరాత్‌లోని అహ్మదాబాద్ జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు (ఏడీసీబీ) దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం దావా కేసులో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి బెయిల్ మంజూరైంది. నోట్లరద్దు సమయంలో పాతనోట్లను కొత్త నోట్లకు మార్చిడి చేయడంలో ఈ బ్యాంకు పెద్ద కుంభకోణానికి పాల్పడిందని రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఏడీసీబీతో పాటు చైర్మన్ అజయ్ పాటిల్ రాహుల్‌పై క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. ఇందులో భాగంగా రాహుల్ గాంధీ అహ్మదాబాద్ స్థానిక కోర్టులో హాజరయ్యారు. రాహుల్ తరుపు న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా రూ.15,000 బాండుతో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 'నా రాజకీయ ప్రత్యర్థులైన బీజేపీ,ఆర్‌ఎస్‌ఎస్ నాపై మోపిన మరో కేసు నిమిత్తం నేను ఈ రోజు అహ్మదాబాద్‌లో ఉన్నా. వారిపై నా సైద్ధాంతిక పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇలా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. సత్యమేవ జయతే' అని రాహుల్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

చంద్రయాన్-2 ఊహాచిత్రం

జాబిల్లి వాహనం

న్యూఢిల్లీ: శాస్త్రవేత్తలే కాకుండా, సాధారణ ప్రజానీకం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్న చంద్రయాన్-2 ప్రయోగానికి కొన్ని గంటలే సమయమున్నది. ప్రయోగానికి సంబంధించిన రిహార్సల్స్‌ను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఇప్పటికే పూర్తి చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ నుంచి జులై 15న తెల్లవారుజామున 2:51గంటలకు చంద్రయాన్-2ను ప్రయోగించనున్నారు. జీఎస్ఎల్వీ మార్క్ 3 రాకెట్‌తో ఈ ప్రయోగం జరుగనున్నది. ఇస్రో చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన ప్రయోగాల్లో ఒకటిగా భావిస్తున్న చంద్రయాన్-2లో ఎన్నెన్నో విశేషాలున్నాయి.

ల్యాండర్, రోవర్‌పై జెండా పెయింట్

చంద్రయాన్ అంటే సంస్కృతంలో చంద్రుని వాహనం అని అర్థం. చంద్రయాన్-2లో కీలకమైన ల్యాండర్‌కు విక్రమ్(ప్రముఖ భారత అంతరిక్ష శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్‌కి గుర్తుగా) అని, రోవర్‌కు ప్రజ్ఞ(జ్ఞానం) అని నామకరణం చేశారు. ల్యాండర్, రోవర్‌లపై మూడు రంగుల భారత జాతీయ పతాకాన్ని పెయింట్ వేయించారు. రోవర్ ఆరు చక్రాలపై అశోక చక్రం గుర్తును ముద్రించడం విశేషం.

దేనికెంతంటే..

రూ.603 కోట్లు	ఆర్బిటార్, ల్యాండర్, రోవర్, నావిగేషన్ (గమన సమాచారం), గ్రౌండ్ సపోర్ట్ నెట్‌వర్క్
జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్	రూ.375 కోట్లు
రూ.978 కోట్లు	చంద్రయాన్-2 ప్రయోగం మొత్తం ఖర్చు

బిగిన వెంటనే పని షురూ!

ఇస్రో చేపట్టిన చంద్రయాన్-2 మిషన్ ఎంతో సంక్లిష్టమైంది. ఈ ప్రయోగంలో ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ మాడ్యూల్స్ ఉన్నాయి. ప్రయోగం చేపట్టిన 50 రోజుల (సెప్టెంబర్ 6 లేదా 7) తర్వాత భూమికి 3,85,000 కి. మీ. దూరంలో ఉన్న చంద్రుని కక్ష్యలోకి ఆర్బిటార్ ప్రవేశిస్తుంది. ఆర్బిటార్ కక్ష్యలోకి చేరుకున్న 4 రోజుల తర్వాత చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండర్ దిగుతుంది. ల్యాండర్ దిగిన 4గంటల తర్వాత ఆరు చక్రాలు గల రోవర్ నెమ్మదిగా కదలడం ప్రారంభిస్తుంది. సెకనుకు 1 సెం. మీ. వేగంతో రోవర్ ప్రయాణిస్తూ.. చంద్రుడి ఉపరితలం విశేషాలను విశ్లేషిస్తుంది. దిగిన 20 నిమిషాల్లోనే చంద్రుని ఉపరితల చిత్రాల్ని రోవర్.. భూమి మీదున్న ఇస్రో శాస్త్రవేత్తలకు పంపడం ప్రారంభిస్తుంది.

కీలక బాధ్యతల్లో మహిళలు

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చంద్రయాన్-2 ప్రయోగంలో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారు. ఈ మిషన్‌కి డైరెక్టర్‌గా రితూ కరిదాల్ వ్యవహరిస్తున్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ముత్తయ్య వనిత పనిచేస్తున్నారు. ఇస్రోలో దాదాపు 30శాతం మంది మహిళలు విధులు నిర్వహిస్తున్నారు. 1.4 బిలియన్ డాలర్లతో ఇస్రో త్వరలో ప్రయోగించనున్న గగన్‌యాన్ మిషన్ ద్వారా అంతరిక్షంలోకి పంపనున్న ముగ్గురు వ్యోమగాముల్లో ఒకరు మహిళనే!

నేడు గోవా క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ

పనాజీ: గోవాలో క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణకు ముహూర్తం ఖరారైంది. శనివారం తన క్యాబినెట్‌లో నలుగురికి కొత్తగా చోటు కల్పించనున్నట్లు గోవా సీఎం ప్రమోద్ సావంత్ శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు సావంత్ క్యాబినెట్ వ్యవస్థీకరణ జరుగనున్నది. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న గోవా ఫార్వర్డ్ పార్టీ (జీఎఫ్‌పీ) అధినేత విజయ్ సర్దేశాయ్‌తో పాటు ఆ పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులు, రెవెన్యూ మంత్రి, స్వతంత్ర సభ్యుడు రోహన్ ఖౌంటేలను మంత్రి పదవులకు రాజీనామా చేయాలని కోరినట్లు చెప్పారు. అయితే బీజేపీ జాతీయ నాయకత్వంతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని జీఎఫ్‌పీ అధినేత విజయ్ సర్దేశాయ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి విడివడి బీజేపీలో చేరిన పది మంది కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేల్లో ముగ్గురితోపాటు తనకూ క్యాబినెట్‌లో చోటు దక్కనున్నదని బీజేపీ నేత, గోవా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మిచైల్ లోబో మీడియాకు చెప్పారు. నలుగురు మంత్రులకు ఉద్వాసన పలుకడం న్యాయ సమ్మతమేనన్నారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు పునర్వ్యవస్థీకరణ ఉంటుందన్నారు.

భారత్‌లో తగ్గుతున్న పేదరికం

2006-2016 మధ్య 27.1 కోట్ల మంది పేదలకు విముక్తి

పేదరికాన్ని తగ్గించడంలో పురోగతి సాధించిన 10 దేశాలు: ఐరాస

న్యూయార్క్: పేదరికాన్ని తగ్గించటంలో భారత్ పురోగతి సాధించిందని, 2006-2016 మధ్య సుమారు 27.1 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేలా చర్యలు తీసుకున్నదని ఐక్యరాజ్యసమితి(ఐరాస) నివేదిక పేర్కొంది. ఆస్తులు, పారిశుద్ధ్యం, పోషకాహారం వంటి అంశాల్లో పురోగతిని ఆధారంగా చేసుకొని 'బహుముఖ పేదరిక సూచీ (మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ - ఎంపీఐ) - 2019' నివేదికను ఐరాస గురువారం విడుదల చేసింది. 101 దేశాల (31 అల్ప ఆదాయం, 68 మధ్య ఆదాయం, 2 అధిక ఆదాయం దేశాలు) పై చేసిన ఈ అధ్యయనంలో దాదాపు 103 కోట్ల మంది ప్రజలు బహుముఖ పేదరికంతో బాధపడుతున్నట్టు తేలింది. పేదరికాన్ని ఆదాయం పరంగానే కాకుండా ఆరోగ్య సదుపాయాలు, పని నాణ్యత, హింస వంటి అంశాలను సైతం పరిగణలోకి తీసుకొని లెక్కించారు. 200 కోట్ల జనాభా నివసిస్తున్న 10 దేశాలు ఈ బహుముఖ పేదరికాన్ని తగ్గించడంలో పురోగతి సాధించినట్టు నివేదిక పేర్కొంది. బంగ్లాదేశ్, కంబోడియా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇథియోపియా, హైతీ, భారత్, నైజీరియా, పాకిస్థాన్, పెరూ, వియాత్నం దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. భారత్, కంబోడియా దేశాలు బహుముఖ పేదరిక సూచీలో స్థానాల్ని (ఎంపీఐ విలువలు) అత్యంత వేగంగా తగ్గించుకున్నాయని నివేదిక తెలిపింది. (ఎంపీఐ విలువ లేదా స్థానం తగ్గితే, పేదరికం తగ్గినట్టు భావిస్తారు). భారత్ ఎంపీఐ విలువ 0.283 (2005-06) నుంచి 0.123 (2015-16) కి తగ్గింది. పోషకాహారం, పారిశుద్ధ్యం, శిశు మరణాలు తగ్గడం, తాగునీరు, పాఠశాల విద్య, విద్యుత్, స్కూల్‌లో విద్యార్థులు హాజరుశాతం, గృహవసతి, వంటచెరుకు, గ్యాసు, ఆస్తులు వంటి అంశాల్లో ఇథియోపియా, భారత్, పెరూ దేశాలు పురోగతి సాధించాయని ఎంపీఐ తెలిపింది. భారత్‌లో 2005-2006లో 64 కోట్ల మంది (55.1శాతం) ప్రజలు బహుముఖ పేదరికంలో ఉండగా.. 2015-16 నాటికి వీరి సంఖ్య 36.9 కోట్ల (27.9శాతం) కి తగ్గింది. ఈ కాలంలో దేశంలో పోషకాహార లోపం 44.3 శాతం నుంచి 21.2 శాతానికి, శిశుమరణాలు 4.5 శాతం నుంచి 2.2 శాతానికి, వంటచెరుకు, గ్యాసు కొరత 52.9 శాతం నుంచి 26.2 శాతానికి, పారిశుద్ధ్య లేమి 50.4 శాతం నుంచి 24.6 శాతానికి, తాగునీటి సమస్య 16.6 శాతం నుంచి 6.2 శాతానికి, విద్యుత్ సమస్య 29.1 శాతం నుంచి 8.6 శాతానికి, గృహవసతి కొరత 44.9 శాతం నుంచి 23.6 శాతానికి తగ్గిందని నివేదిక పేర్కొంది.

చెన్నైకి చేరిన 'నీటి రైలు'

- వ్యాగన్ల ద్వారా 25 లక్షల లీటర్ల నీరు చేరవేత
- నీటి ఎద్దడి నేపథ్యంలో రోజుకు కోటి లీటర్ల సరఫరా లక్ష్యం

చెన్నై, జూలై 12: సమయానికి వర్షాలు కురువక తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న తమిళనాడు రాజధాని చెన్నైకి ఊరట లభించింది. వేలూరు జిల్లాలోని జోలార్‌పెట్టై ప్రాంతం నుంచి బయలుదేరిన నీటి రైలు శుక్రవారం చెన్నైకి చేరుకుంది. మొత్తం 50 వ్యాగన్లు కలిగిన ఈ రైలు 25 లక్షల లీటర్ల నీటిని తీసుకొని విల్లివాకంలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీకి చేరుకుంది. ఈ రైలు నుంచి నీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు ప్రత్యేక పైపుల ద్వారా తరలిస్తారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి నీటిని తరలించాక అక్కడి నుంచి ప్రజలకు సరఫరా చేస్తారు. చెన్నైలో సమృద్ధిగా వర్షాలు కురిసి రిజర్వాయర్లు నిండే వరకు దాదాపు ఆరు నెలలపాటు ఈ ఏర్పాట్లు కొనసాగనున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సమయానికి రాకపోవడంతో చెన్నైకి నీటిని సరఫరా చేసే నాలుగు రిజర్వాయర్లు ఎండిపోయాయి. దీంతో గత ఐదు నెలలుగా చెన్నై తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో చొరవ తీసుకున్న సీఎం పళనిస్వామి నీటి సరఫరా కోసం సహకరించాలని రైల్వే శాఖను కోరారు. అంతేగాక నీటి సరఫరా కోసం నిధులను కేటాయించారు. నీటి రైలు విల్లివాకంకు చేరుకోగానే మంత్రులు స్వాగతం పలికారు. అయితే ఈ రైలుకు స్వాగతం పలుకడానికి మంత్రులు ఆలస్యంగా వచ్చారు. అంతేగాక రైలుతో ఫొటోలు దిగుతూ సమయం వృథా చేశారు. దీంతో నీటి పంపిణీ ఆలస్యమైంది.

రైలు వ్యాగన్ల నుంచి నీటిని అన్‌లోడ్ చేస్తున్న సిబ్బంది

18 ఏండ్ల తర్వాత..

- చెన్నై నీటి అవసరాల కోసం దాదాపు 18 ఏండ్ల తర్వాత రైలులో నీళ్లను తీసుకొస్

రైల్వేల అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు నిధులు అవసరం. దేశ ప్రయోజనాలు దృష్టిలోపెట్టుకొనే కార్పొరేట్ నిధులను ఆహ్వానిస్తున్నాం. రైల్వేలను పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్వహిస్తూ కొత్త ప్రాజెక్టులు, లైన్లు, టెక్నాలజీ అభివృద్ధికి కృషిచేస్తాం. రైల్వేలను ఎంతమాత్రం ప్రైవేట్ పరం చేయబోం.

పీయుష్ గోయల్, కేంద్ర రైల్వే మంత్రి

తిరుగుబాటు ఎమ్మెల్యేలు తిరిగివచ్చి, తమ రాజీనామాలను ఉపసంహరించుకుంటారన్న నమ్మకం ఉన్నది. ఈ ప్రభుత్వాన్ని రక్షించేందుకు చివరి నిమిషం వరకూ ప్రయత్నిస్తాం. కుమారస్వామి వచ్చే నాలుగేండ్లు కూడా సీఎంగా కొనసాగుతారు.

డీకే శివకుమార్, కాంగ్రెస్ నేత

చరిత్రలో నేడు

1923

అమెరికా లాస్ ఏంజెల్స్ పర్వత ప్రాంతంలో 'హాలీ వుడ్ ల్యాండ్' ప్రారంభం. తర్వాతి కాలంలో ఇదే హాలీవుడ్‌గా మారింది.

1923

మంగోలియా గోబీ ఎడారిలో డైనోసార్స్ గుడ్లను కనుగొన్న అమెరికా శాస్త్రవేత్త రాయ్ చాప్‌మెన్ ఆండ్రూస్.

1930

మొట్టమొదటి ప్రపంచ ఫుట్‌బాల్ కప్ పోటీలు ఉరుగ్వేలో ప్రారంభం.

హెల్మెట్‌లను తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి, దీన్ని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు విధిగా పాటించాలని సూచించి నాలుగేండ్లయ్యింది వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సుప్రీం తెలిపింది. అయినా ఈ విషయాన్ని అమల్లోకి తెచ్చేందుకు దేశ వ్యాప్తంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాలు నడుపుతున్నవారే ఇంకా హెల్మెట్లను ధరించటం లేదు. ఈ సందర్భంలోనే కేరళ ప్రభుత్వం సీట్ బెల్ట్ కూడా తప్పని సరిచేస్తూ చట్టం తీసుకురావటం గమనార్హం.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

నానాటికీ పెరుగుతున్న కాలుష్య ప్రమాదం గురించి కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు చర్యలకు ఉపక్రమించింది. ఒకరకంగా ప్లాస్టిక్ వినియోగం, వాటి వ్యర్థాల ప్రమాదమే అతి ఎక్కువగా ఉన్నది. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించటానికి ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నవి. ఈ క్రమంలోనే సీపీసీబీ ప్లాస్టిక్ వినియోగ వస్తువుల ఉత్పత్తిదారులను బాధ్యులను చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంట్లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, పతంజలి లాంటి పెద్ద సంస్థలు కూడా ఉన్నాయి. వాటి ఉత్పత్తులకు వాటినే బాధ్యులను చేస్తూ కాలుష్య నియంత్రణకు అవే పాటుపడాలని సూచించటం ఆహ్వానించదగిన పరిణామం.

ది హిందూ

రాజకీయ యాత్రలు!

గాంధీ జయంతి అక్టోబర్ 2 నుంచి అదే నెల 31వ తేదీ వల్లభాయి పటేల్ జయంతి వరకు పాదయాత్రలు చేపట్టాలని ప్రధాని మోదీ బీజేపీ నాయకులకు పిలుపునివ్వడం విశేషం. ప్రధాని ఇటీవల బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో గాంధీ ఇరువురు మహానుభావుల జయంతుల మధ్యకాలంలో 150 కిలోమీటర్ల పాదయాత్ర చేయాలని కోరారు. ఈ నెల రోజుల కాలం సరిపోదని భావిస్తే గాంధీ వర్ధంతి అయిన జనవరి 31 వరకు పొడిగించుకోవచ్చునని, ఏదైనా పార్టీ నిర్ణయించాలని ఆయన సూచించారు. బీజేపీ గెలుచుకున్న 303 లోక్‌సభ స్థానాల్లో ఎంపీలు ఈ పాదయాత్రకు నాయకత్వం వహించాలని మరో 199 స్థానాల్లో పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు ముందుండి నడిపించాలని అన్నారు. ఈ పాదయాత్రల సందర్భంగా మొక్కలు నాటడం వంటి భిన్న కార్యక్రమాలు చేపడుతూ పార్టీని సమాజంలోకి చొచ్చుకుపోయే చేయాలనేది మోదీ లక్ష్యంగా కనిపిస్తున్నది. ప్రతి నియోజకవర్గంలో 150 గ్రూపులను తయారుచేసి పాల్గొనేలా చేయాలని బీజేపీ భావిస్తున్నది. పార్టీ తరపున పాదయాత్రలే కాకుండా, ప్రభుత్వం తరపున కూడా గాంధీ 150వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టాలనేది బీజేపీ వ్యూహం. గాంధీ సిద్ధాంతాలతో బీజేపీ ఎంతవరకు ఏకీభవిస్తుందనేది నిమిత్తం లేకుండా, ప్రజల్లో ఆయనకున్న ఆరాధనాభావాన్ని పార్టీకి అనుకూలంగా మలుచుకోవాలనేది మోదీ ఆలోచన. ఒక్కమాటలో చెప్పాలంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి కాంగ్రెస్ నాయకులు ఎట్లయితే గాంధీ వారసులమని చెప్పుకున్నారో, బీజేపీ కూడా ఏదో ఒకరీతిలో అదే బాటలో నడువదలుచుకున్నది. ఇవాళ ఖద్దరు అంగీ, టోపీ ధరించినా కాంగ్రెస్ నాయకులను గాంధీ వారసులుగా నమ్మే పరిస్థితి లేదు. ఈ శూన్యాన్ని బీజేపీతో భర్తీ చేయాలనేది మోదీ వ్యూహం.

నెల్సన్ మండేలా, సూకీ, మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్, బరాక్ ఒబామా వంటి అనేక మం దికి గాంధీ స్ఫూర్తిదాయకం. వివిధ దేశాల్లోని భిన్న సంస్కృతులకు చెందిన కవులు, కళాకారులు, నాయకులు, తత్వవేత్తలు గాంధీని అభిమానిస్తారు. ప్రధాని మోదీకి, బీజేపీ పెద్దలకు నిజంగా గాంధీ బోధనల పట్ల నిబద్ధత ఉంటే తమ పాలనావిధానాలను తదనుగుణంగా రూపొందించుకోవాలె. స్వాతంత్ర్యోద్యమ కాలం మాదిరిగానే నేటికీ గాంధీ బోధనలు ఎంతో వర్తించేవి. ప్రపంచీకరణ, విచ్చలవిడి వినియోగ సంస్కృతి పేట్రేగుతున్న కాలమిది. కానీ గాంధీ నిరాడంబర జీవనాన్ని ఆచరించాడు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖద్దరు అంగీ, టోపీ ధరించడమే తప్ప గాంధీ ఆశయాలకు కట్టుబడి ఉన్నదంటూ ఏమీ లేదు. కాంగ్రెస్ ఏకైక పార్టీగా ఉంటూ అధికారాన్ని చాలా కాలమే నెరిపింది. పూర్తిగా గాంధీ ఆశయాల ప్రకారమే దేశాన్ని పాలించనప్పటికీ, స్థూలంగా గాంధీ సూత్రాలకు దగ్గరగా ఉండే లౌకికవాదాన్ని, పరమత సహనాన్ని అనుసరించే ప్రయత్నం చేసింది. తొలినాళ్ళలో దేశ విధానాలు గాంధీ, నెహ్రూతో పాటు నాటి స్వాతంత్ర్యోద్యమ ప్రముఖులు చాటిన ఆశయాలు, విలువలకు అనుగుణమైనవని చెప్పవచ్చు. కానీ బీజేపీ సైద్ధాంతికంగా గాంధీ విధానాలకు భిన్నమైంది. స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి గాంధీతో మతవాదులకు తీవ్ర విభేదాలున్నాయి. వాజపేయి బీజేపీ నాయకుడిగా ఉన్నప్పుడు ఒక దశలో గాంధేయ సామ్యవాదాన్ని ప్రతిపాదించినప్పటికీ, జాతీయ రాజకీయాల్లో బీజేపీకి ఆమోదనీయత కల్పించడానికే తప్ప సిద్ధాంతానికి కట్టుబడి కాదు. బీజేపీకి నిజంగా గాంధీవాదం పట్ల నిబద్ధత ఉంటే అధికార పార్టీ కనుక తమ పరిపాలనను గాంధీ బోధనలకు అనుగుణంగా సాగించాలె. కానీ బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించి అధికారం చేపట్టిన నాటి నుంచి దేశవ్యాప్తంగా విద్వేష దాడులు పెరిగాయి. గోరక్షణ పేర 63 దాడులు జరిగినట్టు గణాంకాలను బట్టి తెలుస్తున్నది. ఈ దాడులు ఎక్కువగా బలహీనవర్గాలపై జరుగడం గమనార్హం. బెంగాల్‌లో మతకలహాలు జరిగినప్పుడు గాంధీ ఎంతో ఆవేదన చెంది నిరాహార దీక్ష చేపట్టడం దేశ ప్రజలకు ఇంకా నిన్నమొన్నటి జ్ఞాపకంగా ఉన్నది. గాంధీ కూడా పచ్చి హిందు మతావలంబి. కానీ ఆయన దృష్టిలో మతం హింసను కోరుకునేది కాదు. విలువలతో కూడిన జీవనాన్ని నిర్దేశించేది. జీవితమంతా అహింసను, మతసహనాన్ని బోధించిన గాంధీ చివరికి మతవాద దాడికే బలయ్యారు.

నెల్సన్ మండేలా, సూకీ, మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్, బరాక్ ఒబామా వంటి అనేక మందికి గాంధీ స్ఫూర్తిదాయకం. వివిధ దేశాల్లోని భిన్న సంస్కృతులకు చెందిన కవులు, కళాకారులు, నాయకులు, తత్వవేత్తలు గాంధీని అభిమానిస్తారు. ప్రధాని మోదీకి, బీజేపీ పెద్దలకు నిజంగా గాంధీ బోధనల పట్ల నిబద్ధత ఉంటే తమ పాలనావిధానాలను తదనుగుణంగా రూపొందించుకోవాలె. స్వాతంత్ర్యోద్యమ కాలం మాదిరిగానే నేటికీ గాంధీ బోధనలు ఎంతో వర్తించేవి. ప్రపంచీకరణ, విచ్చలవిడి వినియోగ సంస్కృతి పేట్రేగుతున్న కాలమిది. కానీ గాంధీ నిరాడంబర జీవనాన్ని ఆచరించాడు. గ్రామ స్వావలంబనను కోరుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా రహదారులు నిర్మించి దేశదేశాల మధ్య వస్తువుల సరఫరా చేయడం వల్ల ప్రకృతికి హాని కలుగుతుందే తప్ప సమాజ సంక్షేమానికి దారితీయదు. హిందు ముస్లిం ఐక్యతను కాంక్షించాడు. గాంధీ బోధనలను అనుసరిస్తే నేటి సామాజిక జాడ్యాలను విముక్తి చెందడమే కాదు, వాతావరణ మార్పు వంటి సమస్యలు కూడా పరిష్కారమవుతాయి. బీజేపీ పెద్దలు రాజకీయయాత్రలు చేపట్టడం కాదు. గాంధీ బోధనలకు అనుగుణమైన జీవనవిధానాన్ని అనుసరించాలె. హింసా ద్వేషాలకు తావులేని సమాజాన్ని నెలకొల్పాలె. సామాజిక- ఆర్థిక విధానాలలో, విదేశాంగ విధానంలో గాంధీ ఆశయాలను ప్రతిఫలించాలె.

జనగళం

శబ్దకాలుష్యానికి చెక్ పెట్టాలె

నగరాల్లో వాయు కాలుష్యానికి తోడు శబ్ద కాలుష్యం పెద్ద సమస్యగా పరిణమిస్తున్నది. ఈ మధ్యకాలంలో యువత పెద్ద పెద్ద ద్విచక్ర వాహనాలను, బుల్లెట్, ఎన్‌ఫీల్డ్ లాంటి వాహనాలను వినియోగిస్తూ వాటికి పెద్ద శబ్దం వచ్చేట్లు సైలెన్సర్లను పెట్టుకుంటున్నారు. నిజానికి అవి కూడా ఎలాంటి శబ్దం లేకుండా నడిచే పరిస్థితి ఉంటుంది. కానీ కొంతమంది యువత డాబు కోసం, ప్రత్యేకత కోసం పెద్ద శబ్దం వచ్చే తీరుగా వాటిని మార్చుకొని రోడ్లపై విపరీతమైన వేగంతో పోతూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. అలాంటి వాహనాలను ట్రాఫిక్, రవాణా శాఖాధికారులు సీజ్ చేసి శబ్దం రాకుండా చేయాలి. అప్పుడే శబ్ద కాలుష్యానికి చెక్ పెట్టినవారమవుతాం.

- నర్మాల కృష్ణతేజ, లక్ష్మీనగర్, కరీంనగర్,

కాళేశ్వరంతో కండ్లు తెరువాలె

కాంగ్రెస్, టీడీపీ పార్టీలు ఏండ్లకు ఏండ్లు రాష్ట్రాన్ని పాలించినా గోదావరి జలాలను వినియోగంచుకోవటానికి ప్రయత్నించలేదు. కానీ రాష్ట్ర అవతరణ తర్వాత టీఆర్ఎస్ పార్టీ, ముఖ్యమంత్రి కేసీఆర్ గోదావరి జలాలను తెలంగాణ సాగునీటి అవసరాలు తీర్చటానికి కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసి మూడేండ్లలోనే పూర్తిచేసి సాగునీటి అవసరాలను తీరుస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాన్ని హర్షించటానికి బదులు కోర్టు కేసులతో సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకోవటం ద్రోహపూరితమైన చర్యలే.

- వీర పూర్ణచందర్‌రావు,మూసాపేట, హైదరాబాద్

కనీస వసతులు కల్పించాలె

ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందునుంచే ప్రభుత్వం, ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని విస్తృత ప్రచారం చేశారు. దీంతో పట్టణాలు, నగరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున చేరారు. కొన్ని స్కూళ్లలో ప్రవేశాలు లేవని బోర్డులు పెట్టాల్సిన పరిస్థితి రావటం ముదావహం. కాబట్టి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వసతుల కల్పనపై శ్రద్ధపెట్టాలి.

- బత్తిని లక్ష్మయ్య, మిర్యాలగూడ

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ముక్తసరి

దేవులపల్లి ప్రభాకరరావు

గాలిలో మేడలు

ఐదేండ్ల మోదీజీ పాలనలో ఆర్థిక వ్యవస్థ స్థాయిలో పెరుగుదల కేవలం 0.85 (డిస్మల్ 85) మాత్రమే. తిరోగమన దశలో భారత క్రికెట్ జట్టు స్పీడుతో పరుగెత్తుతున్న మోదీజీ ప్రభుత్వం మరో ఐదేండ్లలో 2024 ఎన్నికల నాటికి 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి పెరుగుతుందంటే నమ్మడం కష్టమని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి పెరిగినా ఉపాధి అవకాశాలు హెచ్చుకుంటే, సర్వీసులు మెరుగుపడకుంటే ఫలితం శూన్యమని ఆర్థికవేత్తల అభిప్రాయం.

ఆకాశానికి నిచ్చెనలు వేయడం, పునాదులు లేని సౌధాలు నిర్మించడం, గాలిలో మేడలు కట్టడం, గగనంలో కుసుమాలు వికసించినట్లు, పరిమళాలు వెదజల్లినట్లు చూపించడం, ఎండమావుల్లో కుండపోతల వర్షాలు కురిసిన భ్రమలు కలిగించడం, అరచేతిలో వైకుంఠం చూపించ సాహసించడం సాధ్యమా అన్న సందేహం కలుగడం సహజమే. సాధ్యమే, సుసాధ్యమే అని ఇటీవల రెండవ సారి కేంద్రంలో అధికారం కైవసం చేసుకున్న మోదీజీ ప్రభుత్వం (బీజేపీ ఆధిపత్యంలో ఎన్డీయే ప్రభుత్వం) ప్రకటించిన ఆర్థిక సర్వే, ఆ తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2019 జూలై 5న 17వ లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2019-20 సంవత్సరపు సాధారణ బడ్జెట్ లోకానికి చాటిచెప్పాయి. ఒక మహిళామణి దేశం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇది తొలిసారి కాదు, బహుశా చివరిసారి కాబోదు. మొరార్జిదేశాయి మొండిగా రాజీనామా ఇచ్చి నిష్క్రమించిన తర్వాత ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఆర్థిక మంత్రిత్వ శాఖను కూడా చేపట్టి 1970లో ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో 1971 యుద్ధ మేఘాల ఛాయలు కనిపించాయి. అప్పటి, దాదాపు యాభై ఏండ్ల కిందటి భారత ప్రభుత్వ బడ్జెట్‌ను రూపొందించడంలో ఇందిరాజీకి ఉన్న ప్రీ హ్యాండ్ నిర్మలాజీకి లేదన్నది జగమెరిగిన సత్యం. అయితే, లండన్‌లోని ఒక ప్రైవేటు కంపెనీ జాబ్‌లో చేకూరిన సేల్స్‌గర్ల్ నైపుణ్యాన్ని నిర్మలాజీ మొన్నటి బడ్జెట్‌లో కొంతవరకు ప్రదర్శించగలిగారు. 2019 ఎన్నికల ప్రచారంలో మోదీజీ కావించిన ప్రసంగాల సారాంశం, నినాదాలు నిర్మలాజీ బడ్జెట్ ప్రసంగానికి ప్రేరణగా ఉపకరించాయని కామన్ సెన్స్ ఉన్న వాళ్లందరు క్షణాల్లో అర్థం చేసుకోగలుగుతారు. స్వతంత్ర భారతంలో గత 16 లోక్‌సభల చరిత్రలో ఆర్థిక మంత్రులందరు తమ బడ్జెట్ ప్రసంగ పత్రాలను బ్రీఫ్‌కేసులో భద్రంగా, గోప్యంగా పెట్టుకొని వచ్చేవారు, అయినా లీకులు జరుగవలసిన వాళ్లకు జరుగుతుండేవి. మొన్న నిర్మలాజీ ఒక ఎర్రబట్ట సంచీలో ప్రసంగ పత్రాలను తెచ్చారట. అదొక న్యూస్. నిర్మలాజీ 2 గంటల 15 నిమిషాలు అనర్గళంగా, ఆగకుండా బడ్జెట్ ప్రసంగం చదివారన్నది మరో వార్త. ఇందిరాజీ ఏ సందర్భంలో ఏ రంగు చీర కట్టుకున్నారో మీడియా వాళ్లు రిపోర్ట్ చేసేవారు. బడ్జెట్ ప్రసంగం చదువుతున్నప్పుడు నిర్మల చీర కట్టారో మీడియా రాయలేదు. ఇటువంటి న్యూస్ వల్ల దేశంలోని కోట్లాది సామాన్యులకు ఒరిగేదేముంది! గతంలో ఆర్థికమంత్రులు తమ బడ్జెటు ప్రసంగాల్లో మహనీయుల సూక్తులను కోట్ చేసేవారు. ఈ సంప్రదాయానికి విఘాతం కలిగించకుండా నిర్మలాజీ కూడా సంస్కృతం, హిందీ, ఉర్దూ, తమిళ భాషల్లో కొటేషన్లను చేర్చారట. అత్తగారింటి తెలుగు భాషను ఆమె మరిచిపోయినట్లున్నారు. విశేషించి ఆమె తెలంగాణ, హైదరాబాద్ గృహలక్ష్మి. భక్తకవులు పోతన, పాల్కురికి సోమన, రామదాసు (గోపన్న), ఆధునిక ప్రజా కవులు కాళోజీ, దాశరథి, మగ్దూమ్ తెలంగాణ మహనీయులని, వీరి ప్రతిమాట సూక్తుల పేటిక అని బహుశా నిర్మలాజీకి, ఆమె బడ్జెటు ప్రసంగం రాసినవాళ్లకు తెలియదేమో. ఈ విధంగా తెలంగాణను అవమానించినా, తమ బడ్జెట్ ప్రతిపాదనల్లో, కేటాయింపుల్లో తెలంగాణకు శూన్యహస్తం చూపినా అమాయక తెలంగాణ ప్రజలు తమవెనుక పరుగెత్తి వస్తారని మోదీయులు భావిస్తున్నారే మో! తెలంగాణ ప్రజలు తిరుగబడితే డిపాజిట్లు దక్కవన్నది చరిత్రే.

నిర్మలాజీ బడ్జెట్ ప్రసంగంలో చెప్పిన దానికంటే చెప్పకుండా మరుగు పరిచినవి చాలా ఉన్నాయని ఆర్థిక విషయజ్ఞులు అంటున్నారు. కొత్తగా ఎన్నికైన, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కనీస విశ్వాసం లేనివారితో నిండి ఉన్న, జాతిపిత గాంధీజీని హత్య చేసిన వ్యక్తి దేశభక్తుడని అంటున్నవాళ్లు కూర్చుని ఉన్న 17వ లోక్‌సభలో చప్పట్లు, కేరింతల మధ్య రసవత్తరంగా, మనోహరంగా కొనసాగిన మేడమ్ నిర్మలాజీ ప్రసంగంలో దేశ ప్రజలు, ముఖ్యంగా కోట్లాది సామాన్యులు, రెక్కాడితేకాని డొక్కనిండని నిరుపేదలు జవాబులు కోరుతున్న అంశాలు, ప్రశ్నలు చాలా ఉన్నాయి. చాతుర్యం తొణికిసలాడుతూ కొనసాగిన ఆర్థికమంత్రి ప్రసంగంలో ఎక్కడా అంకెల జోలి లేదు. తమ ప్రభుత్వ ఆదాయం ఎంతో, వ్యయం ఎంతో, ఈ ఆర్థిక సంవత్సరంలో రాబడి ఎంతో, పోబడి ఎంతో, ఏ రంగానికి ఎంతమొత్తం కేటాయించారో చెప్పలేదు. ఎందుకు చెప్పలేదు? మోదీజీ ప్రభుత్వం వద్ద ఉన్న అంకెలేవీ సరిగ్గా లేవని, ఆ విషయం మేడమ్‌కు బాగా తెలుసని, అందుచేతనే వాటిని ఉదహరించలేదని ఒక ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడు వ్యాఖ్యానించాడు. అభివృద్ధి రేటు ఇంతని, అంతని ఎన్నికలముందు మోదీజీ ప్రభుత్వం ప్రకటించిన అంకె అబద్ధమని, అభివృద్ధి రేటు అంతగా లేదని ప్రధాని మోదీ ఆర్థిక సలహాదారుగా నిన్నమొన్నటి వరకు వ్యవహరించిన అరవింద్ సుబ్రహ్మణ్యం స్వయంగా అన్నాడు. మేడమ్ ప్రసంగంలో 'జాబ్' అన్నమాట ఎక్కడా లేదు. మోదీజీ ప్రభుత్వం దేశంలోని కోట్లాది యువతీయువకుల, విశేషించి విద్యావంతులైన యువతీయువకుల తీవ్ర నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపడం లేదు, చూపగలిగే సంకల్పం, సామర్థ్యం మోదీజీ ప్రభుత్వానికి లేదంటే అతిశయోక్తి కాదు. గత 45 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగ సమస్య మోదీ పాలనలో భయంకర స్వరూపం ధరించింది. యువతీయువకులు దేశమంతటా పకోడీలు, పల్లీలు అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. ప్రధాని మోదీజీయే నిరుద్యోగం, పేదరికం, దారిద్ర్యం సమస్య మీదినుంచి అమాయక ప్రజల దృష్టిని 'జాతీయ భద్రత' బూచి చూపి మళ్లిస్తున్నప్పుడు ఆర్థికమంత్రి ప్రసంగంలో ఆ ప్రస్తావన ఎందుకు ఉంటుంది? హద్దు దాటి ప్రసంగిస్తే తనకు నిరుద్యోగ సమస్య ఎదురవుతుందని తమిళ సోదరి నిర్మల అమ్మాళ్‌కు బాగా తెలుసు. మన మహాకవి గురజాడ సొంతలాభం కొంత మానుకొమ్మన్నాడు గాని మొత్తం మానుకొమ్మనలేదు. 'మంత్రాలకు చింతకాయలు రాలుతాయా' అని అంటారు. మాటలకు ఓట్లు రాలుతాయని మోదీజీ బల్లగుద్ది నిరూపించారు. ఆ ధీమాతోనే మేడమ్ పేలవమైన, ప్రయోజనరహితమైన, దేశ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపని బడ్జెట్‌ను రూపొందించి, ప్రజల ముందు పెట్టి తమాషా చూస్తున్నారు.

మోదీజీ పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ కఠోర యదార్థాలు ఆందోళన కలిగిస్తూ దేశ ప్రజలను వెక్కిరిస్తున్నాయి. 2014 మే నెలలో మోదీజీ మొదటి ప్రభుత్వం ఏర్పడినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ 1.25 ట్రిలియన్ డాలర్ల (అప్పటికీ మన లెక్కలన్నీ డాలర్లలో ఉండటం విచిత్రం) స్థాయిలో ఉన్నది. అప్పటినుంచి మోదీజీ ఐదేండ్ల పాలనలో 2019 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 2.7 ట్రిలియన్ డాలర్ల స్థాయికి వచ్చిందని (మోదీజీ ప్రభుత్వం ఇచ్చిన ఈ అంకె అబద్ధం కాకపోతే) అంటున్నారు. ఐదేండ్ల మోదీజీ పాలనలో ఆర్థిక వ్యవస్థ స్థాయిలో పెరుగుదల కేవలం 0.85 (డిస్మల్ 85) మాత్రమే. తిరోగమన దశలో భారత క్రికెట్‌జట్టు స్పీడుతో పరుగెత్తుతున్న మోదీజీ ప్రభుత్వం మరో ఐదేండ్లలో 2024 ఎన్నికల నాటికి 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి పెరుగుతుందంటే నమ్మడం కష్టమని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి పెరిగినా ఉపాధి అవకాశాలు హెచ్చుకుంటే, సర్వీసులు మెరుగుపడకుంటే ఫలితం శూన్యమని ఆర్థికవేత్తల అభిప్రాయం. మోదీజీ ఉధృతంగా ప్రచారం చేస్తున్నట్లు, ఈ ప్రచారానికి అనుగుణంగా ఆర్థికమంత్రి తమ మృదుమధుర ప్రసంగంలో వివరించినట్లు 5 ట్రిలియన్ డాలర్ల స్థాయి జాతీయ ఆర్థిక వ్యవస్థ స్వర్గానికి సోపానం కాబోదు. తన మొదటి బడ్జెట్ ప్రతిపాదనలతో భారత ఆర్థిక వ్యవస్థ తిరోగమన మార్గం నుంచి నవభారత నిర్మాణం లక్ష్యంగా పురోగమన మార్గంలోకి వస్తుందని ఆమె అనుకుంటే అది ఆత్మవంచన అవుతుందని ఆర్థికవేత్తలు సంఖ్యల సత్యాలను ఉదహరిస్తున్నారు. మోదీజీ ప్రభుత్వం ప్రచారంలోకి తెస్తున్న అంకెలు నిజాలనుకుంటే భారత ఆర్థిక వ్యవస్థ 2018-19 చివరి క్వార్టర్‌లో కేవలం 5.8 శాతం పెరుగుదలనే సాధించింది. ఈయేడు (2019-20లో) వృద్ధి రేటు 7.8 శాతానికి చేరుతుందని ఆర్థికమంత్రి వ్యక్తపరిచిన ఆశాభావం సహేతుకంగా, వాస్తవాలకు సమీపంలో లేదని ఆర్థికవేత్తలు అనుమానిస్తున్నారు. ఈ లెక్కన 2019-20 ఆర్థిక సంవత్సరంలో, ఆర్థిక లోటును జీడీపీలో 3.3 శాతానికి తగ్గించడం ఏ విధంగా సాధ్యమవుతుందో ఆర్థికమంత్రి తమ ప్రసంగంలో వివరించలేదు.

మోదీజీ నోట్లరద్దుతో దేశంలోని జాతీయబ్యాంకులు, జాతీయ ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతిన్నాయి. చతికిలపడ్డ జాతీయ బ్యాంకులను ఆదుకోవడానికే ఆర్థికమంత్రి తమ బడ్జెట్‌లో రూ.70 వేల కోట్ల కేటాయింపు పెట్టారనుకోవాలి. గత ఐదేండ్ల మోదీజీ పాలనలో అవకతవక విధానాల ఫలితంగా, లోపభూయిష్ట చర్యల కారణంగా ప్రైవేటు, పబ్లిక్ పెట్టుబడులు బాగా తగ్గాయి. ఆర్థికమంత్రి తమ ప్రసంగాన్ని ముగించకముందే దేశంలో ఆర్థిక మార్కెట్లు కుప్పకూలి పెట్టుబడిదారులకు కొన్ని లక్షల కోట్ల రూపాయల నష్టం సంభవించింది. మోదీజీ ప్రభుత్వం ఒక వంక విదేశీ పెట్టుబడులకు మన ద్వారాలు, కిటికీలు అన్నీ తెరిచి, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకానికి నడుం బిగించి తన అవసరాల కోసం విదేశాల్లో అప్పులు చేయాలనుకుంటున్నది. భారత ఆర్థిక వ్యవస్థ ఇంతటి క్లిష్ట పరిస్థితిని 1991లో కూడా ఎదుర్కోలేదు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ దేశంలోని ఏ వర్గానికి సంతృప్తి కలిగించలేదనడంలో ఆశ్చర్యం లేదు. 'ఓటేసినప్పుడే ఉండాలి బుద్ధి' అని కవి కాళోజీ అన్నాడు. అది లేకపోవడం వల్లనే అన్ని సమస్యలు, భూకమతాలున్న వారిలో 85 శాతం మంది చిన్న రైతులు కాగా మోదీ పాలనలో, ఈ చిన్న, సన్నకారు రైతుల్లో 50 శాతం మందికే వ్యవసాయ రుణాలు అందాయి. ఈ దేశంలో ప్రస్తుతం ఆదాయ పన్ను చెల్లిస్తున్న వాళ్లల్లో అత్యధిక సంఖ్యాకులు రెండున్నర లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం ఉన్నవారు. ఈ తక్కువ ఆదాయవర్గాల సంక్షేమానికి మోదీజీ ప్రభుత్వం కేటాయింపులు పెరుగడం లేదు, తగ్గుతున్నాయి. బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాల కేటాయింపులు పెరుగలేదు. 'మోదీజీ మొన్నటి ఎన్నికల్లో జాతీయ భద్రత నినాదంతో ఆవేశం, ఉద్రేకం కలిగించి గెలుపొందారు. కానీ, ఈ బడ్జెట్‌లో సైన్యం ఆధునీకరణ, ఆయుధ సేకరణకు, సైనికుల సంక్షేమానికి ప్రాధాన్యం లభించలేదు. రక్షణకు కేటాయింపు పెరుగలేదు' అని అంటూ ఒక సైనికాధికారి అసంతృప్తి వ్యక్తపరిచాడు. 'ఒక్క రాఫెల్ విమానం ఉంటే చాలు, పాకిస్తాన్‌ను పచ్చడి చేయడానికి' అని మోదీజీ భావిస్తున్నారేమో, 'ఈ బడ్జెట్ గుట్టు విప్పితే ఏమున్నది గర్వకారణం, పేద్దోళ్ల బతుకులతో పెద్దోళ్ల పరిహాసం' అంటూ యాదగిరి ముక్తాయింపు పలికాడు!

మోదీజీ నోట్లరద్దుతో దేశంలోని జాతీయబ్యాంకులు, జాతీయ ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతిన్నాయి. చతికిలపడ్డ జాతీయ బ్యాంకులను ఆదుకోవడానికే ఆర్థికమంత్రి తమ బడ్జెట్‌లో రూ.70 వేల కోట్ల కేటాయింపు పెట్టారనుకోవాలి. గత ఐదేండ్ల మోదీజీ పాలనలో అవకతవక విధానాల ఫలితంగా, లోపభూయిష్ట చర్యల కారణంగా ప్రైవేటు, పబ్లిక్ పెట్టుబడులు బాగా తగ్గాయి. ఆర్థికమంత్రి తమ ప్రసంగాన్ని ముగించకముందే దేశంలో ఆర్థిక మార్కెట్లు కుప్పకూలి పెట్టుబడిదారులకు కొన్ని లక్షల కోట్ల రూపాయల నష్టం సంభవించింది.

సామాజికభద్రతపై చిన్నచూపు

బడ్జెట్

సుధా నారాయణన్

సమాజంలోని అధిక సంఖ్యాకులకు సామాజిక భద్రత కల్పించడం రాజ్యానికి ఉన్న బాధ్యత అనేది సర్వత్రా అంగీకరించిన విషయం. ఇటువంటి భద్రత కల్పించడం వల్ల పేదరికం తగ్గుతుంది. బలహీనవర్గాలు అనారోగ్యం తదితర సమస్యలను ఎదుర్కోగలుగుతాయి. నిరుద్యోగం, అనారోగ్యం, వృద్ధాప్యం వంటి సమస్యలు బలహీనవర్గాలను వేధి

కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్‌కు టీఆర్ఎస్ సభ్యత్వ రసీదు అందజేస్తున్న మంత్రి ఈటల రాజేందర్

నిర్మల్‌లో టీఆర్ఎస్ సభ్యత్వాన్ని అందజేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌లో టీఆర్ఎస్ సభ్యత్వాలను అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సిద్దిపేటలో బార్ అసోసియేషన్ సభ్యులకు సభ్యత్వాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

పోటాపోటీగా సభ్యత్వాలు

లక్ష్యానికి చేరువలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ
టార్గెట్‌ను అధిగమించిన సూర్యాపేట జిల్లా, మేడ్చల్ సెగ్మెంట్
జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో జోరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్: రాష్ట్ర వ్యాప్తంగా టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగుతున్నది. ఈ నెల 20 చివరి తేదీ కావటంతో పోటాపోటీగా సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతున్నది. చాలా గ్రామాల్లో తుదిదశకు చేరుకున్నది. సూర్యాపేట జిల్లా మొత్తంగా చూస్తే రెండు లక్షల సభ్యత్వాలకు గాను 2.80లక్షలకు చేరుకున్నది. మేడ్చల్‌లో 50 వేలకుగాను 90వేల సభ్యత్వాలను దాటారు. జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలు టార్గెట్‌ను సమీపిస్తున్నాయి. సభ్యత్వం తీసుకున్నవారికి రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. సభ్యత్వ నమోదుపై ప్రత్యేకంగా దృష్టిసారించిన పార్టీ నాయకత్వం నియోజకవర్గాల వారీగా ఇంచార్జీలను నియమించింది. నమోదు ప్రక్రియ ప్రారంభమైన నాటినుంచి టీఆర్ఎస్ నేతలు చురుకుగా పాల్గొంటున్నారు. క్షేత్రస్థాయి నేతలనుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వరకు దగ్గరుండి నమోదు ప్రక్రియ విజయవంతమయ్యేందుకు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. నమోదైన సభ్యత్వాల వివరాలను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు. వివిధ జిల్లాల్లో ప్రక్రియ ఎలా సాగుతున్నదో పరిశీలిస్తున్నారు. చివరి తేదీవరకు ఇదే వేగాన్ని కొనసాగించాలని, ఉత్సాహంగా పనిచేయాలని సూచనలు చేస్తున్నారు. ప్రతి గ్రామం నుంచి సభ్యత నమోదు ప్రక్రియపై మంచి స్పందన వస్తున్నది. ఎక్కడికక్కడే కేంద్రాలు ఏర్పాటుచేయడంతో నమోదు ప్రక్రియ మరింత సులువైంది. పార్టీ శ్రేణులు విస్తృతంగా పర్యటిస్తూ నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. సభ్యులుగా చేరినవారి వివరాలను ఎప్పటికప్పుడు డిజిటలైజ్‌చేసే ప్రక్రియ అంతేవేగంగా కొనసాగుతున్నది. ఆన్‌లైన్‌ద్వారా enrol.trspartyonline.org వెబ్‌సైట్‌లో సభ్యత్వ నమోదుకు అవకాశం కల్పించడంతో పలుదేశాల్లోని టీఆర్ఎస్ అభిమానులు సైతం పెద్దఎత్తున నమోదు చేసుకుంటున్నారు. పెద్దఎత్తున నమోదు ప్రక్రియ కొనసాగుతుండటంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా టీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి

మేడ్చల్ జిల్లా చర్లపల్లి డివిజన్‌లోని ఈసీనగర్‌లో హోంమంత్రి మహమూద్ అలీకి సభ్యత్వం అందజేస్తున్న కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి. చిత్రంలో మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

చురుగ్గా పాల్గొంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

మేడ్చల్ జిల్లా చర్లపల్లి డివిజన్‌లోని ఈసీనగర్‌లో గ్రేటర్ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో హోంమంత్రి మహమూద్ అలీ, కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు. మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా మంత్రి మహమూద్ అలీ సభ్యత్వం తీసుకున్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో వైద్యఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. నిర్మల్‌లో దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా పార్టీ సభ్యత్వాన్ని అందుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి, భద్రాచలంలో ఇంచార్జి తెల్లం వెంకట్రావ్, పినపాకలో ఎమ్మెల్యే రేగా కాంతారావు, వేములవాడలో ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, ఎమ్మెల్సీలు భానుప్రసాద్‌రావు, నారదాసు లక్ష్మణ్‌రావు, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం అమిస్తాపూర్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

కొత్తగూడెంలో సభ్యత్వం అందజేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బాలసాని

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎమ్మెల్సీలు భానుప్రసాద్‌రావు, నారదాసు, జెడ్పీ అధ్యక్షురాలు అరుణ

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం అమిస్తాపూర్‌లో టీఆర్ఎస్ సభ్యత్వాన్ని అందజేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దూసుకుపోతున్న జగిత్యాల, ధర్మపురి సెగ్మెంట్లు

సభ్యత్వ నమోదులో ఆయా జిల్లాలు, నియోజకవర్గాలు పోటీపడుతున్నాయి. ఒక్కో నియోజకవర్గానికి 50 వేల చొప్పున సభ్యత్వ నమోదు లక్ష్యం విధించగా పలుచోట్ల టార్గెట్‌ను సమీపించాయి. మరికొన్నిచోట్ల లక్ష్యానికి మించి సభ్యత్వాలు చేయించేందుకు నాయకులు పోటీ పడుతున్నారు. శుక్రవారం సాయంత్రానికి అందిన సమాచారం మేరకు మేడ్చల్ నియోజకవర్గంలో 50 వేలు టార్గెట్ కాగా ఇప్పటికే 90 వేల సభ్యత్వాల నమోదు దాటింది. జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లోనూ 45 వేల చొప్పున సభ్యత్వాలు పూర్తి చేయగా, సిద్దిపేటలో 40 వేల సభ్యత్వాలు చేశారు. కోరుట్ల, వేములవాడ, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో 30 వేల చొప్పున, బెల్లంపల్లిలో 21,483, చెన్నూర్‌లో 18,362, మంచిర్యాల నియోజకవర్గంలో 15,480 సభ్యత్వాలు నమోదయ్యాయి. కాగా సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు గాను రెండు లక్షల టార్గెట్ కాగా ఇప్పటికే 2.80 లక్షల సభ్యత్వాలు చేయించి లక్ష్యాన్ని అధిగమించారు. నల్లగొండ జిల్లాలో మూడు లక్షలు టార్గెట్ కాగా ఇప్పటివరకు 2.80 లక్షలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 8 లక్షల సభ్యత్వాలు లక్ష్యంగా కాగా ఇప్పటివరకు 4.25 లక్షలు నమోదు చేశారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

కరీంనగర్‌లో జరిగిన నేత్రవైద్యుల రాష్ట్ర సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఈటల, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సంజయ్‌కుమార్

- వైద్య, ఆరోగ్యశాఖమంత్రి ఈటల

కరీంనగర్ హెల్త్: రాష్ట్రంలోని పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా నగునూర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో తెలంగాణ నేత్ర వైద్యుల ఐదో రాష్ట్రస్థాయి సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కంటివెలుగు కార్యక్రమంతో కోటి మందికి పైగా కంటి పరీక్షలు చేశామన్నారు. అనంతరం నేత్ర వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన ప్రముఖ నేత్ర వైద్యుడు జగన్‌మోహన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేత్ర వైద్యుల సావనీర్‌ను ఆవిష్కరించారు. కరీంనగర్, జగిత్యాల ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సంజయ్‌కుమార్, అప్తాల్మాజికల్ జాతీయ అధ్యక్షుడు నటరాజన్, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఎన్‌రావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కేటీఆర్‌తోనే వస్త్ర పరిశ్రమకు 'సిరి'

- కండ్లున్న గుడ్డి వాళ్లలా బీజేపీ నేతల వ్యవహారశైలి
- తప్పుడు విమర్శలు చేస్తే గుణపాఠం తప్పదు
- సిరిసిల్ల పవర్‌లూం మ్యాక్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎల్దండి శంకర్

సిరిసిల్లలో మాట్లాడుతున్న పవర్‌లూం మ్యాక్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎల్దండి శంకర్

సిరిసిల్ల టౌన్: ఉమ్మడి రాష్ట్రంలో ఉరిశాలగా ఉన్న కార్మికక్షేత్రం కేటీఆర్ వచ్చాక సిరిశాలగా మారిందని సిరిసిల్ల పవర్‌లూం మ్యాక్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎల్దండి శంకర్, టీఆర్ఎస్ కార్మికవిభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ స్పష్టంచేశారు. సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతూ.. చేనేత అభివృద్ధికి కేటీఆర్ కృషిపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమైనవన్నారు. దశాబ్దాల కాంగ్రెస్, బీజేపీ పాలనలో ఈ రంగం తీవ్ర సంక్షోభానికి గురైందన్నారు. నాటి ప్రభుత్వాల పట్టింపులేని వైఖరితో వేలాది మంది ముంబై, భీవండి, షోలాపూర్ లాంటి ప్రాంతాలకు వలస వెళ్లారన్నారు. కేటీఆర్ ఎమ్మెల్యేగా వచ్చిన తరువాతే కార్మిక కుటుంబాల్లో మార్పు వచ్చిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ రంగాన్ని ఆదుకోవాలని కేటీఆర్ ఎన్నిసార్లు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాథుడే లేడన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత చేనేత జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారన్నారు. స్థానిక వస్త్ర పరిశ్రమలో సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివరించి చరిత్రలో తొలిసారి చేనేతకు అత్యధికంగా రూ.1200 కోట్ల బడ్జెట్ కేటాయించేలా కృషి చేశారన్నారు. సంక్షేమశాఖలకు సంబంధించిన ఆర్డర్లతో పాటు రూ.300 కోట్ల ఆర్‌వీఎం, బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు సిరిసిల్లకు అందించి ఇక్కడి కార్మికుల కష్టాలు తొలగించారన్నారు. యారన్ సబ్సిడీ ద్వారా రూ.9 కోట్లు అందించారన్నారు. ప్రతి కార్మికుడూ నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదించుకుంటూ కుటుంబంతో సంతోషకరమైన జీవనం సాగిస్తున్నారన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారనీ, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం చేసిందేమిటో ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పోలు శంకర్, గంగుల శ్రీనివాస్, కోడం శంకర్, నల్ల దక్షణమూర్తి, దూస అశోక్, మూషం రాజయ్య, వేముల దామోదర్, దాసరి సురేష్, బూట్ల పరందాములు, బుర్ర ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా అప్పన్నపల్లిలో అధికారులతో కలిసి పాలమూరు ప్రాజెక్టు కాల్వ డిజైన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

వేగంగా పాలమూరు ప్రాజెక్టులు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి / మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టితో పాలమూరు ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగుతున్నాయని ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా అప్పన్నపల్లి నుంచి హన్వాడ మండలం నాయినోనిపల్లి వరకు పాలమూరు ఎత్తిపోతల సొరంగం పనులకు సంబంధించిన మ్యాపులను ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు.

ఉదండాపూర్ నిర్వాసితులకు రూ.32 కోట్లు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా జరుగుతున్న ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు రూ.32 కోట్లు విడుదల య్యాయి. ఈ రిజర్వాయర్ కింద 4800 ఎకరాలు ముంపునకు గురవుతుండగా 2800 ఎకరాలకు పరిహారం అందింది. 2 వేల ఎకరాలకు పరిహారంఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం 540 ఎకరాలకు సంబంధించి రైతులు కాన్సెంట్ కూడా ఇచ్చారు. దీనికి సంబంధించిన పరిహారం అందటంలో కొంత ఆలస్యమైంది. జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శుక్రవారం సీఎం కేసీఆర్‌ను కలిసి రైతుల సమస్యను ఆయనకు వివరించారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు రూ.32 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకున్న 11 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.8.54లక్షల విలువైన చెక్కులు, ఎల్‌వోసీలను శుక్రవారం వనపర్తిలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అందజేశారు. - వనపర్తి, నమస్తే తెలంగాణ

ఈతకు వెళ్లి అన్నదమ్ముల మృతి

కురవి: తొలి ఏకాదశి సందర్భంగా బడికి సెలవు ఇవ్వడంతో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తిర్మలాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తొర్రూరు మండలం వెంకటాపురానికి చెందిన చింతనూరి శ్రీను- హైమ దంపతులు తమ కొడుకులు సూర్యతేజ(10), విశాల్(06)తో కలిసి బతుకుదెరువు కోసం కురవి మండలం మోద్గులగూడెంకు వచ్చారు. పదేండ్ల పాటు గ్రామంలో ఉన్న వీరు రెండేండ్ల క్రితంతిర్మలాపురానికి వెళ్లారు. అక్కడే తిరుమల బయోవర్మీ కంపోస్టులో శ్రీను నైట్‌వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం బడికి వెళ్లిన చిన్నారులు సెలవు కావడంతో స్నేహితులతో కలిసి పక్కనే ఉన్న మర్రి కుంటలో ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో కుంటలోకి దిగిన సూర్యతేజ, విశాల్ నీటిలో మునిగి చనిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట అయిన పిల్లలు ఇంటికి రాకపోవడతో తల్లిదండ్రులు గ్రామస్తులతో కలిసి వెతకగా కుంటలో మృతదేహాలు దొరికాయి. ఇద్దరు కొడుకులు చనిపోవడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ సైనిక్ శిక్షణ పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న మంత్రి కొప్పుల

దేశానికే ఆదర్శం తెలంగాణ గురుకులాలు

- మంత్రి కొప్పుల ఈశ్వర్

చొప్పదండి,నమస్తేతెలంగాణ: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నడుస్తూ తెలంగాణ గురుకులాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ సైనిక్ పాఠశాలను శుక్రవారం గురుకులాల కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఎ మ్మెల్యే రవిశంకర్‌తో కలిసి సందర్శించారు. పాఠశాల ఆవరణలో మంత్రి మొక్క నాటి, పాఠశాలను పరిశీలించారు. సైనిక్ పాఠశాల విశిష్టత,సౌకర్యాలు, విద్యార్థుల ప్రగతి, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి పాఠశాల డైరెక్టర్ రవీందర్‌రెడ్డి ప్రాజెక్టర్ ద్వారా మంత్రికి వివరించారు.

ఆర్ఐ, వీఆర్‌వో సస్పెన్షన్

కరీంనగర్ రూరల్: కరీంనగర్ కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఆర్ఐ రాములు, లాంగ్ లీవ్‌లో ఉన్న వీఆర్‌వో సదానందంను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తపల్లి తాసీల్దార్ కార్యాలయంలో రాములు ఆర్ఐగా పని చేసిన సమయంలో చింతకుంటకు చెందిన సర్వే నంబర్ 95 భూమిపై విచారణతోపాటు మ్యుటేషన్ రికార్డుల్లో తప్పుడు రిపోర్టు ఇచ్చారని భూ యజమాని ఆర్‌డీఓకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శుక్రవారం ఆర్ఐతో పాటు అప్పుడు వీఆర్‌వోగా పని చేసిన సదానందంను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీటీసీని హతమార్చిన మావోయిస్టులు

- ఈ నెల 8న కిడ్నాప్.. 12న దండకారణ్యంలో హత్య
- తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీప్రాంతంలో మృతదేహం
- ఉలిక్కిపడిన మన్యం

శ్రీనివాసరావు (ఫైల్)


మావోయిస్టులు వదిలివెళ్లిన లేఖ

చర్ల రూరల్/కొత్తగూడెంక్రైం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో మావోయిస్టులు అపహరించుకెళ్లిన టీఆర్ఎస్ నాయకుడు, ఎంపీటీసీ శ్రీనివాసరావును శుక్రవారం దారుణంగా హతమార్చారు. చర్లకు 25 కిలోమీటర్ల దూరంలోని తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో ఆయన మృతదేహాన్ని వదిలివెళ్లారు. పోలీస్ ఇన్ఫార్మర్‌గా మారినందునే శ్రీనివాసరావును హత్య చేసినట్లుగా మావోయిస్టు పార్టీ చర్ల - శబరి ఏరియా కమిటీ కార్యదర్శి శారద పేరుతో లేఖ వదిలారు. కిడ్నాప్ చేసిన సమయంలో తీసుకెళ్లిన బైకును సైతం అక్కడే వదిలివెళ్లారు. శ్రీనివాసరావు హత్య విషయం తెలియగానే భార్య దుర్గ, కొడుకు ప్రవీణ్ కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు రోదనలతో శ్రీనివాసరావు స్వగ్రామం బెస్త కొత్తూరు దద్దరిల్లుతోంది. మన్యంలో హైఅలర్ట్ ప్రకటించి, మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంచేశారు. కాగా, రైతును హత్యచేయడం హేయమైన చర్య అని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ సునీల్‌దత్ అన్నారు. శ్రీనివాసరావు పోలీస్ ఇన్ఫార్మర్ కాదని, పోలీసులతో సంబంధం లేదని స్పష్టం చేశారు.

నల్లగొండ జిల్లా చిట్యాలలో కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డిని టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో శుక్రవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి సహా వందల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. టీఆర్ఎస్ సర్కార్ చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా టీఆర్ఎస్‌లో చేరుతున్నారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్.. భళా!

క్యూ1లో రూ.3,802 కోట్ల లాభం

ఈ ఏడాది ఆదాయంలో 10% వృద్ధి ■ మిగులు నిధుల్లో 85 శాతం వాటాదారులకు

ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్, కంపెనీ సీవోవో యూబీ ప్రవీణ్ రావు, సీఎఫ్‌వో నిలంజన్ రాయ్

న్యూఢిల్లీ, జూలై 12: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,802 కోట్ల లేదా ప్రతిషేరుకు రూ.8.83 కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.3,612 కోట్ల లాభంతో(ప్రతిషేరుకు రూ.8.31) పోలిస్తే 5.2 శాతం వృద్ధిని కనబరిచింది. బెంగళూరు కేంద్రస్థానంగా ఐటీ సేవలు అందిస్తున్న సంస్థ గత త్రైమాసికానికిగాను రూ.21,803 కోట్ల ఆదాయాన్ని గడించింది. 2018-19 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి నమోదైన రూ.19,128 కోట్లతో పోలిస్తే 13.9 శాతం వృద్ధిని కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయంలో వృద్ధి 8.5 శాతం నుంచి 10 శాతం మధ్యలో ఉండనున్నదని గైడెన్స్‌లో పేర్కొంది. మరిన్ని ఆర్డర్లు కుదుర్చుకోవడం ఇందుకు దోహదం చేయనున్నదని వెల్లడించింది. ఏప్రిల్ త్రైమాసికపు ఫలితాలు విడుదల చేసేటప్పుడు ఆదాయ వృద్ధి 7.5 శాతం నుంచి 9.5 శాతం మధ్యలో ఉంటుందని చెప్పిన సంస్థ..ప్రస్తుతం ఈ అంచనాను సవరించింది. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బలమైన వృద్ధితో ప్రారంభించాం..కరెన్సీ తీవ్ర ఆటుపోటులకు గురైనప్పటికీ 12.4 శాతం వృద్ధిని సాధించాం.. ముఖ్యంగా డిజిటల్ సేవలు అందించడం ద్వారా 41.9 శాతం ఆదాయం పెరిగింది' అని ఇన్ఫోసిస్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ పరేఖ్ తెలిపారు. భవిష్యత్తులో క్లయింట్లకు మెరుగైన సేవలు అందించడానికి పెట్టుబడులను కూడా పెంచనున్నట్లు ఆర్థిక ఫలితాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చెప్పారు. ఆర్థిక ఫలితాల్లో ముఖ్య అంశాలు..

- ❖ కంపెనీ వద్ద ఉన్న మిగులు నిధులను వచ్చే ఐదేండ్లకాలంలో 85 శాతం మూలధన కేటాయింపుల కింద వాటాదారులకు బైబ్యాక్, డివిడెండ్ రూపంలో పంచనున్నది.
- ❖ గతంలో ప్రకటించిన రూ.8,260 కోట్ల బైబ్యాక్ ప్రతిపాదనల్లో ఇప్పటి వరకు రూ.5,934 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేసింది.
- ❖ కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో ఉత్తర అమెరికా, యూరోపియన్ దేశాల నుంచి అధికంగా సమకూరింది.
- ❖ డాలర్ రూపంలో కంపెనీ నికర లాభం 546 మిలియన్ డాలర్లకు చేరుకోగా, ఆదాయం 3.13 బిలియన్ డాలర్లుగా నమోదైంది.
- ❖ అత్యధికంగా 2.7 బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని గత త్రైమాసికంలో సంస్థ కుదుర్చుకున్నది.
- ❖ గత త్రైమాసికంలో డిజిటల్ సేవలు అందించడం ద్వారా 1.1 బిలియన్ డాలర్లు(మొత్తం ఆదాయంలో 35.7 శాతం) ఆదాయం సమకూరింది.
- ❖ ఆపరేటింగ్ మార్జిన్ 20.5 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. ఈ ఏడాది మొత్తానికి 21-23 శాతం మధ్యలో ఉండనున్నదని అంచనా.
- ❖ నికరంగా 906 మంది సిబ్బందిని నియమించుకోవడంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,29,029కి చేరుకున్నారు.
- ❖ వలసలు 23.4 శాతంగా ఉన్నాయి. అయినప్పటికీ కంపెనీ వ్యాపారంపై ఎలాంటి ప్రభావం చూపలేదు.
- ❖ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ల ద్వారా 18 వేల మంది మందిని నియమించుకోనున్నట్లు ప్రకటించింది. గత త్రైమాసికంలో 8 వేల మంది నియమించుకోగా, వీరిలో 2,500 మంది ఫ్రెషర్లు ఉన్నారు.
- ❖ షేర్ల బైబ్యాక్‌పై 20 శాతం అదనపు పన్ను చెల్లించాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశించిన ప్రస్తుతం సంస్థ ఈ కీలక నిర్ణయం తీసుకున్నది.
- ❖ స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర స్వల్పంగా పెరిగి రూ.727.10 వద్ద ముగిసింది.

భద్రత గాల్లోకి..

ఇండిగోలో లోపాలను గుర్తించిన డీజీసీఏ

నలుగురు అధికారులకు నోటీసులు

న్యూఢిల్లీ, జూలై 12: ప్రముఖ ప్రైవేట్ విమాన యాన సంస్థ ఇండిగోలో ప్రమోటర్ల గొడవ ముగియకముందే సంస్థకు మరో ఎదురుదెబ్బ తగిలింది. భద్రత లోపాలు ఉన్నట్లు పౌర విమానయాన నియంత్రణ మండలి డీజీసీఏ ప్రత్యేక దర్యాప్తులో తేలింది. దీంతో కంపెనీకి చెందిన నలుగురు ఉన్నతాధికారులకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గురుగావ్‌లోని కంపెనీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 8 నుంచి 9 వరకు రెండు రోజుల పాటు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఆడిటింగ్ నిర్వహించినట్లు తెలుస్తున్నది. శిక్షణ హెడ్ క్యాప్టెన్ సంజీవ్ భల్లా, చీఫ్ ఆఫ్ ఫ్లైట్ సేఫ్టీ క్యాప్టెన్ హేమంత్ కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ క్యాప్టెన్ అశిం మిత్రా, క్వాలీటీ అస్సూరెన్స్ హెడ్ క్యాప్టెన్ రాకేశ్ శ్రీవాత్సవలకు షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వర్షాకాలం సందర్భంగా దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో కంపెనీకి చెందిన విమానాలు పలు ఇబ్బందులు ఎదుర్కొనడంపై డీజీసీఏ ప్రత్యేక దర్యాప్తును ప్రారంభించింది. దీంట్లోభాగంగా కంపెనీ ప్రధాన కార్యాలయంలో తనిఖీలి చేయడంతో పలు విషయాలు బహిర్గతమయ్యాయి. ఈ నోటీసుకు వచ్చే 15 రోజుల్లో తిరిగి సమాధానం ఇవ్వాలని డీజీసీఏ ఉన్నతాధికారి ఒకరు ఆదేశించారు.

పారిశ్రామికం పడకేసింది..

మే నెలలో 3.1 శాతం వృద్ధి ■ గనులు, తయారీ రంగంలో నిస్తేజం

న్యూఢిల్లీ, జూలై 12: పారిశ్రామిక రంగం మళ్లీ పడకేసింది. గనులు, తయారీ రంగాల్లో నెలకొన్న నిస్తేజం కారణంగా మే నెలలో పారిశ్రామిక వృద్ధిరేటు 3.1 శాతానికి పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో పారిశ్రామిక ప్రగతి 3.8 శాతంగా ఉన్నది. ఈ ఏడాది మార్చిలో 0.4 శాతంగా నమోదైన ఐఐపీ..ఆ మరుసటి నెల ఏప్రిల్‌లో 4.3 శాతానికి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండో నెలలో గనుల రంగంలో వృద్ధి 3.2 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇది 5.8 శాతంగా ఉన్నది. అలాగే తయారీ రంగంలో వృద్ధి కూడా 3.6 శాతం నుంచి 2.5 శాతానికి జారుకోవడంతో మొత్తం పారిశ్రామిక ప్రగతిపై ప్రభావం చూపింది. అయినప్పటికీ ఇంధన రంగం 7.4 శాతం వృద్ధిని నమోదు చేసుకోవడం కొంతలో కొంత ఊరటనిచ్చింది. కేంద్ర గణాంకాల శాఖ(సీఎస్‌వో) విడుదల చేసిన నివేదికలో పెట్టుబడులకు గిటురాయి అయిన క్యాపిటల్ గూడ్స్ మాత్రం 0.8 శాతంతో సరిపెట్టుకున్నది. ప్రైమరీ గూడ్స్ విభాగంలో 2.5 శాతం వృద్ధి కనబరుచగా, ఇంటర్‌మీడియట్ గూడ్స్ 0.6 శాతంగాను, మౌలిక సదుపాయాలు/నిర్మాణ రంగ వస్తువుల విభాగంలో 5.5 శాతం పెరుగుదల నమోదైంది. కన్స్యూమర్ డ్యూరబుల్ రంగం రికార్డు స్థాయి పనితీరు కనబరిచాయి. మొత్తం 23 రంగాల్లో 12 ఆశాజనక పనితీరు కనబరుచగా, 13 ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. తయారీ రంగానికి చెందిన కలప, బెండుచెక్క, ఫర్నిచర్‌లు నిలకడైన వృద్ధిని నమోదు చేసుకున్నాయి. వీటిల పేపర్, ఇతర పేపర్ ఉత్పత్తుల్లో గరిష్ఠ స్థాయిలో ప్రతికూల వృద్ధి -12.2 శాతంగా ఉన్నది.



ఆరునెలల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం

జూన్ నెలలో 3.18 శాతంగా నమోదు ■ ఆహార పదార్థాలు మరింత ప్రియం

న్యూఢిల్లీ, జూలై 12: భవిష్యత్తులో రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు పెరిగే ప్రమాదం ఉందన్న రిజర్వు బ్యాంక్ అనుమానాలు నిజమయ్యాయి. ఆహార పదార్థాల ధరలు భగ్గుమనడంతో జూన్ నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం ఆరు నెలల గరిష్ఠ స్థాయి 3.18 శాతానికి ఎగబాకింది. విత్తనాలు, పప్పుదినుసులు, ప్రొటీన్ ఆధారిత ఉత్పత్తులైన మాంసం, చేపలు ప్రియంకావడం ద్రవ్యోల్బణ గణాంకాలు ఎగబాకడానికి కారణమని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. మే నెలలో నమోదైన కన్స్యూమర్ ధరల సూచీ 3.05 శాతంతో పోలిస్తే స్వల్పంగా ఎగబాకింది. జూన్ 2018లో నమోదైన 4.92 శాతంతో పోలిస్తే మాత్రం భారీగా తగ్గింది. ఈ ఏడాది తొలి నెల జనవరిలో 1.97 శాతంగా నమోదైన నాటి నుంచి ఇప్పటి వరకు పెరుగుతునే ఉన్నది. ఆహార ద్రవ్యోల్బణంలో కన్స్యూమర్ ఆహార ధరల సూచీ 1.83 శాతం నుంచి 2.17 శాతానికి పెరిగినట్లు కేంద్ర గణాంకాల శాఖ వెల్లడించింది. ప్రోటీన్ ఆధారిత ఉత్పత్తులైన మాంసం, చేపల ధరల సూచీ 9.01 శాతానికి చేరుకున్నది. అలాగే పప్పు దినుసులు మరింత ప్రియమయ్యాయి. దీంతో ఈ రంగ సూచీ 2.13 శాతం నుంచి రెండింతలు పెరిగి 5.68 శాతానికి ఎగబాకింది. చిరుధాన్యాల సూచీ కూడా 1.21 శాతం నుంచి 1.31 శాతానికి చేరింది. కానీ, పండ్ల ధరలు శాంతించాయి. గత నెలలో పండ్ల ధరల సూచీ -4.18 శాతం తగ్గగా, కూరగాయల సూచీ 4.66 శాతంగాను, ఇంధనం సూచీ 2.32 శాతంగా నమోదయ్యాయి. రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు అంచనావేసిన స్థాయిలోనే నమోదవుతున్నప్పటికీ, భవిష్యత్తులో భగ్గుమనే అవకాశాలున్నాయని, ముఖ్యంగా వర్షాలు ఆశించిన స్థాయిలో కురియకపోవడం, ఖరీఫ్ సీజన్ పంటల విస్తీర్ణం చాలా తక్కువగా ఉండటం ఇందుకు కారణమని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ తెలిపారు. ప్రస్తుత నెలలో కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు.



2020 కల్లా 18 విమానాలు

మూడేండ్లలో ఐపీవోకి ట్రూజెట్, రూ.600 కోట్ల ఆదాయం

టర్బో మేఘా ఎయిర్‌వేస్ డైరెక్టర్ కేవీ ప్రదీప్

నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రూజెట్ సీఈవో మూర్తి, సీసీవో సుధీర్ రాఘవన్, సీఎఫ్‌వో విశ్వనాథ్, మెయిల్ గ్రూపు డైరెక్టర్ కేవీ ప్రదీప్

హైదరాబాద్, జూలై 12: ట్రూజెట్ పేరుతో విమాన సేవలు అందిస్తున్న టర్బో మేఘా ఎయిర్‌వేస్ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే ఐదు విమానాలతో సేవలు అందిస్తున్న సంస్థ..తాజాగా ఈ ఏడాది చివరినాటికి వీటిని పదికి పెంచుకోనున్నది. ఇదే క్రమంలో వచ్చే ఏడాది మరో 5 నుంచి 8 విమానాలతో మొత్తం సంఖ్య 18కి పెంచుకోవాలనుకుంటున్నట్లు టర్బో మేఘా ఎయిర్‌వేస్ డైరెక్టర్ కేవీ ప్రదీప్ తెలిపారు. విమానయాన రంగంలో స్థిరమైన వృద్ధిని సాధించిన తర్వాతనే స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయ్యే అవకాశం ఉన్నదని ఆయన.. వచ్చే మూడేండ్ల తర్వాత ఇందుకు అవకాశం ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభాల్లోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న ఆయన.. 2021-22 నాటికి టర్నోవర్ రూ.600 కోట్లకు చేరుకోనుందన్నారు. 2017-18లో రూ.160 కోట్ల ఆదాయంపై రూ.85 కోట్ల నష్టాన్ని చవిచూసింది. గడిచిన రెండేండ్లుగా 50 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న సంస్థ..ఈ సారి కూడా ఇంతే స్థాయిలో పనితీరు కనబరుచనున్నదన్నారు. ఉత్తర భారతంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అక్కడ మరిన్ని రూట్లకు విమాన సేవలు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా రోజుకు 20 రూట్లకు విమాన సేవలు అందిస్తున్న సంస్థ..ఈ ఏడాది చివరి నాటికి మరో ఆరు కొత్త రూట్లకు విమాన సేవలు ఆరంభించే అవకాశం ఉందన్నారు.

కొత్తగా 300 మంది ఉద్యోగాలు

విమానాల సంఖ్యను పెంచుకుంటున్న సంస్థ..అందుకు తగ్గట్టుగా సిబ్బందిని కూడా రిక్రూట్ చేసుకుంటున్నది. ఇప్పటికే 750 మంది సిబ్బందితో విమాన సేవలు అందిస్తున్న సంస్థ..వచ్చే ఆరు నెలల్లో 200 నుంచి 300 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు ప్రదీప్ ప్రకటించారు.

ఎస్బీఐ ఖాతాదారులకు శుభవార్త

ఆన్‌లైన్ చార్జీలను పూర్తిగా ఎత్తివేసిన బ్యాంక్

న్యూఢిల్లీ, జూలై 12: బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఖాతాదారులకు శుభవార్తను చేరవేసింది. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంలో భాగంగా ఆర్టీజీఎస్, నెఫ్ట్, ఐఎంపీఎస్‌ల ద్వారా జరిపే అన్ని రకాల లావాదేవీలపై చార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు శుక్రవారం బ్యాంక్ ప్రకటించింది. బ్యాంక్ తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఎస్బీఐ యాప్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలు జరిపే ఖాతాదారులు ఎలాంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడంలో భాగంగా రిజర్వు బ్యాంక్ ఆన్‌లైన్ చార్జీలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటనకు అనుకూలంగా బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నది. బ్యాంకింగ్ రంగంలో 25 శాతం వాటా కలిగిన ఎస్బీఐ తీసుకున్న ఈ నిర్ణయంతో ఇతర బ్యాంకులు కూడా ఈ చార్జీలను ఎత్తివేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఆన్‌లైన్లో అధికమొత్తంలో లావాదేవీలు జరిపే వారు రియల్ టైం గ్రాస్ సెటిల్‌మెంట్(ఆర్టీజీఎస్)ను, రూ.2 లక్షల వరకు లావాదేవీలు జరిపేవారు నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్(నెఫ్ట్)ను వినియోగిస్తున్నారు. ఈ నెల 1 నుంచి ఈ చార్జీల ఎత్తివేత అమలులోకి వచ్చింది. అలాగే అత్యవసరంగా చెల్లింపుల సేవలు(ఐఎంపీఎస్)ను వినియోగించి మొబైల్ ఫోన్ ద్వారా నగదును బదిలీ చేసే వారిపై విధించే చార్జీలను సైతం బ్యాంక్ ఎత్తివేసింది. ఆగస్టు 1 నుంచి ఇవి అమలులోకి రానున్నాయి. గతంలో నెఫ్ట్ ద్వారా జరిపే ప్రతి లావాదేవీపై రూపాయి నుంచి రూ.5 వరకు, ఆర్టీజీఎస్ ద్వారా జరిపే లావాదేవీలపై రూ.5 నుంచి రూ.50 వరకు చార్జీలు విధిస్తుండేది. బ్యాంక్ ఇప్పటికే శాఖల ద్వారా జరిపే నెఫ్ట్, ఆర్టీజీఎస్ లావాదేవీలను చార్జీలను 20 శాతం తగ్గించిన విషయం తెలిసిందే. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు, దీంతో యోనోకు మరింత ప్రచారం కల్పించడానికి లైన్‌క్లియర్ అయిందని బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్(రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్) పీకే గుప్తా తెలిపారు.

నాబార్డ్ సేవలు ప్రశంసనీయం

- రైతులు, బ్యాంకులను అనుసంధానం చేసిన జాతీయబ్యాంకు
- మిషన్‌భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆర్థికసహకారం అభినందనీయం
- నాబార్డ్ ఆవిర్భావ వేడుకల్లో వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి

నాబార్డ్ 38వ వ్యవస్థాపక వేడుకలో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఎస్ నిరంజన్ రెడ్డి,తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులు, ప్రభుత్వం, బ్యాంకులను అనుసంధానంచేయడంతోపాటు, వ్యవసాయరంగానికి నాబార్డ్ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని వ్యవసాయశాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. రైతులకు రుణాలిచ్చి అండగా నిలుస్తున్నదని తెలిపారు. జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) 38వ వ్యవస్థాపకదినవేడుకలు శుక్రవారం హైదరాబాద్‌లోని సెస్ ఆడిటోరియంలో జరిగాయి. కార్యక్రమానికి మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2018-19 తెలంగాణ, ఏపీలో నాబార్డ్ సాధించిన ప్రగతి, తెలంగాణలో ఆధునిక వ్యవసాయఆవిష్కరణలు, హైటెక్ పద్ధతులపై రూపొందించిన పుస్తకాలను నాబార్డు ప్రతినిధులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాలు స్వయంసమృద్ధి సాధించడంలో నాబార్డ్ పోషిస్తున్న పాత్రను కొనియాడారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథకు రూ.4,800 కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు ఇచ్చి.. బృహత్ కార్యక్రమాల్లో భాగస్వామ్యమైన నాబార్డ్‌కు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి పథకాలకు అందిస్తున్న సాయం మరవలేనిదన్నారు. భవిష్యత్‌లో సహకారాన్ని కొనసాగించాలని కోరారు. మిషన్‌కాకతీయతో 46 వేల చెరువుల పునరుద్ధరణతో వ్యవసాయంలో 78 శాతం ఆదాయం పెరిగిందన్నారు. 265 టీఎంసీల నీటినిలువ సామర్థ్యాన్ని పునరుద్ధరించినట్టు తెలిపారు. నాబార్డ్ తెలంగాణ రీజియన్ సీజీఎం విజయకుమార్ మాట్లాడుతూ... కాళేశ్వరం ఎత్తిపోతల, మిషన్‌భగీరథ వంటి రాష్ట్రప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు నాబార్డ్ మద్దతు ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. అనేక అభివృద్ధి పథకాలకు సహాయం అందించడంతోపాటు, 1,39,000 హెక్టార్లలో మైక్రోఇరిగేషన్ వ్యవస్థ ఏర్పాటు, 18.23 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల 364 గిడ్డంగుల నిర్మాణానికి అందిస్తున్న సహాయాన్ని విశదీకరించారు. గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు నాబార్డ్ రూ.1,244 కోట్ల ఆర్థిక సహాయం చేసిందని నాబార్డ్ ఏపీ సీజీఎం ఎస్.సెల్వరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సెల్బీసీ కన్వీనర్ మయ, రిజర్వ్‌బ్యాంక్ రీజనల్ డైరెక్టర్ సుబ్రతాదాస్, నాబార్డ్ మాజీచైర్మన్ కోటయ్య, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని వాణిజ్య, గ్రామీణ, సహకారబ్యాంకుల ఉన్నతస్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

సిండికేట్ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 12: ప్రభుత్వరంగ సంస్థ సిండికేట్ బ్యాంక్..మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ను 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఈ నూతన రేట్లు సోమవారం నుంచి అమలులోకి రానున్నాయి. దీంతో ఏడాది కాలపరిమితి కలిగిన అన్ని రకాల రుణాలపై వడ్డీరేటు 8.65 శాతం నుంచి 8.60 శాతానికి తగ్గనున్నది. ఒక్కరోజు, నెల-మూడు-ఆరు నెలల రుణాలపై వడ్డీరేటును కూడా ఇంతే స్థాయిలో తగ్గించడంతో రుణరేటు 8.15 శాతానికి, 8.25 శాతం, 8.45 శాతం, 8.55 శాతానికి తగ్గనున్నది. బేస్‌రేటును మాత్రం బ్యాంక్ యథాతథంగా 9.50 శాతంగా ఉంచింది.

రెడ్డీస్ హైదరాబాద్ ప్లాంట్‌పై అమెరికా అభ్యంతరాలు

న్యూఢిల్లీ, జూలై 12: ప్రముఖ ఫార్మా ఉత్పత్తుల సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ హైదరాబాద్ ప్లాంట్‌పై అమెరికా నియంత్రణ మండలి ఐదు అభ్యంతరాలు వ్యక్తంచేసింది. హైదరాబాద్‌కు సమీపంలోని బొల్లారం వద్ద ఉన్న యాక్టివ్ ఫార్మాస్యూటికల్స్ ఇంగ్రియంట్(ఏపీఐ) తయారీ ప్లాంట్-2ను ఇటీవల తనిఖీ చేసిన అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(యూఎస్ఎఫ్‌డీఏ) ఫామ్ 483తో కూడిన ఐదు అభ్యంతరాలను వ్యక్తంచేసినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. యూఎస్ఎఫ్‌డీఏ లేవనెత్తిన పలు అంశాలను త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపింది. అభ్యంతరాలు ఎందుకు వ్యక్తంచేసిందో మాత్రం సంస్థ వెల్లడించలేదు. దీంతో స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు ధర స్వల్పంగా తగ్గి రూ.2,672.30 వద్ద ముగిసింది.

గోద్రేజ్ ఇంటీరియో విస్తరణ

హైదరాబాద్, జూలై 12: ప్రముఖ ఫర్నిచర్ సంస్థ గోద్రేజ్ ఇంటీరియో విస్తరణ బాటపట్టింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 250 ఎక్స్‌క్లూజివ్ స్టోర్లను ఏర్పాటు చేసిన సంస్థ..తాజాగా వచ్చే మార్చి నాటికి మరో 30 స్టోర్లను నెలకొల్పనున్నట్లు కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుభోద్ మెహతా తెలిపారు. వీటిలో రాష్ట్రంలో నూతనంగా నాలుగు స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ఆయన, ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు స్టోర్లను నెలకొల్పనున్నట్లు చెప్పారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో సంస్థ 11 ఎక్స్‌క్లూజివ్ స్టోర్లను, 50 డీలర్లను నిర్వహిస్తున్నది. హైదరాబాద్‌కు సమీపంలోని కొంపల్లి వద్ద 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో గిడ్డంగిని ఏర్పాటు చేసింది. రూ.75 వేల కోట్ల స్థాయిలో ఉన్న ఫర్నిచర్ మార్కెట్లో 80 శాతం అసంఘటిత రంగానిదేనని, కేవలం సంఘటిత రంగానిది 20 శాతమేనని ఆయన వ్యాఖ్యానించారు.

ఇండస్ ఇండ్ బ్యాంక్ లాభంలో భారీ వృద్ధి

న్యూఢిల్లీ, జూలై 12: ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ ఇండస్‌ఇండ్ బ్యాంక్ జూన్ 31తో ముగిసిన త్రైమాసికానికిగాను రూ.1,432.50 కోట్ల లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి నమోదైన రూ.1,035.72 కోట్ల లాభంతో పోలిస్తే 38.3 శాతం ఎగబాకింది. బ్యాంక్ ఆదాయం రూ.6,369.75 కోట్ల నుంచి రూ.8,624.62 కోట్లకు చేరుకున్నది.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ విభాగము
కలెక్టర్ కార్యాలయము, పెద్దపల్లి
ఫారం - సి

కలెక్టర్ ప్రైల్ నెం.G1/1411/2018 తేది:08-07-2019

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం-2016 (రాష్ట్ర చట్టం 21/2017) ద్వారా సవరించబడిన, కేంద్ర భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు 2013 (చట్టము నెం. 30/2013) యొక్క సెక్షన్ 11 (1) క్రమము మరియు 10ఎ మినహాయింపు ననుసరించి (రూల్ 6/12 చూడుము)

-:ప్రకటన:-

పెద్దపల్లి జిల్లా, మంథని మండలములోని ఆరెంద గ్రామము పరిధిలో గల ఈ దిగువ షెడ్యూల్ నందు చూపబడిన భూమి (హెక్టరు తగ్గులతో) మొత్తం విస్తీర్ణము ఎ. 116.11 గుంటలు ప్రజా ప్రయోజనం నిమిత్తము అనగా " కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా బ్యారేజ్ మెయిన్ రిటేయిల్ గేట్ల నిర్మాణమునకు మరియు బ్యారేజ్ గైడ్ బండ్స్ నిర్మాణమునకు కొరకు అవసరమైయున్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ పెద్దపల్లి గారు భావిస్తున్నారు. కావున ఆర్డర్ ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యూలు

గ్రామము:

నమస్తే తెలంగాణ

ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో ఉన్న బూర్ల మాధవి భూమిని క్షేత్రస్థాయిలో సందర్శించి డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న ఇంచార్జి తాసిల్దార్ జయచందర్

విచారణ జరిపి న్యాయంచేస్తాం

- 'మ్యుటేషన్ చేస్తలేరు' కథనానికి రెవెన్యూ అధికారుల స్పందన
- భూమిని పరిశీలించిన స్టేషన్‌ఘన్‌పూర్ ఇంచార్జి తాసిల్దార్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: ఈ నెల 5వ తేదీన 'నమస్తే తెలంగాణ'లో 'మ్యుటేషన్ చేస్త లేరు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లికి చెందిన బూర్ల మాధవి భూమికి సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని ఇంచార్జి తాసిల్దార్ జయచందర్ హామీ ఇచ్చారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 29/ఏలో ఉన్న 2.17 ఎకరాల భూమిని ఆయన శుక్రవారం సందర్శించి పత్రాలను పరిశీలించారు. బూర్ల మాధవి 2014 జూలై 17న శవల్ల రాజయ్య నుంచి (డాక్యుమెంట్ నంబర్ 1495/2014, 1496/2014) 2.17 ఎకరాల భూమిని కొనుగోలుచేశారు. అప్పటి నుంచి మ్యుటేషన్ కోసం తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై కథనం ప్రచురితం కావడంతో ఇంచార్జి తాసిల్దార్ విచారణ చేపట్టారు. బూర్ల మాధవికి భూమి అమ్మిన శవల్ల రాజయ్య అందుబాటులో లేరని, ఆయనను మంగళవారం తాసిల్ కార్యాలయానికి పిలిపించి పూర్తిస్థాయిలో విచారించి తగిన న్యాయంచేస్తామని హామీ ఇచ్చారు. తాసిల్దార్ వెంట ఎంపీటీసీ సభ్యుడు గన్ను నర్సింహులు, వార్డు సభ్యుడు బూర్ల విష్ణు, వీఆర్వో హరిత, వీఆర్ఏ రమ్య, మాజీ సర్పంచ్ ఇల్లందుల ప్రతాప్, సంకెళ్ల రవి, మ్యాకల మల్లేశం తదితరులు ఉన్నారు.

పట్టాభూమిని ప్రభుత్వభూమిగా మార్చారు

రెవెన్యూ అధికారుల తప్పులతో బాధితులకు తిప్పలు • 20 ఏండ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం శూన్యం • ధర్మగంటను ఆశ్రయించిన సిద్దిపేట జిల్లావాసి, జెన్‌కో రిటైర్డ్ ఎస్ఈ దేవేందర్‌రెడ్డి

రాయపోల్:

సిద్దిపేట జిల్లా, రాయపోల్ మండలం, వడ్డేపల్లిలోని సర్వే నంబర్ 174లో 16 ఎకరాల భూమిని పెంటారెడ్డి అనే రైతు నుంచి 1994లో జెన్‌కో రిటైర్డ్ ఎస్ఈ చీదు దేవేందర్‌రెడ్డి, అతని అన్నదమ్ములు కలిసి కొనుగోలుచేశారు. 13బీ ద్వారా ఆ భూమిని దేవేందర్‌రెడ్డి నలుగురు అన్నదమ్ముల పేరిట పట్టాచేయించుకొన్నారు. ఈ భూమికి సంబంధించి నలుగురికీ పాత పాస్‌పుస్తకాలు ఉన్నాయి. అప్పటి ఉమ్మడి దౌల్తాబాద్ మండలంలో 2000 సంవత్సరం వరకు పహాణీలు కూడా వారిపేరుమీదే వచ్చాయి. ఆ తర్వాత ఒక్కసారిగా పహాణీలో నుంచి వీరి పేర్లు మాయమయ్యాయి. 2008లో తాసిల్ కార్యాయంలోని పహాణీలో చూసేసరికి నలుగురు అన్నదమ్ముల పేర్లు రికార్డుల నుంచి తొలగించినట్టు గుర్తించారు. రికార్డుల్లోనుంచి తొలగించిన భూమిని తిరిగి ఎక్కించాలంటూ బాధితులు అప్పటి తాసిల్దార్‌ను ఎన్నిసార్లు వేడుకొన్నా పట్టించుకోలేదు. భూమి వివరాలను అసలు ఎందుకు తొలగించాల్సి వచ్చిందని బాధితులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా.. 174 సర్వే నంబర్‌లోని 16 ఎకరాల భూమి అదే గ్రామ శివారులోని 243 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో కలిసిందని చెప్పారు. 20 ఏండ్ల నుంచి కాస్తులో ఉన్న పట్టాభూములను ప్రభుత్వ భూమిలో ఎలా కలుపుతారంటూ అడిగితే అధికారుల నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. భూమిని పహాణీలో వచ్చేలా చూడాలంటూ అనేకమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని బాధిత రైతులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన భూరికార్డుల ప్రక్షళనలోనూ తమ భూమిని రికార్డుల్లో ఎక్కించాలని దరఖాస్తు చేసినా పట్టించుకొన్న పాపానపోలేదని బాధితులు వాపోతున్నారు.

పాస్‌పుస్తకం, ప్రొసీడింగ్ పత్రాలు చూపుతున్న జెన్‌కో రిటైర్డ్ ఎస్ఈ చీదు దేవేందర్‌రెడ్డి, ఆయన సోదరులు

అదే సర్వే నంబర్‌లోని భూమికి పట్టా

సర్వే నంబర్ 174లోనే ఉన్న మరో 3 ఎకరాల భూమిని ఇటీవలే వడ్డేపల్లికి చెందిన వ్యక్తికి రాయపోల్ తాసిల్దార్ కిష్‌సింగ్ పట్టాచేసి ఇచ్చారని బాధిత రైతులు పేర్కొంటున్నారు. అదే సర్వే నంబర్‌లోని తమ భూమిని ఎందుకు తమ పేరిటచేయడం లేదని తాసిల్దార్‌ను అడిగితే.. 'నా ఇష్టం' అంటూ బెదిరించారని వాపోయారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, పహాణీ ఉన్నప్పటికీ పట్టా భూమిని ప్రభుత్వ భూమిలో కలిపి రెవెన్యూ అధికారులు తమకు తీరని అన్యాయం చేశారని బాధితులు ఆరోపించారు.

జిల్లా అధికారులకు నివేదించా

వడ్డేపల్లిలోని సర్వే నంబర్ 174లో చీదు దేవేందర్‌రెడ్డి, అతని కుటుంబసభ్యులకు సంబంధించిన భూములు ప్రభుత్వ భూమిగా మారడం మా దృష్టికి వచ్చింది. ఉమ్మ డి దౌల్తాబాద్ మండలంలోనే మార్పులు జరిగాయని బాధితులు సైతం దరఖాస్తు చేసుకొన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించాను. భూములను రీ సర్వేచేయిండంతోపాటు పూర్తి విచారణ జరిపిస్తాం. సదరు భూమి యాజమనులు అర్డీవోకు అప్పీలు చేసుకోవాలి. ఈ విషయంలో పూర్తి విచరణ జరిపించి వారికి తగిన న్యాయంచేస్తాం.

- వాణిరెడ్డి, రాయపోల్ తాసిల్దార్

లంచం ఇచ్చినా సర్వేచేస్తలేరు!

- వారసత్వ భూమిని రికార్డుల్లో తక్కువ చూపారు
- ఖమ్మం జిల్లా వల్లభి మాజీ సర్పంచ్ భిక్షం ఆవేదన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: లంచం ఇచ్చినా తన సమస్యను రెవెన్యూ అధికారులు పరిష్కరించడం లేదని ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, వల్లభి గ్రామ మాజీ సర్పంచ్ బిచ్చాల భిక్షం ఆవేదన వ్యక్తంచేశారు. చివరికి న్యాయం కోసం ధర్మగంటను ఆశ్రయించారు. వల్లభి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 44ఋ/2అ/అలో 1.10 ఎకరాల భూమి భిక్షంకు వారసత్వంగా వచ్చింది. ఈ భూమిని భిక్షం పేరిట పట్టామార్చే క్రమంలో రికార్డుల్లో కేలవం 15 గుంటలు మాత్రమే చూపించారు. ఈ భూమికి మాత్రమే రైతుబంధు సొమ్ము రూ.1,500 అందించారు. తనకు అన్యాయం జరిగిందని 13 జూన్ 2018న అక్కడి తాసిల్దార్‌కు దరఖాస్తు చేసుకొన్నప్పటికీ నేటికీ న్యాయంచేయలేదు. సర్వేచేసి తన భూమిని రికార్డుల్లో ఎక్కించాలని మొరపెట్టుకొన్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. సర్వే చేస్తామని చెప్పి రూ.2,500 లంచం కూడా తీసుకొన్నారని ఆరోపించారు. ఎందుకు సర్వేచేయడం లేదని, భూమి ఎందుకు తక్కువగా చూపిస్తున్నారో చెప్పాలని సమాచార హక్కు చట్టం కింద ఈ ఏడాది మే 2న దరఖాస్తు చేసినా దీనిపై ఎటువంటి వివరాలు ఇవ్వకుండా అధికారులు నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. దయచేసి తనకు న్యాయం జరిగేలా చూడాలని ధర్మగంట ద్వారా ఉన్నతాధికారులను కోరారు.

పైసలకోసం పట్టాలు మార్చేశారు

వీఆర్వో, వీఆర్ఏ చేతివాటం • అక్రమార్కులతో కలిసి రికార్డులు తారుమారు

పాస్‌పుస్తకాలు ఉన్నా అందని రైతుబంధు • జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం తిమ్మంపేట రైతుల ఆవేదన

రెవెన్యూ అధికారులు పైసల కోసం పట్టాలు మార్చేశారు. అక్రమార్కులతో కలిసి రికార్డులను తారుమారుచేశారు. న్యాయంగా రావాల్సిన పట్టాదారు పాస్‌పుస్తకం, రైతుబంధు చెక్కులు రాకుండా అడ్డుకొంటున్నారు. రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగితిరిగి వేసారుతున్న రైతులు ఒక్కోసారి కోర్టు మెట్లు ఎక్కాల్సిన దుస్థితి నెలకొంటున్నది. వీఆర్వో, వీఆర్ఏ చేతివాటంతో జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం తిమ్మంపేట రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీఆర్వో, వీఆర్ఏ పైసలు ఇవ్వనిదే పనిచేయడం లేదని రైతులు ధర్మగంటకు గోడువెల్లబోసుకున్నారు.

– జనగామ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ

కానిస్టేబుల్‌తో కలిసి వీఆర్వో కక్కుర్తి

జఫర్‌ఘడ్ మండలం తిమ్మంపేటకు చెందిన మంద మల్లయ్యకు సర్వే నంబర్లు 222, 242లో 29.30 ఎకరాల భూమి ఉన్నది. ఆ భూమిని తన నలుగురు కుమారులకు సమానంగా పంచారు. వారిలో మంద నాంపల్లి మిగిలిన ముగ్గురు సోదరుల నుంచి తండ్రి పంచి ఇచ్చిన భూమిని కొనుగోలుచేశారు. అందులో 15 ఎకరాలను సాగుచేసుకొంటుండగా మిగిలిన దానిని కంచెవేసి గొర్రెలను మేపేందుకు వదిలేశారు. అయితే, ఆ భూములకు పక్కనే ఉన్న గిరిజన రైతులు కొందరు స్థానిక వీఆర్వో కమలాకర్, వీఆర్ఏ వెంకన్న సాయంతో నాంపల్లికి చెందిన భూమిని ఆక్రమించుకొని రికార్డుల్లో ఎక్కించుకొన్నారు. కబ్జాదారుల్లో ఒకరైన పోలీస్ కానిస్టేబుల్ తిరుపతి రెవెన్యూ అధికారులతో కలిసి తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నాంపల్లి ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు సమక్షంలో పంచాయితీ నిర్వహించగా తన భూమికి.. తిరుపతికి ఎలాంటి సంబంధం లేదని తేల్చారని పేర్కొన్నారు. అంతేగాకుండా సర్వే నంబర్ 242 లోని 5.20 ఎకరాల భూమిని తిరుపతి అక్రమంగా రికార్డుకెక్కించుకొన్నారని.. రెవెన్యూ అధికారులు వెంటనే రికార్డులను సరిచేయాలని తీర్మానించారని చెప్పారు. కానీ, అధికారులు మాత్రం రికార్డులు సరిచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. గతంలో రికార్డు మారుస్తానని చెప్పిన వీఆర్వో కమలాకర్ లంచంగా గొర్రెను తీసుకెళ్లాడని నాంపల్లి చెప్తున్నారు.

మంద నాంపల్లి

రూ.20 వేలు ఇయ్యలేదని..

తిమ్మంపేటకు చెందిన గర్వందుల మంకయ్యకు సర్వే నంబర్ 72/సీ/1లో 1.25 ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించింది. కుమార్తె వివాహం కోసం మంకయ్య 1.05 ఎకరం భూమిని మల్లం కృష్ణమూర్తికి విక్రయించారు. కృష్ణమూర్తి కూడా కొద్దిరోజుల తర్వాత భూమిని మంద మల్లయ్యకు అమ్మేశారు. మిగతా 20 గుంటల భూమి మంకయ్య ఆధీనంలో ఉన్నది. అయితే, స్థానికుడైన సయ్యద్ జవార్ వీఆర్వో కమలాకర్ సాయంతో రికార్డును మార్చి పట్టాదారుడిగా పేరు నమోదు చేయించుకొన్నారు. కబ్జాలో మాత్రం అసలు పట్టాదారుడైన మంకయ్య పేరును నమోదుచేశారు. ఈ విషయంపై జవార్‌ను నిలదీయగా తనకు ఈ భూమితో ఎలాంటి సంబంధం లేదని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. ఇదిలాఉండగా, మల్లయ్య కూడా తాను కొనుగోలు చేసిన 1.05 ఎకరాలను పింతల గోపాల్‌కు విక్రయించారు. కానీ, గోపాల్ 1.05 ఎకరాలతోపాటు పక్కనున్న 20 గుంటలను సైతం సాగు చేసుకొంటున్నాడని మంకయ్య తెలిపారు. దీనిపై తాసిల్దార్‌కు ఫిర్యాదు చేయగా వీఆర్వో కమలాకర్‌ను విచారణకు ఆదేశించారు. రికార్డులు పరిశీలించిన వీఆర్వో సరిచేసి తన పేరిట రాసేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేసినట్టు బాధితుడు పేర్కొన్నారు. తన భూమిని ఇతరుల పేరిట రికార్డు మార్చి రాసి సరిచేసేందుకు లంచం అడిగినందున నిరాకరించిన కారణంగా రెండేండ్లుగా చుట్టూ తిప్పుకొంటున్నారని మంకయ్య ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై ఆర్డీవో, తాసిల్దార్, పోలీస్‌లను కలిసి ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరుగడం లేదని పేర్కొన్నారు.

గర్వందుల మంకయ్య

చిర్రస్వామి

ఎకరం భూమి మాయంచేశారు

తిమ్మంపేటకు చెందిన చిర్ర స్వామికి సర్వే నంబర్ 318/సీలో ఐదెకరాల భూమి ఉన్నది. తన అవసరాల నిమిత్తం రెండెకరాలను పెండ్లి శ్రీను అనేవ్యక్తికి విక్రయించారు. కేవలం ఎకరం భూమికి మాత్రమే డబ్బులు చెల్లించిన శ్రీను అధికారులను మచ్చిక చేసుకొని రెండెకరాలు పట్టా చేసుకొన్నారు. ఆ భూమిని వేరే వ్యక్తికి అమ్మేశారు. విషయం తెలుసుకొన్న స్వామి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేయగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అంతేగాకుండా, మిగిలిన 3 ఎకరాలకు పాస్‌పుస్తకం జారీ చేసినప్పటికీ రైతుబంధు పెట్టుబడి సాయం ఇవ్వడం లేదని బాధితుడు చిర్ర స్వామి వాపోతున్నారు.

పట్టా రాలేదు.. ప్రాణం పోయింది!

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వృద్ధ రైతును బలిగొన్న రెవెన్యూ నిర్లక్ష్యం
- మృతదేహంతో బూర్గంపహాడ్ తాసిల్ ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన
- న్యాయంచేస్తామని రెవెన్యూ అధికారుల హామీ

బర్ల వెంకటనర్సయ్య మృతదేహంతో తాసిల్ ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు

బూర్గంపహాడ్: ఓ రైతు తన భూమికి పట్టా కోసం పడరాని పాట్లు పడ్డాడు.. అధికారులను పలుమార్లు ప్రాధేయపడ్డాడు. కాళ్లరిగేలా తిరిగినా అధికారులు కనికరించలేదు. దీంతో దిగులు చెందిన రైతు అనారోగ్యం పాలయ్యాడు. చివరికి భూమి పట్టా తీసుకోకుండానే ప్రాణం వదిలాడు. ఈ విషాదకర ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. దీంతో బాధిత కుటుంబసభ్యులు మృతదేహంతో తాసిల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయంచేస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బూర్గంపహాడ్‌కు చెందిన బర్ల వెంకటనర్సయ్య (72)కు రెండు ఎకరాల భూమి ఉన్నది. తన భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం రాలేదని దిగులుతో ఆరోగ్యం క్షీణించి మృతిచెందాడు. తమ తాతల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని దాయాదులు తప్పుడు పత్రాలతో వారి పేరిట పట్టాచేయించుకొన్నారని మృతుడి భార్య లక్ష్మి ఆరోపించారు. బూర్గంపహాడ్ రెవెన్యూ పరిధిలో బర్ల వెంకటనర్సయ్య తండ్రి బర్ల సర్వయ్యకు సర్వే నంబర్లు 104, 186లో నాలుగు ఎకరాల భూమి ఉన్నది. ఆ భూమి సర్వయ్య కుమారులైన బర్ల నర్సయ్య, బర్ల వెంకటనర్సయ్యకు చెరొక రెండెకరాలు వారసత్వంగా సంక్రమించింది. బర్ల నర్సయ్య కుమారులైన బర్ల పిచ్చయ్య, బర్ల నాగేశ్వరరావు తప్పుడు పత్రాలతో భూరికార్డుల ప్రక్షాళన సమయంలో వారికి వారసత్వంగా వచ్చిన రెండెకరాలే కాకుండా మొత్తం మూడు ఎకరాలను వారి పేరిట పట్టాచేయించుకొన్నారని మృతుడి భార్య లక్ష్మి తెలిపారు. తన భర్త వాటా కింద కేవలం ఎకరం భూమికి మాత్రమే పట్టా వచ్చిందని, మిగతా భూమికి రాలేదని, ఈ విషయంపై రెవెన్యూ అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా పట్టించుకోలేదని వాపోయారు. మనస్తాపం చెందిన తన భర్త అనారోగ్యానికి గురై మృతిచెందినట్టు పేర్కొన్నారు. తన భర్త మృతికి రెవెన్యూ అధికారులే కారణమని ఆరోపిస్తూ కుటుంబసభ్యులతో కలిసి తాసిల్ కార్యాలయం ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. స్పందించిన రెవెన్యూ అధికారులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐలు వెంకటప్పయ్య, రామ్‌జీ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బూర్గంపహాడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

దగాపడ్డ దళిత కుటుంబాలు

- దశాబ్దాలుగా సాగులో ఉన్నా పాస్‌బుక్‌లు లేవు
- 30 ఎకరాలు దున్నుకొంటున్న 20 మంది
- వీరి అమాయకత్వంతో దళారుల ఆటలు
- అధికారులతో కుమ్మక్కై స్థానికేతరులకు పట్టా
- ఆందోళనలో వరంగల్ అర్బన్ జిల్లా రైతులు

వరంగల్ సబర్బన్, నమస్తే తెలంగాణ: ఇది సుమారు వంద దళితుల కన్నీటి కథ. దశాబ్దాలుగా భూములను సాగుచేసుకొంటున్నా పాస్‌పుస్తకాలు లేవు. రెవెన్యూ అధికారులు వీరి భూములకు నేటికీ పాస్‌పుస్తకాలు ఇవ్వకపోవడంతో కొందరు దళారులు ఈ భూమి తమదేనంటూ ఇబ్బందులకు గురిచేస్తున్న దారుణ ఘటన వరంగల్ అర్బన్ జిల్లా, వేలేరు మండలం, కన్నారం శివారులోని ఇచ్చులపల్లిలో నెలకొన్నది. సాగుదారులు.. పోలీసులను, రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో తమ బాధను 'ధర్మగంట'తో మొర పెట్టుకొన్నారు. కరీంనగర్ జిల్లా, హుజూరాబాద్ మండలం, తుమ్మనపల్లి గ్రామానికి చెందిన మిడిదొడ్డి బక్క మల్లయ్య తన తొమ్మిది మంది కొడుకులతో కలిసి సుమారు వందేండ్ల కింద ఇచ్చులపల్లికి వలస వచ్చారు. వ్యవసాయ పనులు చేసినందుకుగాను అప్పటి భూస్వామి వీరికి 68, 72, 49 సర్వేనంబర్లతోపాటు మరికొన్ని సర్వే నంబర్లలో సుమారు 30 ఎకరాల భూమిని కేటాయించారు. అప్పటినుంచి మల్లయ్య వారసులైన వీరయ్య, రాజమల్లయ్య, కొంరయ్య, లస్మయ్య, రామయ్య, ఎల్లయ్య, చిన్న రామయ్య, రాజయ్య, ఇజ్రయిల్ భూములను సాగుచేస్తున్నారు. ఆ తర్వాత వీరి వారసులు మరో 20 మంది భూములను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం నాలుగోతరం కాస్తులో ఉన్నది. ఈ క్రమంలో ఐదేండ్ల కింద ఈ భూమిని తాను కొన్నానంటూ ఓ మహిళ తన అనుచరులతో వచ్చి 'మీరు ఇందులో అడుగు పెట్టొద్దు' అంటూ హుకుం జారీచేశారు. భూముల్లోకి ఎవరూ రాకుండా తన మనుషులను పహారా పెట్టినట్టు బాధితులు వాపోతున్నారు. దశాబ్దాల నుంచి దున్నుకొంటున్న వాస్తవ సాగుదారులకు తెలియకుండానే భూమిని ఎలా మార్పిడి చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. గ్రామంలోని ఓ మాజీ ప్రజాప్రతినిధి రైతుల అమాయకత్వాన్ని ఆసరాచేసుకొని పాత పహాణీల్లో పట్టాదారుల పేర్లను సేకరించి, వారి పేర్లతో ముందుగా పట్టా చేసుకొని ఇతరులకు విక్రయించాడని ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీఆర్వో, ఆర్ఐ ప్రాథమికంగా సర్వే చేయకుండానే వేరొకరికి ఎలా పట్టాచేశారు? వారు ఉద్దేశపూర్వకంగానే తప్పుడు రిపోర్టు ఇచ్చారా? అనేది సందేహంగా ఉన్నది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపడితే వాస్తవాలు తెలుస్తాయని బాధిత రైతులు చెప్తున్నారు. రెవెన్యూ అధికారుల అవినీతి వల్లే కుట్ర జరిగి ఉంటుందని ఆరోపిస్తున్నారు. 1980లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని భూముల్లో కబ్జాలో ఎవరు ఉన్నారనే విషయాన్ని అప్పటి ప్రభుత్వం రికార్డుల్లో నమోదుచేసిందని, వీటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి తమకు న్యాయంచేసి, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని బాధిత రైతులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

తమ భూముల పత్రాలను చూపుతున్న వరంగల్ అర్బన్ జిల్లా వేలేరు మండలం ఇచ్చులపల్లి బాధిత రైతులు

రికార్డుల్లో నాలుగెకరాలు మాయం!

- వరంగల్ అర్బన్ జిల్లా పంథని వీఆర్వో చేతివాటం
- ధర్మగంటను ఆశ్రయించిన బాధితురాలు పనస పద్మ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తనకు తెలియకుండానే నాలుగెకరాల భూమిని వీఆర్వో డబ్బులు తీసుకొని ఇతరులకు రాసిచ్చాడంటూ వరంగల్ జిల్లా, ఐనవోలు మండలం, పంథని గ్రామానికి చెందిన పనస పద్మ 'ధర్మగంట'ను ఆశ్రయించారు. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పనస పద్మ 60 ఏండ్ల కింద పంథిని గ్రామానికి ఉపాధి కోసం వలసవచ్చారు. ఇక్కడే ఉంటూ సర్వే నంబర్ 251/3/1/ఏలో 26 ఎకరాల భూమిని కొనుగోలుచేశారు. అందులో 18 ఎకరాలను వెంకటేశ్వర్లు, సోమన్నకు అమ్మేశారు. మిగిలిన 8 ఎకరాల భూమి ఆమె పేరిటే ఉన్నది. అయితే, 13 ఏండ్ల కింద పంథని గ్రామాన్ని వదిలి మరో ఊరికి కుటుంబంతోపాటు వెళ్లిపోయారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో పద్మ పేరిట నాలుగెకరాలే ఉన్నట్టు కొత్త పాస్‌పుస్తకాలు అందించారు. మిగతా నాలుగెకరాలు ఎక్కడికి వెళ్లిందని ఆరా తీస్తే.. వీఆర్వో డబ్బులు తీసుకొని యాట లక్ష్మి అనే మహిళకు పట్టా చేసేశారని తెలిసిందని బాధితురాలు ఆరోపించారు. తన ప్రమేయంలేకుండా నాలుగెకరాలను దొడ్డిదారిన వీఆర్వో ఇతరులకు కట్టబెట్టిన విషయాన్ని గత ఏడాది మేలో ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో, తాసిల్దార్, వరంగల్ అర్బన్ ఆర్డీవోకు ఫిర్యాదుచేశానని, అయినా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. చివరికి న్యాయం కోసం 'ధర్మగంట'ను ఆశ్రయించినట్టు బాధితురాలు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయంచేయాలని కోరారు.

SILK MARK

ఆషాఢం ఆఫర్ సేల్

ఆనందం హోల్‌సేల్

2 ఆరణి చెక్స్ శారీస్ ₹333

2 కుప్పాడం జరీ శారీస్ ₹444

2 మాస్టర్ కార్డ్ శారీస్ ₹555

2 విపుల్ కేటలాగ్ శారీస్ ₹666

MENS

3 కేజువల్ షర్ట్స్ or
3 ఫార్మల్ షర్ట్స్ or
2 బ్రాండెడ్ జీన్స్ or
3 బ్రాండెడ్ ట్రౌజర్స్

₹999 మాత్రమే

WOMENS

లెగ్గింగ్స్ • కుర్తీస్
డ్రస్ మెటీరియల్స్
సల్వార్ సూట్స్

1+1 1+2

BOYS

టి-షర్ట్స్, షర్ట్స్,
3/4 పాంట్స్,
బాబా సూట్స్

1+2

GIRLS

ఫ్రాక్స్ కుర్తీస్
టాప్స్ లెగ్గింగ్స్

1+2

అదృష్ట బ్రేక్‌ఫాస్ట్ సేల్

అన్నిరకాల సరికొత్త వస్త్రాలపై 63% వరకు తగ్గింపు

₹1225/- తగ్గింపు
10 గ్రాముల 916 బంగారు ఆభరణాలపై

తరుగు - మజూరీ లేదు
సిల్వర్ ఆర్టికల్స్ పై

₹1000 అధికంగా పొందండి
పాత ఆభరణాల మార్పిడిపై 10 గ్రాములకు

*Conditions apply.

బంగారు ఆషాఢం

బంగారు గొలుసులు గాజుల పై ఫ్లాట్ 6% తరుగు

J.C.Brothers

THE FAMILY SHOPPING MALL

DILSUKHNAGAR - KUKATPALLY - ZAHEERABAD

Pure Pattu Sarees | Designer Sarees | Fancy Sarees | Chudidars | Dress Materials | Ghaghras | Mens & Kids Wear

జొకోవిచ్ ఫెదరర్

మహిళల ఫైనల్ నేడు
సెరెనా X హలెప్
సా. 6.30 నుంచి
స్టార్ స్పోర్ట్స్‌లో..

జోకర్ X రోజర్

వింబుల్డన్ ఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్న జొకోవిచ్, ఫెదరర్

సెమీస్‌లో అగట్, నాదల్ ఓటమి

వన్డే ప్రపంచకప్ ఫైనల్లో తలపడేదెవరో ఒకరోజు ముందే తేలిపోగా.. ఇంగ్లండ్ వేదికగానే సాగుతున్న ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టోర్నీలోనూ ఫైనలిస్టుల పేర్లు తాజాగా ఖరారయ్యాయి. డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ ఆరోసారి వింబుల్డన్ తుదిపోరుకు చేరగా.. మట్టికోట మహారాజు రాఫెల్ నాదల్‌ను మట్టికరిపించిన స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ 31వ సారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఆదివారం ఓవైపు క్రికెట్ ప్రపంచకప్ జరుగుతున్న సమయంలోనే మరోవైపు గ్రాస్‌కోర్టులో ఈ కొదమ సింహాలు టైటిల్ కోసం తలపడనున్నాయి.

లండన్:

అంచనాలకు అనుగుణంగా సాగిన వింబుల్డన్ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లారు. ఆల్ ఇంగ్లండ్ క్లబ్ వేదికగా శుక్రవారం జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్ 6-4, 4-6, 6-3, 6-2తో 23వ సీడ్ రొబెర్టో బటిస్టా అగట్ (స్పెయిన్)పై.. ఫెదరర్ 7-6 (7/3), 1-6, 6-3, 6-4తో నాదల్‌పై గెలిచి తుది పోరుకు అర్హత సాధించారు. ఆదివారం జరిగే ఫైనల్లో జొకోవిచ్, ఫెదరర్ అమీతుమీ తేల్చుకోనున్నారు. దాదాపు నెల రోజుల క్రితం ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్ గెలిచిన నాదల్‌తో పాటు సుదీర్ఘ ప్రయత్నాల అనంతరం కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ సెమీఫైనల్ చేరిన అగట్ అసలు పోరులో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు.

జొకో సిక్సర్

గతేడాది వింబుల్డన్ సెమీస్‌లో నాదల్‌తో సుదీర్ఘంగా (5 గంటల 15 నిమిషాల పాటు) సాగిన పోరాటంలో జొకోవిచ్ చెమటోడ్చి నెగ్గగా ఈ సారి అందులో సగం సమయంలోనే విజేతగా నిలిచి తుదిపోరుకు అర్హత సాధించాడు. 2 గంటల 49 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో జొకోవిచ్ 9 ఏస్‌లు సంధించి 5 బ్రేక్ పాయింట్‌లు సాధించగా.. అగట్ 5ఏస్‌లే కొట్టి ఒక్క బ్రేక్ పాయింట్ గెలుచుకున్నాడు. జొకో 42 విన్నర్లు కొట్టి, 29 అనవసర తప్పిదాలు చేస్తే.. అగట్ 34 విన్నర్లు, 30 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. తొలిసెట్‌లో ప్రత్యర్థి నుంచి పెద్దగా ప్రతిఘటన లేకపోవడంతో సునాయసంగానే నెగ్గిన జకోవిచ్.. రెండో సెట్‌లో అనూహ్యంగా ఓటమి పాలయ్యాడు. మూడోసెట్‌లో 45 షాట్ల సుదీర్ఘ ర్యాలీతో గట్టి పోటీ ఎదురవడంతో సెర్బియా యోధుడు చెమటోడ్చాల్సి వచ్చినా.. కీలక సమయాల్లో ప్రత్యర్థి తప్పులు చేయడంతో సునాయసంగా విజయం సాధించాడు. గత 13 గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్లలో పన్నెండింట నెగ్గిన ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ 25వ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. 15 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన అతడు 9 సార్లు రన్నరప్‌గా నిలిచాడు. ఇప్పటివరకు నాలుగు సార్లు (2011, 2014, 2015, 2018) వింబుల్డన్ ట్రోఫీ నెగ్గిన 32 ఏండ్ల జొకోవిచ్ ఒకసారి (2013) రన్నరప్‌గా నిలిచాడు. 'ఆ రోసారి ఇక్కడ ఫైనల్ ఆడనుండటం ఆనందంగా ఉంది. కెరీర్‌లో ఎన్నో ఫైనల్స్ ఆడినా.. ఇక్కడ తుదిపోరు ఇచ్చే మజానే వేరు. నాదల్, ఫెదరర్ తలపడుతుంటే చూడటం ఎంతో మజానిస్తుంది. వారి మ్యాచ్‌కు నేను పెద్ద అభిమానిని. ఇది ఆల్‌టైమ్ గ్రేట్ మ్యాచ్ లాంటిది' అని విజయం అనంతరం జొకో పేర్కొన్నాడు.

ఫెదరర్ డబుల్ సిక్సర్

ప్రియమైన ప్రత్యర్థిపై గ్రాస్ కోర్టులో పెదరర్‌దే పైచేయి అయింది. 3 గంటల 2 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో.. 14 ఏస్‌లు సంధించిన ఫెదరర్ 51 విన్నర్లు కొట్టాడు. మరోవైపు నాదల్ 10 ఏస్‌లు సంధించి 32 విన్నర్లే కొట్టగలిగాడు. తొలి సెట్లో ఇద్దరు యోధులు హోరాహోరీగా తలపడటంతో పోరు నువ్వా నేనా అన్నట్లు సాగింది. చివరికు కీలక సమయంలో నాదల్ సర్వీస్ బ్రేక్ చేసిన రోజర్ సెట్ గెలచుకున్నాడు. అయితే రెండో సెట్‌లో స్పెయిన్ బుల్ విశ్వరూపం ప్రదర్శించడంతో రోజర్ కనీస పోటీనివ్వలేకపోయాడు. దీంతో చెరో సెట్ సొంతం చేసుకొని 1-1తో నిలిచారు. మూడో సెట్‌లో విజృంభించిన స్విస్ స్టార్ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా కీలక సమయాల్లో పాయింట్లు సాధిస్తూ సెట్ సొంతం చేసుకున్నాడు. నాలుగో సెట్‌లో రసవత్తర పోరాటం సాగింది. టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్‌లిద్దరూ నువ్వా నేనా అన్నట్లు తలపడ్డా కీలక సమయాల్లో ఆధిక్యం కనబర్చిన ఫెదరర్ విజేతగా నిలిచి 12వ సారి వింబుల్డన్ ఫైనల్‌కు చేరాడు. ఇప్పటికి ఎనిమిది సార్లు (2003, 2004, 2005, 2006, 2007, 2009, 2012, 2017) వింబుల్డన్ నెగ్గిన ఫెదరర్.. మరో మూడుసార్లు రన్నరప్‌గా నిలిచాడు.

చరిత్రకు చేరువలో..

ప్రపంచకప్‌పై కన్నేసిన ఇంగ్లండ్, న్యూజిలాండ్

ఎవరు గెలిచినా తొలిసారే..



విలియమ్సన్

ఇంగ్లండ్, న్యూజిలాండ్.. 44 ఏండ్ల క్రితం ప్రపంచకప్ పోటీలు ప్రారంభమైనప్పటి నుంచి ఆడుతూ వస్తున్నాయి. ఐదురోజుల ఫార్మాట్‌పై ఎక్కువ దృష్టి పెట్టి పరిమిత ఓవర్ల ఆటను పెద్దగా పట్టించుకోని జట్టు ఒకటైతే.. బరిలో దిగిన ప్రతీసారి ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టిస్తూ తమదైన ముద్రవేసిన జట్టు మరొకటి. మూడు సార్లు ఫైనల్ చేరినా.. తుది మెట్టుపై బోల్తా కొట్టిన జట్టు ఒకటైతే.. గత ప్రపంచకప్‌లో ఫైనల్లో ఓడిన జట్టు మరొకటి. బాదుడుతో పాటు నిత్యవివాదాలతో తరచూ వార్తల్లో నిలిచే ఇంగ్లిష్ జట్టుకు.. జెంటిల్‌మెన్ ఆటకు నిలువెత్తు రూపంలా కనిపించే బ్లాక్‌క్యాప్స్ వ్యవహార శైలికి అసలు పొంతనే ఉండదు. ఒకరిది దూకుడు, దుందుడుకు స్వభావమైతే.. మరొకరిది నిలకడ, నియంత్రణతో కూడిన ఆటతీరు. ఇంతవరకు ప్రపంచకప్‌ను ముద్దాడని ఈ రెండు జట్లలో ఎవరు గెలిచినా చరిత్రే. ఇన్నేండ్లకు దక్కిన చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పుట్టింటికి కప్ పట్టుకు రావాలని ఇంగ్లండ్.. ఇంకెన్నాళ్లు సెమీస్ స్టార్‌గా మిగిలిపోవడం ఈసారైనా చాంపియన్‌గా నిలువాలని న్యూజిలాండ్ తాపత్రయ పడుతున్నాయి. మరి ఈ రెండు జట్లలో తొలిసారి కప్పుకొట్టి విశ్వవిజేతగా నిలిచేదేవరో తేలాలంటే ఆదివారం ఫైనల్ ఫైట్ వరకు వేచి చూడాల్సిందే.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

మోర్గాన్

నాలుగేండ్లలో పూర్తిగా మారి..

మెగాటోర్నీ తొలినాళ్లలో చక్కటి ప్రదర్శనలతో ఇంగ్లండ్ మూడు సార్లు ఫైనల్ చేరినా.. ఒక్కసారి కూడా కప్పు కొట్టలేకపోయింది. ముఖ్యంగా సంప్రదాయ క్రికెట్‌పై దృష్టిపెట్టిన ఇంగ్లిష్ జట్టు ప్రపంచకప్‌లో ఎప్పుడూ ప్రధాన పోటీదారుగా కనిపించలేదు. ఆరంభంలో 60 ఓవర్ల మ్యాచ్‌లు.. ఎరుపు బంతులు.. ఉన్న జమానాలో కాస్త ప్రభావం చూపినా.. ఆ తర్వాత రోజురోజుకూ ప్రభ కోల్పోయింది. ఎంతగా అంటే 2011 ప్రపంచకప్‌లో ఐర్లాండ్ చేతిలో ఓడిన ఇంగ్లండ్.. ఆ తర్వాతి టోర్నీలో బంగ్లాదేశ్ చేతిలో పరాజయం పాలై లీగ్ దశలోనే ఇంటిదారి పట్టింది. మొన్నమొన్నటి వరకూ ఇంగ్లండ్ ఆటగాళ్లు, అభిమానులు ప్రపంచకప్ కంటే యాషెస్ సిరీస్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాళ్లనడంలో అతిశయోక్తి లేదు. కానీ నాలుగేండ్ల నుంచి ఆ జట్టు ఆలోచనా ధోరణి పూర్తిగా మారింది. 2015 ప్రపంచకప్ గ్రూపు దశలో ఇంగ్లండ్ ఆడిన 6 మ్యాచ్‌ల్లో 2 మాత్రమే గెలిచి నాలుగింట ఓడింది. తమకంటే చాలా బలహీనమైన స్కాట్లాండ్, ఆఫ్ఘనిస్థాన్‌పై మాత్రమే నెగ్గిన ఇంగ్లిష్ జట్టు.. పెద్దగ ప్రమాదకరం కానీ బంగ్లాదేశ్, శ్రీలంక చేతిలోనూ ఓడి నాకౌట్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక అక్కడి నుంచి ప్రక్షాళన ప్రారంభమైంది. టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యమిస్తూనే.. పరిమిత ఓవర్ల క్రికెట్ కోసం ప్రత్యేక జట్టును తీర్చిదిద్దింది. అప్పటికే జట్టు కెప్టెన్‌గా ఉన్న మోర్గాన్‌ను కొనసాగిస్తూ.. రూట్, బట్లర్, వోక్స్ వంటి ఆటగాళ్లను మరింత సానబెట్టింది. గత ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ తరపున ఓపెనర్‌గా బరిలో దిగిన మొయిన్ అలీ ఈ టోర్నీలో 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడంటే.. ఆ జట్టు ఎంతలా మార్పు చెందిందో అర్థం చేసుకోవచ్చు.

12 టోర్నీల్లో 8 సార్లు సెమీస్ చేరి..

మరోవైపు మొదటి ప్రపంచకప్‌లోనే సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లిన న్యూజిలాండ్.. వెస్టిండీస్ చేతిలో ఓడి ఇంటి దారిపట్టింది. ఆ తర్వాత 1979లోనూ సెమీస్ చేరినా ఇంగ్లండ్ చేతిలో ఓడి నిష్క్రమించింది. ఆ తర్వాత 1992, 99ల్లో పాకిస్థాన్ చేతిలో.. 2007, 11లో శ్రీలంక చేతిలో.. పరాజయం పాలైంది. గత ప్రపంచకప్ సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై నెగ్గిన కివీస్ తొలిసారి ఫైనల్ చేరినా.. ఆస్ట్రేలియా చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా 5 సార్లు విశ్వ విజేతగా నిలిచినా.. సెమీస్ చేరడంలో మాత్రం న్యూజిలాండ్‌దే పైచేయి. మిగిలిన అన్ని జట్లతో పోలిస్తే బ్లాక్‌క్యాప్స్ అత్యధికంగా 8వ సారి సెమీస్ చేరి రికార్డు సృష్టించింది. గత ప్రపంచకప్‌లో కెప్టెన్ మెకల్లమ్ తుఫాన్ ఇన్నింగ్స్‌కు మిడిలార్డర్‌లో విలియమ్సన్, ఇలియట్ నిలకడ తోడవడంతో ఫైనల్ చేరిన కివీస్ ఈ సారి అందుకు భిన్నంగా నెమ్మదైన ఆట.. ఆల్‌రౌండర్ల అండ.. నాణ్యమైన పేస్ విజృంభణతో ఇక్కడి వరకు వచ్చింది. గత ఫైనల్లో ఆరంభంలోనే వికెట్లు కోల్పోవడంతో ప్రత్యర్థికి భారీ టార్గెట్ ఇవ్వలేకపోయిన న్యూజిలాండ్ అందుకు తగ్గ మూల్యం చెల్లించుకుంది. ఈ నాలుగేండ్లలో ప్లేయర్లు మారినా.. జట్టు ఆటతీరులో పెద్దగా మార్పు రాలేదు. సంయమనంతో కూడిన ఇన్నింగ్స్‌లు ఆడటంలో ప్రపంచ మేటి ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న విలియమ్సన్ తనదైన శైలిలో జట్టును నడిపిస్తున్నాడు. కేన్ నాయకత్వంలో న్యూజిలాండ్ ఒకరిద్దరి ప్రదర్శనలపై కాకుండా సమిష్టిగా ముందుకు సాగుతున్నది. ఏనాడు ప్రత్యర్థిపై మాట తూలిన దాఖలాలు లేని కివీస్.. జెంటిల్‌మెన్ ఆటకు మరింత వన్నె తెస్తూ తొలిసారి ప్రపంచకప్‌ను ముద్దాడితే అంతకన్నా కావల్సిందేముంటుంది.

మెకల్లమ్ సునామీ..

2015 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ ఆడిన రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడింది. ఆ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 33.2 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌటైంది. అప్పటికి జట్టులో యువకుడైన రూట్ 46 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలువగా.. కెప్టెన్ మోర్గాన్ (17) విఫలమయ్యాడు. లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ 25 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో విరుచుకుపడి 77 పరుగులు చేశాడు. ఫలితంగా న్యూజిలాండ్ 12.2 ఓవర్లలో టార్గెట్ ఛేజ్ చేసి విజేతగా నిలిచింది.

నా అదృష్టం కొద్ది ధోనీ రనౌట్: గప్టిల్

లండన్: ప్రపంచకప్ తొలి సెమీఫైనల్లో కీలక సమయంలో మహేంద్రసింగ్ ధోనీని రనౌట్ చేసిన న్యూజిలాండ్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ అదృష్టం కొద్ది అది సాధ్యమైందని అన్నాడు. 'బంతి నేరుగా నా వద్దకు వస్తుందని అనుకోలేదు. ఒకసారి బాల్ అందుకున్నాక వీలైనంత త్వరగా దాన్ని తిరిగి పంపాలి అనుకున్నా. బంతిపై పట్టు సాధించాక ఎదురుగా ఉన్న వికెట్‌కేసి విసిరా.. అదృష్టం కొద్ది అది డైరెక్ట్‌గా వెళ్లి వికెట్లను తాకింది. ధోనీ క్రీజు వదిలి వెళ్లడంతో మా పని తేలికైంది' అని గప్టిల్ పేర్కొన్నాడు. భారత్ విజయానికి 10 బంతుల్లో 25 పరుగులు చేయాల్సిన సమయంలో రెండో పరుగు కోసం యత్నించిన ధోనీ రనౌట్ అయ్యాడు. దీంతో టీమ్‌ఇండియా 18 పరుగుల తేడాతో కివీస్ చేతిలో ఓడి ప్రపంచకప్ నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే.

ప్రపంచకప్‌పై ప్రక్షాళన

కెప్టెన్, కోచ్‌ను ప్రశ్నించనున్న సీవోఏ

లండన్: ప్రపంచకప్‌లో భారత జట్టు ప్రదర్శనపై ప్రక్షాళన చేసేందుకు క్రికెట్ పరిపాలన కమిటీ(సీవోఏ) సిద్ధమైంది. లండన్ నుంచి స్వదేశానికి చేరుకోగానే టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లీతో పాటు, చీఫ్ కోచ్ రవిశాస్త్రితో సమావేశమై వరల్డ్‌కప్ నిష్క్రమణకు గల కారణాలను అడిగి తెలుసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు వచ్చే ఏడాది ఆస్ట్రేలియా వేదికగా జరిగే టీ20 ప్రపంచకప్ కోసం ఎలాంటి రోడ్‌మ్యాప్ అనుసరించబోతున్నారనేది చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్‌తో సీవోఏ చర్చించనుంది. ఇందులో సీవోఏ చీఫ్ వినోద్‌రాయ్‌తో పాటు సభ్యులు డయానా ఎడుల్జీ, రవి తోడ్గె భాగం కానున్నారు. 'కెప్టెన్, కోచ్ స్వదేశానికి రాగానే వారితో మాట్లాడుతాం. అయితే ప్రత్యేకంగా తేది, సమయమనేది ఇంకా నిర్ధారించుకోలేదు. టీ20 ప్రపంచకప్ దృష్ట్యా సెలెక్షన్ కమిటీ రోడ్‌మ్యాప్‌పై మేము మాట్లాడుతాం' అని రాయ్ అన్నారు. మరోవైపు ధవన్, శంకర్ గాయపడ్డా స్టాండ్‌బైగా ఉన్న రాయుడిని తీసుకోకపోవడంపై సీవోఏ చర్చకు వచ్చే అవకాశం కనిపిస్తున్నది. దీనికి తోడు వన్డేల్లో విఫలమవుతూ వస్తున్న దినేశ్ కార్తీక్‌ను ఎంపిక చేయడం, ఒకే సమయంలో ముగ్గురు వికెట్‌కీపర్లు(ధోనీ, కార్తీక్, పంత్)ను ఆడించడంపై సీవోఏ ప్రశ్నించనుంది. మరోవైపు కివీస్‌తో కీలక సెమీస్‌లో ధోనీని ఏడో స్థానంలో పంపడంపై సీవోఏ సభ్యులు వివరణ అడుగనున్నారు. ఇక సెలెక్షన్ కమిటీ సమావేశాల్లో శరణ్‌దీప్‌సింగ్, దేవాంగ్ గాంధీ నుంచి సరైన రీతిలో ఇన్‌పుట్స్ రావడం లేదని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు పేర్కొనడం పరిస్థితికి అద్దం పడుతున్నది.

రాష్ట్ర సెయిలింగ్ రెగట్టా చాంప్ ప్రీతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: తెలంగాణ సెయిలింగ్ రెగట్టా చాంపియన్‌షిప్‌లో యువ సెయిలర్ ప్రీతి కొంగర అదరగొట్టింది. టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన ప్రీతి రెండు టైటిళ్లతో మెరిసింది. రాష్ట్ర సబ్ జూనియర్ గర్ల్స్ చాంపియన్‌షిప్‌తో పాటు సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌ను ప్రీతి దక్కించుకుంది. జూనియర్ విభాగంలో సికాంశు సింగ్, కిరణ్(జూనియర్ చాంపియన్), నందిని(సబ్ జూనియర్), సోమ్‌నాథ్ రాథోడ్(జూనియర్ టైల్ ఫ్లీట్) విజేతలుగా నిలిచారు. వీరితో పాటు అద్వైత్ సోమా, అజయ్, దీప్తి, హర్షవర్ధన్, శీరిష టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబరిచారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గతేడాది(74మంది) కంటే అధికంగా ఈసారి రాష్ట్రంలోని 12 జిల్లాల నుంచి 100 మంది సెయిలర్లు పోటీపడ్డారు.

ఆఫ్ఘన్ కెప్టెన్‌గా రషీద్ ఖాన్

కాబూల్: ప్రపంచకప్‌లో నిరాశజనక ప్రదర్శన చేసి.. ఆడిన ఆన్ని మ్యాచ్‌ల్లో నూ ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచిన ఆఫ్ఘనిస్థాన్.. తప్పులు సరిదిద్దుకునే పనిలో పడింది. విశ్వసమరానికి ముందు కెప్టెన్ మార్పుతో వార్తల్లోకెక్కిన ఆఫ్ఘన్ క్రికెట్ తాజాగా.. స్టార్ స్పిన్నర్ రషీద్‌కు జట్టు పగ్గాలు అప్పగించింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ
రీజినల్ ఆఫీసర్ కార్యాలయం, PR రీజినల్ ఆఫీస్, ఆదిలాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన NIT Nos. 08 to 26, తేది: 11.06.2019కి సవరణ నం. 2, తేది: 06.07.2019. NIT Nos. 8,9,10,11,12 & 15 to 26/RO/2019-20, తేది: 11.06.2019 కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో టెండరు లభించు తేదీలు మార్పు చేయబడినవి మరియు లభించు తేదీలు: 10.07.2019 నుండి 25.07.2019. టెండరు చెల్లుబాటు టెండరు ప్రచురణ తేదీ నుండి (07) రోజులు ఉంటుంది. తదుపరి వివరాలను www.tender.telangana.gov.inలో ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నుండి పొందవచ్చును.

సం/- రీజినల్ ఆఫీసర్ (PR), రీజినల్ ఆఫీస్, ఆదిలాబాద్

DIPR RO. No. 618-DP/CL/Advt/1/2019-20, Dt: 12/07/2019

తెలంగాణ ప్రభుత్వం
(వైద్య & ఆరోగ్య శాఖ)

బహిరంగ వేలం అమ్మకం

Rc.No. S2/399/2019 తేది: 11.07.2019

MGM హాస్పిటల్, వరంగల్‌లో బహిరంగ వేలం టెండరు ద్వారా పాత ఇనుము, వుడ్ & ప్లాస్టిక్ వస్తువులు (చెత్త) వంటి వినియోగంలో లేని వస్తువులను కొనుగోలు చేయుటకు కాంట్రాక్టర్లు పిలువబడుచున్నారు. టెండరు నిబంధనతో సహా దరఖాస్తును వేలం రోజున సూపరింటెండెంట్ కార్యాలయం, MGM హాస్పిటల్, వరంగల్ నుండి పొందవచ్చును. సూపరింటెండెంట్, MGM హాస్పిటల్, వరంగల్‌లో లభించు వివరాలు: టెండరు దరఖాస్తు ఫారం ధర: రూ. 2,000/- (రెండు వేల రూపాయలు మాత్రమే) సూపరింటెండెంట్, MGM హాస్పిటల్, వరంగల్ పేరున DD ద్వారా (వాపసురానిది). టెండరు దరఖాస్తు ఫారం అమ్మకం: 23-07-2019న ఉ.11.00గం. నుండి మ.2.00గం.వరకు. బహిరంగ వేలం తేది: స్కూల్ ఆఫ్ నర్సింగ్, MGM హాస్పిటల్, వరంగల్ ఆవరణలో 23-07-2019న మ. 3.00గం.

సం/- సూపరింటెండెంట్, MGM హాస్పిటల్, వరంగల్

DIPR RO. No. 615-DP/CL/Advt/1/2019-20, Dt: 12/07/2019

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, పిల్లల, వికలాంగుల & వయోవృద్ధుల శాఖ, నిజామాబాద్

ప్రకటన

అర్జున్
జననం: 17-06-2019

ఇచ్చట ప్రచురించబడిన ఫోటోలోని బాబు జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, పిల్లల, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, నిజామాబాద్ పరిధి నందలి గల శిశు గృహ సుభాష్‌నగర్ వారి సంరక్షణలో ఉంచబడినారు. ఈ బాబుకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు ప్రచురణ తేది నుండి 30 రోజులలోగా తగిన సాక్ష్యాధారాలతో సహా దిగువ సంతకందారు గారిని సంప్రదించవచ్చును. లేని పక్షంలో ఈ బాబు అనాథగా ప్రకటించబడును మరియు ప్రభుత్వంచే నిర్దేశించబడిన నియమ నిబంధనల ప్రకారం దత్తతకు ఇవ్వబడును.

సం/- జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, పిల్లల, వికలాంగుల & వయోవృద్ధుల శాఖ, నిజామాబాద్

DIPR R.O.No. 623 DP/CL/Advt/1/2019-20 తేది: 12-07-2019

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల వలయము, నిజామాబాద్ జిల్లా

టెండరు ప్రకటన

టెండరు నోటీసు నెంబర్లు 01/2019-20 తేది: 08-07-2019, 02/2019-20 తేది: 08-07-2019, 03/2019-20 తేది: 08-07-2019, 04/2019-20 తేది: 08-07-2019, 05/2019-20 తేది: 08-07-2019, మరియు 06/2019-20 తేది: 08-07-2019 పనులకుగాను రూ. 1247.00 లక్షలకు లభ్యమగు తేది: 12-07-2019 నుండి 19-07-2019 వరకు టెండర్లు ఆహ్వానించడమైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.inలో చూడగలరు.

సం/- పర్యవేక్షక అభియంత,
సాగునీటి పారుదల వలయము, నిజామాబాద్ జిల్లా

DIPR RO.No. 245-PP/CL/ADVT/1/2019-20, Dt: 12-07-2019

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ

సంక్షిప్త టెండరు ప్రకటన

No.DB/TO/09/2018-19 తేది: 06-07-2019

పని పేరు: వనపర్తి టౌన్, మండలం, జిల్లా వద్ద PR గెస్ట్‌హౌస్‌కు మెయింటెనెన్స్. అంచనా వ్యయం: రూ. 7.00 (10/7.00) లక్షలు. దరఖాస్తు స్వీకరణకు ఆఖరి తేది: 16-07-2019, సా. 5.00గం.కు. టెండరు షెడ్యూళ్ళ జారీ: 18-07-2019, సా. 5.00గం.కు. టెండర్లు స్వీకరణ: 20-07-2019, మ. 3.00గం.కు. టెండర్లు తెరుచుట: 20-07-2019, మ. 3.30గం.కు. తదుపరి వివరాలను జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ PIU డివిజన్, వనపర్తి నుండి పొందవచ్చును.

సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్, PIU డివిజన్, వనపర్తి

DIPR RO. No. 616-DP/CL/Advt/1/2019-20, Dt: 12/07/2019

తెలంగాణ ప్రభుత్వము
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No. 79, 88, 89, 117, 76, 100 & 101/2018-19/4వ & 3వ పిలుపు తేది: 09-07-2019 ఉదయం 11.00 గంటలు. బోధన్ మునిసిపాలిటీలో సిసి కాలువ పనులు (07) నిర్మాణం చేపట్టుటకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం అంచనా వ్యయం: రూ. 98,88,237/-, బిడ్ దాఖలు ముగింపు తేది: (స్వీకరణలు): 15-07-2019న ఉదయం 11.30 గంటలకు. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in దర్శించండి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, PH, నిజామాబాద్

DIPR R.O.No. 619 DP/CL/Advt/1/2019-20 తేది: 12-07-2019

మహిళల ఆర్థికాభివృద్ధికి సింగరేణి తోడ్పాటు

-ప్రజాకవి జయరాజు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే దేశం మరింత ప్రగతి సాధిస్తుందని, దీనికోసం సింగరేణి సంస్థ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ప్రముఖ ప్రజాకవి, సింగరేణి ఉద్యోగి జీ జయరాజు అన్నారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సంస్థ (ఎన్ఐఎమ్మెస్ఎంఈ) ఆధ్వర్యంలో.. సింగరేణి ప్రాంత మహిళల కోసం ఐదురోజులుగా నిర్వహిస్తున్న ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కోల్‌బెల్ట్‌లోని మహిళలను ఆర్థికంగా అభివృద్ధిచేయాలనే లక్ష్యంతో సింగరేణి సేవా సమితి ద్వారా స్వయంఉపాధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిక్షణపొందిన మహిళలు వారివారి ఏరియాల్లో చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పి, ఇతర మహిళలకు ఆదర్శంగా నిలువాలని సింగరేణి సేవా సమితి కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ మహేశ్ సూచించారు. కార్యక్రమంలో ఎన్ఐఎంఎస్ఎంఈ ప్రోగ్రాం డైరెక్టర్ ఎన్ శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ జీ సుదర్శన్ సింగరేణి సేవాసమితి కో ఆర్డినేటింగ్ అధికారులు తుకారం, సీహెచ్ గంగాధర్, మారుతి, రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం జగదాంబతండాలో ఎడ్లకు బదులు కొడుకుల సాయంతో పత్తిలో గుంటుక కొడుతున్న రైతు కోల అంబర్‌సింగ్. తనకున్న ఎకరం భూమిలో పత్తి సాగు చేయగా, ప్రస్తుతం కలుపు తీస్తున్నారు. తనకు ఎడ్లు లేక, ఇతరుల నుంచి వాటిని అద్దెకు తీసుకవచ్చి పెట్టుబడి భారం మోయలేక అంబర్ సింగ్ తన కొడుకుల సాయంతో ఇలా 'సాగు'తున్నాడు. -గంభీరావుపేట

అది అక్రమ నిర్బంధం కాదు!

పిటిషన్‌ను కొట్టేసిన ధర్మాసనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహబూబాబాద్ జిల్లా వెంకటాపురం గ్రామపంచాయతీలోని మిర్యాలపెంటకు చెందిన గిరిజనులది అక్రమ నిర్బంధం కాదని హైకోర్టు స్పష్టంచేసింది. మిర్యాలపెంట గిరిజనులను నిర్బంధించారని గురువారం పిటిషన్ దాఖలు కావడంతో సదరు గిరిజనులను కోర్టులో ప్రవేశపెట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీంతో అధికారులు వారిని హైకోర్టుకు తీసుకొచ్చారు. వారితో నేరుగా మాట్లాడిన న్యాయమూర్తి 'మిమ్మల్ని ఎవరైనా నిర్బంధించారా?' అని ప్రశ్నించారు. తాము గ్రామంలోనే ఉన్నామని, తమను అడవుల్లోకి వెళ్లనివ్వడం లేదని చెప్పగా.. అది నిర్బంధం కిందికి రాదని చెప్పిన ధర్మాసనం విచారణను ముగించింది.

శుక్రవారం హైదరాబాద్‌లో ఇంధన ప్రచారవాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న విద్యుత్‌శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌మిశ్రా. చిత్రంలో సినీనటి అమల ఉన్నారు.

సబ్సిడీ ఉపకరణాలతో విద్యుత్ ఆదా

- ప్రచార వాహనాన్ని ప్రారంభించిన విద్యుత్‌శాఖ స్పెషల్ సీఎస్
- 8.4 మిలియన్ యూనిట్ల వినియోగం తగ్గించడమే లక్ష్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్కో) పరిధిలో అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాలద్వారా గణనీయంగా విద్యుత్ వాడకాన్ని తగ్గించేందుకు కృషిచేస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా, టీఎస్ రెడ్కో వీసీఎండీ జానయ్య తెలిపారు. 2019-20లో ఎల్ఈడీ బల్బులు, బీఎల్డీసీ ఫ్యాన్ల అమ్మకంతో సుమారు 8.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకాన్ని తగ్గించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. శుక్రవారం జాతీయ ఇంధనసదస్సు సందర్భంగా హోటల్ మారియట్‌లో ఇంధన ప్రచారవాహనాన్ని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించడమే ప్రధానలక్ష్యంగా తెచ్చిన ఇంధన సంరక్షణ చట్టం అమలుకు రాష్ట్రంలో టీఎస్‌రెడ్కోను స్టేట్ నోడల్ ఏజన్సీగా నియమించినట్టు వారు తెలిపారు. ఇంధన సంరక్షణకు ప్రజల్లో చైతన్య, అవగాహన కార్యక్రమాలను టీఎస్‌రెడ్కో చేపడుతున్నదని, తక్కువ ధరల్లో విద్యుత్ పరికరాలను వినియోగదారులకు లభించేలా చేస్తుందని చెప్పారు. దీనివల్ల మార్కెట్లలో విద్యుత్ ఉపకరణాల ధరలు కూడా తగ్గుముఖం పడుతాయన్నారు. టీఎస్ రెడ్కో ఆధ్వర్యంలో 9వాట్ల ఎల్ఈడీ బల్బును ప్రజలు పెద్దఎత్తున కొనుగోలుచేసేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ బల్బు ధర మార్కెట్లో రూ.130 ఉంటే.. రెడ్కో రూ.65కే విక్రయిస్తుందని చెప్పారు. మార్కెట్లో రూ.450కి లభించే 20వాట్ల ఎల్ఈడీ ట్యూబును రూ.300కు, రూ.4040కి లభించే బీఎల్డీసీ ఫ్యానును రూ.2825కే ఇస్తున్నట్టు తెలిపారు. 2019-20లో 20వేల బీఎల్డీసీ ఫ్యాన్లు, 40వేల ఎల్ఈడీ బల్బుల విక్రయం లక్ష్యంగా నిర్ణయించుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో మొరాకో అంబాసిడర్ ఎండీ మలికి, ప్రముఖ సినీనటి అమల అక్కినేని పాల్గొన్నారు.

రవిప్రకాశ్‌కు బెయిల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌కు హైకోర్టు పలు షరతులతో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు జస్టిస్ గండికోట శ్రీదేవి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం.. ఉత్తర్వులు వెలువడిన 10 రోజుల్లో సంబంధిత మేజిస్ట్రేట్ ఎదుట సరెండర్ కావాలని పేర్కొన్నది. రూ.5 లక్షల చొప్పున రెండు పూచీకత్తులతోపాటు వ్యక్తిగత బాండ్ సమర్పించాలని తెలిపింది. రోజువిడిచి రోజు సంబంధిత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య హాజరుకావాలని స్పష్టంచేసింది. దీంతోపాటు కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, ఈ మేరకు పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని ఆదేశాలు జారీచేసింది. నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి పోలీసులు చేపట్టే విచారణలో ఏవిధంగానూ జోక్యం చేసుకోరాదని రవిప్రకాశ్‌ను ఆదేశించింది. ఫోర్జరీ, నిధుల మళ్లింపు తదితర ఆరోపణలపై అలందా ఫిర్యాదు మేరకు రవిప్రకాశ్‌పై మూడు వేర్వేరు కేసులు నమోదయిన సంగతి తెలిసిందే. దీనిపై ఆయన దిగువ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా తిరస్కరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా ఆయనకు ఎదురుదెబ్బ తగలడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరైన రవిప్రకాశ్.. ముందస్తు బెయిల్ కోసం మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. రవిప్రకాశ్ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది దిల్జీత్‌సింగ్ అహ్లువాలియా, పోలీసుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది హరీన్ రావల్ వాదనలు వినిపించారు. ధర్మాసనం తీర్పును గత నెలలో రిజర్వు చేసి, శుక్రవారం వెలువరిస్తూ షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

గెస్ట్ లెక్చరర్లను కొనసాగించండి

మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంటర్మీడియట్ కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు హైకోర్టులో ఊరట లభించింది. 2019-20కు చేపట్టిన నూతన నియామక ప్రక్రియను నిలిపేయాలని, ప్రస్తుతం కొనసాగుతున్న అధ్యాపకులను కొనసాగించాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్‌కు హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. నూతన నియామక ప్రక్రియను వ్యతిరేకిస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు.. విధుల్లో ఉన్న తాత్కాలిక ఉద్యోగుల స్థానంలో మళ్లీ తాత్కాలిక ఉద్యోగులనే భర్తీ చేయరాదని, శాశ్వత ఉద్యోగులను నియమించేవరకు వారినే కొనసాగించాలని పిటిషనర్ల తరపు న్యాయవాది అర్జున్‌కుమార్ వాదించారు. వాదనలను నమోదుచేసుకున్న ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

స్థితిగతులను బట్టి కులాల మార్పు

నిజామాబాద్ జిల్లా తగ్గెల్లిలో కుల్లెకడిగి కులస్థులతో మాట్లాడి వారి స్థితిగతులను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు

వరంగల్ రూరల్ జిల్లా అద్దపు కులస్థుల కాలనీలో వారి సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బేతంపూడిలో 'రామజోగు' కులస్తుల వృత్తిని పరిశీలించి, వివరాలు తెలుసుకుంటున్న బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్

ఆదిలాబాద్ మండలంలోని బంగారుగూడలో ఓడ్ కులస్తులతో మాట్లాడుతున్న బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఆంజనేయగౌడ్

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు
- బీసీ కమిషన్ విచారణ పూర్తి.. త్వరలో సర్కార్‌కు నివేదిక

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తమను బీసీ కులంలోకి మార్చాల్సిందిగా కోరిన ప్రజల జీవన స్థితిగతులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు అన్నారు. ఈ నివేదికల ఆధారంగా ప్రభుత్వం పరిశీలించి వారిని ఏ కులంలో చేర్చాలో నిర్ణయం తీసుకుంటుందని, ఆగస్టు చివరినాటికి ఈ ప్రక్రియ పూర్తికావచ్చని తెలిపారు. వెనుకబడిన తమను బీసీ కులాల జాబితాలో చేర్చాలని అభ్యర్థించిన సంచారజాతుల కుటుంబాల జీవనస్థితిగతులపై రాష్ట్ర బీసీ కమిషన్ చేపట్టిన క్షేత్రస్థాయి విచారణ శుక్రవారం ముగిసింది. మూడోజుల షెడ్యూల్ ప్రకారం బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఈ ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్ ఆయా ప్రాంతాల్లో సంచార జాతుల కుటుంబాలను కలిసి వివరాలను సేకరించారు. బీఎస్ రాములు నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం తగ్గెల్లి, పెంటాకుర్దు, వర్ని మండలం జాకోర గ్రామాల్లో పర్యటించి కుల్లకడిగి కులస్థుల స్థితిగతులపై వివరాలు సేకరించారు. రాష్ట్రంలో 70 కులాలకు చెందిన ప్రజల జీవన స్థితిగతులు ఎలా ఉన్నాయో పరిశీలించడానికి చర్యలు తీసుకుంటున్నామని, సుమారు ఇరవై కులాల నుంచి విజ్ఞప్తులు అందాయని చెప్పారు. రాష్ట్రంలో 600 జనాభా మాత్రమే ఉన్న 'రామజోగు' కులస్థుల జీవన విధానంపై అధ్యయనం చేస్తున్నట్టు బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో పర్యటించిన ఆయన.. రోడ్ల పక్కన వ్యవసాయ పనిముట్లు చేస్తూ సంచార జీవనం సాగిస్తున్న బైలుకమ్మరుల స్థితిగతులను కూడా తెలుసుకుంటున్నట్టు చెప్పారు. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్.. రజకుల ఉపకులం పంటంవాసీయులు, నాయీబ్రాహ్మణుల ఉపకులం అద్దెపువారి కుటుంబాల స్థితిగతులు, వారి జీవన విధానాన్ని ఆయన పరిశీలించారు. వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలంలోని పెర్కవేడు గ్రామంలో అద్దపు కులస్థుల జీవన స్థితిగతులను అధ్యయనం చేశారు. బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఆంజనేయగౌడ్ ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కేఆర్‌కే కాలనీ, ఆదిలాబాద్ మండలం బంగారుగూడలో నివసిస్తున్న ఓడ్ కులస్థుల ఇండ్లకు వెళ్లి వివరాలు సేకరించారు.

ప్రతి వర్షపు చుక్కముఖ్యమే

- స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్ వీకే జిందాల్
- రంగారెడ్డి కలెక్టరేట్‌లో జల్‌శక్తి అభియాన్‌పై సమావేశం

రంగారెడ్డి కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ జిందాల్

రంగారెడ్డి జిల్లా, నమస్తే తెలంగాణ: ప్రతి వర్షపు చుక్కను కాపాడుకోవాలని స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్ వీకే జిందాల్ సూచించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోజల్‌శక్తి అభియాన్ పథకం కార్యక్రమంపై జిల్లా గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ, మెట్రో వాటర్‌వర్క్స్, భూగర్భ జలవనరులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, వ్యవసాయం, ఉద్యాన వన, జిల్లా పంచాయతీ, జీహెచ్ఎంసీ, కృషి విజ్ఞాన తదితరశాఖలతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో నాలుగురోజులపాటు కేంద్రం బృంద పర్యటనకు ముందు అధికారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీకే జిందాల్ మాట్లాడుతూ.. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భూగర్భజలాలు కాపాడుకునేందుకు ప్రతివర్షపు చుక్కను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. జల్‌శక్తి అభియాన్ పథకంలో ఎంపికచేసిన ఆమనగల్లు, కొందుర్గు, కొత్తూరు, యెనుగన్నూరు, శంషాబాద్, తలకొండపల్లి, రాజేంద్రనగర్, సరూర్‌నగర్ మండలాల్లో ఇంటింటికీ ఇంకుడు గుంతలు, బోర్ల రీచార్జ్, చెరువులు, బావుల్లో పూడికతీత, కందకాల తవ్వకం, చెక్‌డ్యాంల నిర్మాణం, మొక్కలు నాటడం వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భూగర్భ జలవనరులను కాపాడేందుకు ప్రతిఒక్కరిలో అవగాహన తీసుకురావాలన్నారు. భవిష్యత్‌లో వచ్చే నీటి సమస్యలను అధిగమించేందుకు కేంద్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని, ఇందుకోసం జూలై 1న జల్‌శక్తి అభియాన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. వివిధశాఖల సమన్వయంతో నీటి వనరులను వినియోగం, కాపాడుకోవడంలో రంగారెడ్డి జిల్లా తెలంగాణలోనే మొదటి స్థానంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ లోకేశ్‌కుమార్, డీఆర్డీఏ పీడీ ప్రశాంత్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ అన్నం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్సీ పదవికి, తెలుగుదేశం పార్టీకి ఇటీవల రాజీనామాచేసిన సీనియర్ నాయకుడు అన్నం సతీశ్‌ప్రభాకర్ శుక్రవారం ఢిల్లీలో బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో ఆ పార్టీలో చేరారు. గుంటూరు జిల్లాలో సీనియర్ నేతగా పేరొందిన సతీశ్.. 2014, 2019 ఎన్నికల్లో బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి.. వైఎస్సార్సీపీ అభ్యర్థి కోన రఘుపతి చేతిలో ఓడిపోయారు.

కేంద్ర ఆర్థిక మంత్రివి అబద్ధాలు

- సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్‌కుమార్ అంజాన్ విమర్శ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్‌కుమార్ అంజాన్ విమర్శించారు. బడ్జెట్ ప్రసంగంలో భారత ఆర్థికవ్యవస్థ ఎన్డీయే ప్రభుత్వ చర్యల వల్ల మెరుగుపడిందని చెప్పుకోవడం.. దేశంలో రైతుల ఆత్మహత్యలు లేవని పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. శుక్రవారం హైదరాబాద్ మగ్దూంభవన్‌లో నిర్వహించిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకాన్ని విస్మరించారని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్‌పై రూ.రెండున్నర పెంచడం ద్వారా నిత్యావసరాల ధరల పెరుగుదలకు బాటలు వేశారని.. ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్‌చేశారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని బీజేపీ, ఎంఐఎం ప్రయత్నిస్తున్నాయన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి, కేంద్ర కార్యవర్గ సభ్యుడు ఆజీజ్‌పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు దయతో ప్రవర్తించాలి

- ఆధునిక పరిజ్ఞానంతో మెరుగైన వైద్యం
- రామానుజ చినజీయర్ స్వామి

హైదరాబాద్‌లో స్పైన్ ఎండోస్కోపి టెక్నాలజీపై అంతర్జాతీయ సదస్సును జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న చినజీయర్‌స్వామి. చిత్రంలో యశోద గ్రూప్ హాస్పిటల్స్ ఎండీ జీఎస్ రావు ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్యరంగంలో ఆధునిక పరిజ్ఞానం వల్ల రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, రోగుల పట్ల వైద్యులు దయతో వ్యవహరించాలని ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. అత్యాధునిక ఎండోస్కోపిక్ వెన్నెముక శస్త్రచికిత్స, స్పైన్ ఎండోస్కోపి టెక్నాలజీపై శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సును చినజీయర్‌స్వామి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెన్నెముక సమస్యతో ఇబ్బందిపడుతున్నవారికి స్పైన్ఎండోస్కోపి వరమని పేర్కొన్నారు. ఇటువంటి ఆధునిక వైద్య సేవలను ప్రభుత్వ దవాఖానల్లో కూడా విస్తరించాలని ఆకాంక్షించారు. మనుషులను సృష్టించిన దేవుడే.. వ్యాధులను నియంత్రించి, ప్రాణాలు కాపాడేందుకు కొందరిని వైద్యులుగా సృష్టించాడని చెప్పారు. మనిషి ప్రాణాలు కాపాడే వైద్యుడిని ప్రతిఒక్కరూ దైవంతో సమానంగా చూస్తారని, వారు తమ బాధ్యతను గుర్తించి పనిచేయాలని ఉద్బోధించారు. సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, ఈర్ష్య, ద్వేషం, మానసిక ఒత్తిడి వంటి కారణాలతో అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. ఉపనిషత్తుల ఆధారంగా మనిషి శరీరంలోని ముఖ్య నాడులు, వాటి విధులను ఆయన వివరించారు. సమావేశంలో ఇండోనేషియాకు చెందిన వైద్య నిపుణుడు బాంబాంగ్ డార్వోనో, యూఎస్ఏ స్పైన్ ఎండోస్కోపి వైద్య నిపుణుడు సయ్యద్ జీ ఉస్మాన్ మాట్లాడుతూ.. స్పైన్ ఎండోస్కోపీ విధానంలో వెన్నుచుట్టూ ఉన్న కండరాలకు ఎటువంటి నష్టం జరుగకుండా.. చిన్నగాటు ద్వారానే శస్త్రచికిత్స చేయగలుగుతున్నామని పేర్కొన్నారు. వెన్నులో సమస్యకు కారణమవుతున్న భాగాన్ని సర్జన్ స్పష్టంగా చూసేందుకు ఈ విధానంలో అవకాశం ఉన్నదన్నారు. రోగికి తక్కువ రక్తం నష్టమవుతుందని, వేగంగా కోలుకోగలుగుతారని, అదనపు ప్రయోజనాలు కూడా ఉంటాయని వివరించారు. సమావేశంలో యశోద గ్రూప్ హాస్పిటల్స్ ఎండీ జీఎస్ రావు, వైద్యులు సుకుమార్ సూర, మహేషాకాంతిలా, తైవాన్ వైద్యుడు జియావో చియావో యాంగ్ పాల్గొన్నారు.

జనరంజకంగా జగన్ బడ్జెట్!

సంక్షేమానికి, వ్యవసాయానికి పెద్ద పీట

రూ.2,27,974.99 కోట్లతో ఏపీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి

రెవెన్యూ వ్యయం రూ.1,80,475.94 కోట్లు

మూలధన వ్యయం రూ.32,293.39 కోట్లు ద్రవ్యలోటు రూ.35,260 కోట్లు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి. చిత్రంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా, అర్హులందరికీ సంక్షేమం అందేలా, అన్నదాతకు పెద్దపీట వేస్తూ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను శాసనసభలో శుక్రవారం ప్రవేశపెట్టారు. రాష్ట్ర జనాభాలో 60% పైగా ఉన్న రైతులు, వ్యవసాయ సంబంధిత కుటుంబాలకు ఆర్థికమంత్రి బడ్జెట్‌లో పెద్దపీటవేశారు. అన్నదాతకు అండ, చదువులకు అమ్మ ఒడి, యువతకు చేయూత, గ్రామాలకు సచివాలయాలు, వైద్యానికి ఆరోగ్యశ్రీ, పరిశ్రమలకు ప్రాధాన్యం, అర్హులందరికీ పింఛన్, దశలవారీగా మద్యపాన నిషేధం, అందరికీ గృహవసతి, కల్యాణానికి కానుకలు.. ఇలా మెరుగైన పాలన అందిస్తామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీని మంత్రి బుగ్గన బడ్జెట్ ద్వారా నెరవేర్చారు. మొత్తం రూ.2,27,974.99 కోట్లతో బడ్జెట్‌కు రూపకల్పనచేశారు. రెవెన్యూ వ్యయం రూ.1,80,475.94 కోట్లు, మూలధన వ్యయం రూ.32,293.39 కోట్లుగా పేర్కొన్నారు. వడ్డీ చెల్లింపుల కోసం రూ.8,994 కోట్లు కేటాయించారు. రెవెన్యూ లోటు రూ.1,778.52 కోట్లు, ద్రవ్యలోటు సుమారు రూ.35,260 కోట్లు ఉన్నాయని, జీఎస్డీపీలో ద్రవ్యలోటు సుమారు 3.3% ఉన్నదని బుగ్గన వివరించారు. సంక్షేమ రంగానికి రూ.14,412 కోట్లు కేటాయించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కాంపోనెంట్ కింద రూ.15,000 కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్ కాంపోనెంట్ కింద రూ.4988.52కోట్లు, బీసీ సబ్ ప్లాన్ కాంపోనెంట్ కింద రూ. 15,061.64కోట్లు కేటాయించారు.

అన్నదాతకు అండ

అన్నదాతకు ఏపీ ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలిచింది. వైఎస్ రైతు భరోసాకు రూ.8750 కోట్లు కేటాయిస్తూ.. 15లక్షల మంది కౌలు రైతులకు మేలుచేసేలా నిర్ణయాలు తీసుకున్నది. వైఎస్సార్ బీమాయోజన కింద రైతుల పంటల బీమా కోసం కట్టే ప్రీమియంకు రూ.1163 కోట్లు, ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీకింద రూ.475 కోట్లు కేటాయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామ వాలంటీర్ల ఎంపిక ప్రక్రియ పూర్తిచేయడంతోపాటు బడ్జెట్‌లో రూ.720 కోట్లు కేటాయించారు. వార్షికాదాయం రూ.5లక్షలలోపు ఉన్న ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని మంత్రి బుగ్గన చెప్పారు. రూ.28వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను శుక్రవారం ఏపీ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రవేశపెట్టారు. పులివెందులలో అరటి పరిశోధనకేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

'వాకాటక మహాదేవి' అద్భుతం

బీఎన్ శాస్త్రి నవలపై చరిత్ర పరిశోధకులు శ్రీరామోజు హరగోపాల్

రవీంద్రభారతిలో 'వాకాటక మహాదేవి' నవలపై ప్రసంగిస్తున్న చరిత్ర పరిశోధకుడు శ్రీరామోజు హరగోపాల్. చిత్రంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి ఉన్నారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: చారిత్రక నేపథ్యానికి సామాజికపరమైన కల్పనలను జోడించి బీఎన్ శాస్త్రి 'వాకాటక మహాదేవి' అనే నవలను అద్భుతంగా రచించారని చరిత్ర పరిశోధకుడు శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించిన నవలా స్రవంతి కార్యక్రమంలో 'వాకాటక మహాదేవి' నవలపై ఆయన ప్రసంగించారు. తెలంగాణను విష్ణుకుండినులు దాదాపు 300 ఏండ్లు పాలించారని, రాజేంద్రవర్మ అనే రాజుతో అచ్చంపేట- అమ్రాబాద్ (అమరపురి- అమరావతి అప్పట్లో)లో పాలన మొదలైందని, గుంటూరు అమరావతిలో మంతెన భట్టారకుడు అనేరాజుతో విష్ణుకుండినుల రాజ్యం అంతమైందని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం/ ఇంద్రపురిలో రాజులు గోవిందవర్మ, విక్రమేంద్రవర్మ వేయించిన తామ్ర శాసనాలు లభించాయని, వాటిద్వారా ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. 'గోవిందవర్మ కుమారుడు రెండో మాధవవర్మ

నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 13 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

తండ్రి కోసం ఇష్టం లేని ఇంజినీరింగ్ చదువు.. తన కోసం ఇష్టమైన హస్తకళలు, డిజైనింగ్.. ఎవరి మనసూ నొప్పించలేదు..ఒకవైపు చదువు, మరోవైపు ఉద్యోగం, కోర్సులు.. పెండ్లికి ముందే తానేంటో నిరూపించుకున్నది..నచ్చిన పనిని 'గ్లామప్ ఇనిస్టిట్యూట్' పేరుతో మొదలెట్టింది. నలుగురికి పని నేర్పించే స్థాయికి ఎదిగింది. భవిష్యత్తులో మూడు ప్రాజెక్టులు చేయాలని సంకల్పించుకున్న జుజ్జవరపు హారిక పరిచయం ఇది.

గ్లామప్‌తో అందమైన హారాలు

తండ్రి ఆమెను ఇంజినీర్‌గా చూడాలనుకున్నారు. ఆమెకు మాత్రం డిజైనింగ్, పెయింటింగ్, మోడలింగ్ చేయాలని కోరిక. పదో తరగతి నుంచి ఇంజినీరింగ్ వరకు ఇదే గొడవ తండ్రికూతురికి. తండ్రికోసం ఇంజినీరింగ్ చదివింది. కానీ, ఇంజినీర్ కాలేకపోయింది. ఒకరికోసం కాకుండా తనకోసం బతకాలనుకున్నది. తల్లి ప్రోత్సాహం ఎప్పుడూ ఉండేది. తల్లిదండ్రుల కోసం నచ్చని పని చేసి కెరీర్ పాడుచేసుకోవడం కంటే మనసుకు నచ్చిన పనిచేసి నలుగురికి పని చూపించే మార్గం వైపు అడుగులు వేస్తే అందులో ఉన్న కిక్కే వేరు అంటున్నది హారిక.

చాలామంది మహిళలు ఇంట్లో ఖాళీగా ఉండడానికి ఇష్టపడరు. ఏదొక చిన్న పని చేసుకుంటూ ఇంటిని నడపాలి అనుకుంటారు. మరి వారికి ఎవరు పనినేర్పిస్తారు. అలాంటి గృహిణులకు 'గ్లామప్ ఇనిస్టిట్యూట్' వేదికగా మారింది. మూడేండ్ల క్రితం ఇనిస్టిట్యూట్‌ను మొదలుపెట్టిన హారిక పెయింటింగ్, కుట్టుమిషన్, బేకింగ్, బ్యూటీషియన్, జ్యూయలరీ డిజైనింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్.. ఇలాంటి పనులు నేర్పిస్తూ వారికి అండగా నిలబడింది. ఈ మూడేండ్లలో చాలామంది శిక్షణ తీసుకున్నారు. శిక్షణ తీసుకునే వారికి అనుగుణంగా టైమింగ్ ఉంటుంది. ఈ టైంకే రావాలి లేదంటే కుదరదు అన్న నిబంధనలు ఏవీ లేవు. ఈ ఇనిస్టిట్యూట్‌లో మహిళలకు మాత్రమే కాకుండా అందరికీ నేర్పిస్తున్నది హారిక. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇనిస్టిట్యూట్ ఉంటుంది. ఒకసారి ట్రైనింగ్‌లో చేరిన వారికి పూర్తిగా నేర్పే వరకు పూర్తి బాధ్యత ఆమెదే. కోర్స్‌ని బట్టి 3000 నుంచి 40,000 వరకు ఫీజు ఉంటుంది. అన్ని ఇనిస్టిట్యూట్స్‌లా కాకుండా నేర్చుకునే వారికి అనుగుణంగా ఉండడమే 'గ్లామప్' ప్రత్యేకత. కోర్సు పూర్తయిన తర్వాత సెలబ్రిటీల చేతుల మీదుగా వారికి సర్టిఫికేట్స్ అందజేస్తున్నది.

భర్త సహకారంతో..

డిజైనింగ్ ఆఫర్లు..

హారిక చదువు తర్వాత ఉద్యోగం చేస్తూనే 2009లో ఫ్యాషన్ డిజైనింగ్ చేసింది. ఆ తర్వాత చందనా బ్రదర్స్, ఆర్‌ఎస్ బ్రదర్స్‌లో శారీ యాడ్స్ చేసింది. దీంతో డిజైనింగ్ మీద ఇష్టం పెరిగింది. ఒక్కో యాడ్ చేసుకుంటూ వైజాగ్‌లో కొన్ని షోలు చేసింది. ఉద్యోగం చేస్తూ సాయంత్రం ఈవెంట్ మేనేజర్లను కలుస్తూ డిజైనింగ్ ఫీల్డ్‌లో చోటు సంపాదించుకున్నది. వీటితో పాటు జ్యూయలరీ డిజైనింగ్, పెయింటింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్ అన్ని కోర్సులు వైజాగ్‌లో చేసింది. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చింది. ఇక్కడికి వచ్చిన తర్వాత కూడా డిజైనింగ్, యాడ్స్ చేసింది. హారిక గుక్కతిప్పకుండా మాట్లాడగలదు. దీంతో యాంకర్‌గా కూడా ఆఫర్లు వచ్చాయి. అయినా డిజైనింగ్ ఇష్టం ఉండడంతో ఇందులోనే స్థిరపడింది. కొన్ని తెలుగు సినిమాలకు డ్రెస్‌లు డిజైన్ చేసింది. ఆ తర్వాత 2011లో 'స్టార్ క్రికెట్ లీగ్'కు 50 స్పోర్ట్స్ డ్రెస్ డిజైన్ చేయమని హారికకు ఆఫర్ వచ్చింది. సినిమాలకు చేయడం వేరు, ఇంత మంది ఆర్టిస్ట్‌లకు ఒకేసారి డిజైన్ చేయడం వేరు. ఇది మంచి ఆఫర్‌తో పాటు బాధ్యత గల ప్రాజెక్ట్ అనుకుంది. ఈ ప్రాజెక్ట్ రావడానికి కారణం ఆర్టిస్ట్ లోహిత్ కుమార్. అతని ప్రోత్సాహంతోనే ఆమె పని తనాన్ని నిరూపించుకున్నది. స్టార్ క్రికెట్ లీగ్‌కు అనుకున్న సమయానికి డ్రెస్‌లు అందజేసి అందరితో శభాష్ అనిపించుకున్నది హారిక. అప్పటి నుంచి డిజైనింగ్‌లో చాలా అవకాశాలు వచ్చాయి.

బాధ్యత తెలిసింది..

హారిక తండ్రి సొంతూరు రాజమండ్రి అయినా కుటుంబం వరంగల్‌లో స్థిరపడింది. తండ్రి లారీ ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ చేస్తుంటాడు. తల్లి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం. చిన్నప్పటి నుండి తనకు రాని పని ఏది చూసినా దాన్ని నేర్చుకునేవరకు వదిలేది కాదు. అప్పట్లో పల్లెల్లో చీరలకు పెయింటింగ్, కుట్లు అల్లికలు ఎక్కువగా చేసేవారు. అది ఒకరిని చూసి మరొకరికి ఊరంతా పాకింది. అందరూ చేస్తుండేసరికి హారికకూ నేర్చుకోవాలన్న తపన మొదలైంది. వారికి తెలియకుండా వారు చేస్తున్న పనిని పనిగట్టి నేర్చుకున్నది. ఇంకేముంది ఉదయం నిద్ర లేచింది మొదలు మధ్యాహ్నం, రాత్రి భోజనం మినహా చీరలకు అల్లికలు వేస్తూనే ఉండేది. అలా వారంలో ఒక చీరకి డిజైన్ పూర్తి చేసి అందరినీ ఆశ్చర్యపరిచేది. ఎప్పటినుంచో అల్లికల్లో ఆరితేరిన వారి కంటే హారిక చేతిపని చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. తల్లి చీరకు పెద్ద నెమళ్లు ఉండే పెయింటింగ్ వేసింది. హారిక తల్లి సహఉద్యోగులకు ఆ చీర బాగా నచ్చింది. వారు కూడా హారికతో అలాంటి పెయింటింగ్ వేయించుకున్నారు. అలా పదో తరగతి చదువుతున్నప్పుడే హారిక 30,000 సంపాదించింది. సరదాగా నేర్చుకున్న హస్తకళ ఆమెను వెంటాడుతూనే ఉండేది. తండ్రి కోరిక మేరకు హారిక ఇంజినీరింగ్‌లో చేరక తప్పలేదు. రెండో యేడాది కొన్ని పరిస్థితుల కారణంగా హారిక కుటుంబానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆమె ఖర్చులకు ఏటీఎం సెంటర్లో క్రెడిట్‌కార్డ్ సేల్స్‌గర్ల్‌గా 5 వేల జీతానికి చేరింది. అనుభవం లేకపోయినా చాలా బాగా సేల్ చేస్తుందని యాజమాన్యం అమెను మెచ్చుకున్నారు. ప్రమోషన్స్ రావడంతో ఉద్యోగంపై ఆసక్తి పెరిగింది. ఈ బిజినెస్ స్కిల్స్ హారికకు తండ్రి నుంచి అబ్బినయి. ఉద్యోగం చేస్తూనే ఇంజినీరింగ్ చేసింది. కాలేజ్ ప్లేస్‌మెంట్స్‌లో సత్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. కొన్నిరోజులు చేసింది. నచ్చలేదు. వదిలేసింది. ఎవరి సాయం లేకుండా పైకి రావాలనుకున్నది. సక్సెస్‌కు కారణం ఆమే కావాలనుకున్నది. ఫ్యాషన్ డిజైనింగ్ చేయాలంటే చాలా డబ్బు ఖర్చవుతుంది.అప్పటికే గుర్తింపు పొందిన అనూస్ సిస్టర్స్‌ను కలిసింది. కౌన్సెలర్‌గా ఉద్యోగంలో చేరింది. చేరిన రోజే ఫస్ట్ కస్టమర్‌తో పెద్ద అమౌంట్ కట్టించింది. అమె కమిట్‌మెంట్‌కు అనూస్ సిస్టర్స్ ఆమెకు ఉచితంగా ఎంఎస్ కాస్ట్యుమాలజీ నేర్పిస్తామన్నారు. నాలుగేండ్లు అనూస్‌లోనే పనిచేసింది. ఆ తర్వాత వైబ్స్, వి కేర్, విఎల్‌సిసి ఇలా టాప్ కంపెనీలన్నింటిలో పనిచేసింది.

GLAMUP — Training Institute —

అడ్రస్ : శ్రీ కల్కి చాంబర్, పుల్లారెడ్డి స్వీట్‌షాప్ ఎదురుగా, ఆల్విన్ క్రాస్ రోడ్, హైదరాబాద్.

పెండ్లి, పిల్లలు హారిక కెరీర్‌కు అడ్డుకాకూడదు అనుకున్నది. నేర్చుకున్న కోర్సులు ప్రతీకగా భర్త శ్రీనివాసన్ సహకారంతో ఇనిస్టిట్యూట్ పెట్టి అన్ని బాధ్యతలు సవ్యంగా నిర్వర్తిస్తున్నది. ఇనిస్టిట్యూట్, డిజైనింగ్ ఇంతటితో ఆగకుండా మరింత ముందుకు నడువాలనుకున్నది. భవిష్యత్తులో చేయాల్సిన పనులేంటో రాసుకున్నది. అవి మూడున్నాయి. ఒకటి.. ఓల్డేజ్ హోమ్, పేద ప్రజలకు సహాయం, హిజ్రాలకు హస్తకళలు నేర్పించడం. ఓల్డేజ్ హోమ్‌లో ఉన్న వారు ఖాళీగా కూర్చోవడం వల్ల పిచ్చి ఆలోచనలతో మానసికంగా బాధపడుతుంటారు. వీరితో ఏదైనా యాక్టివిటీ చేపిస్తే కొంచెం ఉత్సాహంగా ఉంటారు. వారికీ కొన్ని పనులు నేర్పిస్తే అవి చేసుకుంటూ ఖర్చులకు డబ్బు సంపాదించుకుంటూనే పనిలో మునిగిపోతారు. ఎలాంటి ఆలోచనలు దరిచేరవు. వీరందరికీ ఉచితంగా కుట్టుమిషన్, పెయింటింగ్ ఇలా వారి ఆసక్తిని బట్టి నేర్పించాలనే ఆలోచనలో ఉన్నది హారిక. దీంతో పాటు హిజ్రాలకు నేర్పించాలనుకుంది. వీరిపై సర్వే మొదలుపెట్టింది. వీరికి ఎవరూ పని ఇవ్వకపోవడమే కాకుండా, పనిచేసుకొని బతకొచ్చు కదా అంటారు. వారి పనులు వారు చేసుకునేలా స్టిచ్చింగ్, బ్యూటీషియన్, బేకింగ్ పనులు నేర్పించడానికి సిద్ధంగా ఉన్నది. చర్చ్ నుంచి ఒక ఆవిడ వచ్చి హిజ్రాలకు శిక్షణ ఇవ్వమని హారికను కోరింది. అందుకు అంగీకారం తెలిపింది. కానీ వారందరినీ ఒకచోట చేర్చగలిగితే నేను రెడీ అంటున్నది.

...వనజ వనిపెంట
చిన్న యాదగిరి గౌడ్

అభాగ్యుల జీవితాల్లో వెలుగుదివ్వె

చదువుకోవాలన్న ఆశ, చిన్నవయసులోనే పెళ్లి, ఆ తర్వాత వితంతువుగా ఆమె పడిన కష్టాలు, ఒడుదొడుకులకు ఏమాత్రం కుంగిపోలేదు. విధికి ఎదురీది పిల్లలను చదివించుకోవడంతో పాటు ఆమె కూడా చదువుకొని ఎందరో వితంతువులకు బాసటగా నిలుస్తున్నది.

కేరళకు చెందిన సఫియా హనీఫ్‌కు 16 యేండ్లకే పెండ్లి చేశారు. భర్త ఉద్యోగ రీత్యా కుటుంబం బెంగళూరులో స్థిరపడింది. మూడేండ్లలో సఫియా ఇద్దరు మగపిల్లలకు జన్మనిచ్చింది. వీరు పుట్టిన కొన్నిరోజుల తర్వాత ఆమె భర్త మరణించాడు. ఒక్కతే పిల్లలని చూసుకోవడం కష్టమవ్వడంతో పుట్టింటికి చేరింది సఫియా. చదువుకుంటానని తల్లిదండ్రులను అడిగింది. వితంతువు చదువుకుంటే అందరూ నవ్వుతారని వాళ్లు వద్దన్నారు. దీంతో సఫియా పుట్టింటిని వదిలి మరలా బెంగళూరుకి మకాం మార్చింది. చిన్నపిల్లల ఆకలితీర్చలేక ఆమె పడుతున్న బాధను ఓ వృద్ధురాలు చూసి సఫియాకు ఆశ్రయం కల్పించింది. వారి ఆలనాపాలనా ఆవిడ చూసుకోవడంతో సఫియా కాల్‌సెంటర్ పనిలో చేరింది. 8 నెలలపాటు ఉద్యోగం చేసి సఫియా సొంతూరు పాల్‌ఘాట్‌కు వెళ్లిపోయింది. అక్కడ ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో 9 వేల జీతంతో రిసెప్షనిస్ట్‌గా చేరింది. ఉద్యోగం చేస్తూనే బీఏ చేసింది. సాయంత్రం ఇరుగుపొరుగు పిల్లలకు ట్యూషన్ చెప్పుకుంటూ బీఈడీ కూడా చేసింది. ఇప్పుడు ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తూ 20 వేల జీతం సంపాదిస్తున్నది. ఇందులో 8 వేలు ఖర్చు పెట్టుకుంటూ మిగిలిన డబ్బు చుట్టుపక్కల వితంతువుల సంక్షేమానికి ఉపయోగిస్తూ వృద్ధులు, అనాథలు, మానసిక వికలాంగులు, యాచకుల ఆకలిని తీరుస్తున్నది. ఫేస్‌బుక్‌లో 'ఛితాల్' పేరుతో ఓ పేజీ క్రియేట్ చేసి దాని ద్వారా పేదవారికి ఆర్థిక సాయం అందిస్తున్నది. పాల్‌ఘాట్‌లోని 8 గ్రామాలకు చెందిన 500 కుటుంబాలకు విద్య, వైద్యం అందిస్తున్నది. సఫియా చేస్తున్న సేవకు 'నీరజా బానోత్ అవార్డు' వరించింది. అవార్డుతో పాటు లక్షన్నర నగదు కూడా అందుకున్నది సఫియా.

జాలి, దయతో క్యాన్సర్ దూరం

భయం
కరమైన వ్యాధిగా క్యాన్సర్ గుర్తింపు పొందింది. ఎప్పుడు ఎవర్ని కబలిస్తుందో తెలియదు. మరి ఆ వ్యాధి వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉండాలంటే ఏం చేయాలి. ఎలా మసలుకోవాలి అనే అంశాలపై పరిశోధనలు జరిపారు అమెరికా పరిశోధకులు. వారు వెల్లడించిన వివరాలివి..

ఎవ్వరికైనా సరే క్యాన్సర్ సోకిందంటే అందుకు కారణం.. వారి శరీర కణాలు శక్తివంతంగా లేకపోవడమే. మరి కణా లు చక్కగా ఉండాలంటే ముందు మైండ్ సెట్ చక్కగా ఉండాలంటున్నారు పరిశోధకులు. ఇటీవల కేన్సర్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీస్ ఆఫ్ అమెరికా పరిశోధకులు అధ్యయనం చేశారు. వారు వెల్లడించిన వివరాలివి. ఆలోచనల పనితీరును బట్టే మానవ శరీరం, కణాలు అన్నీ స్పందిస్తాయి. బాధ, జాలి, కనికరం, మానవత్వం, దయాగుణం, మెచ్చుకునే గుణం వంటివి మనిషిలో పెరిగితే అప్పుడు మనసు ఎంతో ఆహ్లాదంగా మారుతుంది. తద్వారా ఆరోగ్యం మెరుగై కణాలన్నీ ఉత్తేజితంగా మారుతాయి. క్యాన్సర్ లాంటి వ్యాధుల్ని రాకుండా శరీరం తట్టుకోగలుగుతుంది. మనలో ప్రతికార జ్వాలలు, స్వార్థాలు పెరిగినప్పుడు.. శరీరానికి హాని చేసే కార్టిసాల్, అడ్రినలిన్ రసాయనాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఫలితంగా మంచి కణాల సంఖ్య తగ్గిపోతుంది. మనకు ఎవరైనా బాధ కలిగిస్తే వారిని పదే పదే తలచుకుంటూ రగిలిపోవడం కంటే వారిపై జాలి తలిచే విధానమే మంచిదని పరిశోధకులు చెబుతున్నారు. సహనాన్ని పెంచుకుంటే క్యాన్సర్ బారి నుంచి తప్పించుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ఈ విధానంతో ఇతరులకు దగ్గరవుతారని పేర్కొంటున్నారు.

బతుకు పోరాటం

ఎన్నో అవమానాలు. ఎన్నెన్నో వేధింపులు. అన్నింటికీ సహనమే ఆమె సమాధానం. ఆత్మహత్యే శరణ్యమనుకున్న స్థాయి నుంచి.. విధి వేసిన సంకెళ్ల నుంచి ఆమె బతకడానికి పోరాడింది. మూడు చక్రాల వాహనం మీద ఆధారపడి బతుకు బండిని నడిపిస్తున్నది. ఆమే ముంబైకి చెందిన షిరీన్.

షిరీన్‌కు 11 ఏండ్లు ఉండగా తల్లిదండ్రులు గొడవపడ్డారు. ఆ గొడవ కాస్తా విడాకుల వరకు వెళ్లింది. షిరీన్ తల్లి మళ్లీ వివాహం చేసుకున్నది. కానీ దానికి మత పెద్దలు, కుటుంబీకులు అడ్డు చెప్పారు. షిరీన్ సోదరున్ని, తల్లిని తీవ్ర దుర్భాషలాడారు. ఆ అవమానం తట్టుకోలేక తల్లి ఒంటికి నిప్పంటించుకుంది. ఆ వెంటనే ఆమె తండ్రి షిరీన్‌కు, తన సోదరికి ఒకేసారి వివాహం చేశాడు. కొన్ని నెలల అనంతరం షిరీన్ సోదరి గర్భంతో ఉండగా అత్తమామలు విషం ఇవ్వడంతో కడుపులోని బిడ్డతో సహా షిరీన్ సోదరి చనిపోయింది. ఆ తర్వాత కొన్నాళ్లకు షిరీన్‌కు ముగ్గురు పిల్లలు పుట్టారు. భర్త వదిలేయడంతో షిరేన్ స్థానికంగా బిర్యానీ సెంటర్ పెట్టింది. కానీ స్థానిక మున్సిపాలిటీ అధికారులు పర్మిషన్ లేదని తొలగించడంతో ఆమె పిల్లలతో సహా రోడ్డున పడింది. తన భర్త ఆటోడ్రైవర్ కావడంతో అప్పుడో ఇప్పుడో నేర్చుకున్న డ్రైవింగ్ ఆమెకు ఉపాధినిచ్చింది. కొన్నాళ్లు డ్రైవర్‌గా పనిచేసింది. కొంత డబ్బు జమయ్యాక సొంతగా ఆటో కొనుక్కుంది. మొదట్లో ఇతర ఆటో డ్రైవర్లు సూటిపోటి మాటలన్నా.. కొంతమంది వేధించినా అందరికీ ఆమె సమాధానం చెప్పింది. ప్రస్తుతం ఆమె ముంబై వీధుల్లో ప్రేమగా పలుకరిస్తూ ప్రయాణికులకు సేవలందిస్తున్నది. తన ముగ్గురు పిల్లల్ని ఉన్నతంగా చదివిస్తున్నది. ఈమె గురించి 'హ్యూమన్స్ ఆఫ్ ముంబై' పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది.

అడుగండి చెబుతా

బెడ్‌రెస్ట్‌తో నొప్పి తగ్గుతుందా?

నా వయసు 56 సంవత్సరాలు. ఓ బ్యాంక్‌లో మేనేజర్‌ని. వృత్తిరీత్యా శారీరక, మానసిక ఒత్తిళ్లు ఉంటాయి. అయితే ఓ మూడేండ్ల నుంచి నన్ను నడుము నొప్పి వేధిస్తున్నది. ఎక్స్‌రే రిపోర్ట్‌లో గ్రేడ్-1 స్పాండిలోలిస్థెసిస్ ఎల్ 4 ఓవర్ ఎల్ 5 అని వచ్చింది. నాకు ఇప్పుడు బెడ్ రెస్ట్ అవసరమా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
– సుప్రజ, దిల్‌సుఖ్‌నగర్

స్పాండిలోలిస్థెసిస్ 40 సంవత్సరాలు పైబడిన వారికి ఎక్కువగా వస్తుంది. అందులోనూ ఆడవారికి ఈ సమస్య త్వరగా వస్తుంది. వెన్నుపూస ఒకదానిపై ఒకటి ముందుకు జరిగితే ఈ సమస్య వస్తుంది. ఎక్స్‌రేలో చూడండి మీకూ కనిపిస్తుంది. ఇది ఎంతమేరకు ముందుకు జరిగిందో కొలిచి గ్రేడ్-1- గ్రేడ్-5గా విభజించి చెప్పొచ్చు. మీకు గ్రేడ్-1 దశలో ఉంది కాబట్టి ముందుకు వంగవద్దు. బరువులు ఎత్తవద్దు. నడుముపై ఒత్తిడి కలగుండా చూసుకోవాలి. ఫిజియోథెరపిస్ట్‌ను సంప్రదించి స్పైనల్ ఎక్సర్‌సైజెస్, కండరాల సాగదీత వంటివి చేయించుకోవాలి. నడుముకు బెల్ట్ వాడటం మంచిది. కొన్ని సందర్భాల్లో నరానికి ఇంజెక్షన్ అవసరం ఉండొచ్చు. ఫ్లెక్సాన్, ఎక్స్‌టెన్షన్ ఎక్స్‌రేస్, సీటీ స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్ వంటి పరీక్షలు చేయించుకుంటే తీవ్రత ఏంటో తెలుస్తుంది. అయితే మీరు అడిగినట్లు విశ్రాంతి శాశ్వత పరిష్కారం మాత్రం కాదు. విశ్రాంతికి అలవాటు పడితే ఒక్కోసారి నడుములో ఉండే కండరాలు, ఎముకలు ఇంకా బలహీనంగా తయారవుతాయి.

డాక్టర్ ఆనంద్ బాబు
కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్
కేర్ హాస్పిటల్,
ముషీరాబాద్

నమస్తే తెలంగాణ
నిధి
[కరీంనగర్]
శనివారం 13 జూలై 2019

డిజిటల్ అంబుడ్స్‌మన్

విజయ ఆధునిక యువతి. సాంకేతిక పరిజ్ఞానంలో దిట్ట. తీరిక దొరికినప్పుడల్లా షాపింగ్ పోర్టళ్లను తెగ చూస్తుంటుంది. తక్కువ ఆఫర్ల కోసం నిత్యం వెతుకుతుంది. అలా వెదకగా.. ఓ ముత్యాలహారం ఆమెకు తెగ నచ్చేసింది. గత కొంతకాలం నుంచి హైదరాబాద్ మొత్తం తిరిగినా తనకు అలాంటి రకం దొరకలేదు. పైగా, ధర కూడా అందుబాటులోనే ఉన్నదనిపించింది. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా, ముందే సొమ్ము చెల్లించి ఆన్‌లైన్‌లో హారాన్ని బుక్ చేసుకున్నది. 48 గంటల్లో రావాల్సిన వస్తువు 84 గంటలైనా రాకపోవడంతో ఆమెకు సందేహం వచ్చింది. ఆలస్యం చేయడం కరెక్టు కాదని గుర్తించి, సంబంధిత షాపింగ్ పోర్టల్‌కు ఫోన్ చేసింది. తను బుక్ చేసిన వస్తువు గురించి వివరించింది. అలాంటి బుకింగ్ తమ వద్ద జరగలేదని.. అసలు నగదు కూడా తమకు రాలేదని సదరు సంస్థ ప్రతినిధి చెప్పడంతో, ఒక్కసారిగా విజయ కంగుతిన్నది. ఏం చేయాలో ఆమెకు ఒక్క క్షణం అర్థం కాలేదు.

కిరాణా దుకాణంలో పని చేసే కృష్ణారావు ఈమధ్య స్మార్ట్ ఫోన్ కొన్నాడు. బిర్యానీ బుక్ చేయాలన్నా.. హాలీమ్ కొనాలన్నా.. అంతా ఆన్‌లైన్‌లోనే. ఒక రోజు విజయవాడకు వెళ్లడానికి ఆన్‌లైన్‌లో బస్సు బుక్ చేసుకున్నాడు. సొమ్ము కూడా చెల్లించేశాడు. తన ఖాతాలో నుంచి సొమ్ము బదిలీ అయిన సమాచారాన్ని చూశాడు. ఆతర్వాత పనిలో పడిపోయి ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. దుకాణంలో తొందరగా పని ముగించుకుని, విజయవాడ వెళదామని ఇంట్లో నుంచి బయల్దేరుతుండగా.. ట్రావెల్స్ సంస్థ నుంచి వచ్చిన టికెట్ కోసం ఫోనులో వెతకసాగాడు. టికెట్ ఖరారు అయినట్టు అసలు సమచారమే రాలేదతనికి. తన బ్యాంకు ఖాతాలో నుంచి సొమ్ము కట్ అయిన సమాచారం తప్ప బస్సు గురించి ఎక్కడా వివరాల్లేవు. చేసేదేమీ లేక బస్ స్టాండ్‌కు వెళ్లి లైన్లో నిల్చోని టికెట్ కొనుక్కుని విజయవాడ బయల్దేరాడు.

ఆన్‌లైన్ చెల్లింపుల విషయంలో.. విజయ, కృష్ణారావులకు ఎదురైన అనుభవాలు మనలో చాలామందికి ఎదురయ్యే ఉంటాయి. డిజిటలీకరణ దిశగా పరుగులు పెడుతున్న మన భారతదేశంలో.. చాలామంది ప్రజలు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయడానికి అలవాటు పడుతున్నారు. మీట నొక్కితే చాలు.. సొమ్ము సంబంధిత ఖాతాలో చేరిపోతుండటంతో స్మార్ట్ ఫోన్‌లను సైతం కొనుగోలు చేస్తున్నారు. కొందరేమో డెస్క్‌టాప్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేస్తున్నారు. అయితే, కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్‌లో చెల్లించే సొమ్ము నిర్ధారిత ఖాతాలోకి సకాలంలో చేరకపోవడం వల్ల.. రెండోసారి సొమ్ము కట్టాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. సంబంధిత సర్వీస్ ప్రొవైడర్‌ను అడిగితేనేమో సమస్య పరిష్కారం కాని దుస్థితి. ఇలాంటి ఉదంతాలు ఇటీవల కాలంలో అధికం అవుతున్నాయి. అందుకే, ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా.. వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేకంగా డిజిటల్ పేమెంట్స్ అంబుడ్స్‌మన్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. మనదేశంలోని 19 నగరాల్లోని 21 ప్రాంతాల్లో అంబుడ్స్‌మన్ స్కీమ్ ఫర్ డిజిటిల్ ట్రాన్స్‌క్షన్స్‌ను రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఆండియా ప్రవేశపెట్టింది. అయితే, కేవలం డిజిటల్ పేమెంట్ సంస్థపై ఫిర్యాదు చేయాలే తప్ప బ్యాంకుపై కాదని గుర్తుంచుకోండి. బ్యాంకుల సేవాలోపంపై ప్రత్యేకంగా బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని మర్చిపోవద్దు.

ఎలాంటి ఫిర్యాదులు?

ఈ ఏడాది మనదేశంలో అందుబాటులోకి వచ్చిన ఈ వ్యవస్థకు ఎలాంటి ఫిర్యాదు చేయవచ్చనే విషయం చాలామంది తెలియదు.

- ఎలక్ట్రానిక్ విధానంలో అనధికారికంగా నిధులు బదిలీ జరిగినా..
- మీ బ్యాంకు ఖాతాలోకి ఆన్‌లైన్ ద్వారా పంపించిన సొమ్ము జమ కాకున్నా..
- నిర్ధారిత గడువులోపు సంబంధిత ఈ-వ్యాలెట్‌లో జమ కాకపోయినా
- ఆన్‌లైన్‌లో పంపిన సొమ్ము ఫెయిల్ అయ్యి.. మళ్లీ మన ఖాతాలోకి సొమ్ము వెనక్కి రాకపోయినా..
- భారతీ బిల్ పేమెంట్, భారత్ క్యూఆర్ కోడ్, యూపీఐ క్యూర్ ఆర్ కోడ్ వంటి వాటిపై ఫిర్యాదులు
- మొబైల్, ఎలక్ట్రానిక్ ఫండ్ బదిలీకి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల్ని పాటించకున్నా..

ఇలా, ఆన్‌లైన్‌లో చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యలను థర్డ్ పార్టీ సంస్థలే పరిష్కరించాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. వినియోగదారులు చేసే చెల్లింపులకు సంబంధించి ఎలాంటి వివాదం ఏర్పడినా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించింది.

ఎలా ఫిర్యాదు చేయాలి?

డిజిటల్ పేమెంట్ సంస్థల వల్ల ఎదురయ్యే సమస్యపై ముందుగా ఆయా సంస్థకు ఫిర్యాదు చేయాలి. ముప్పయ్ రోజుల పాటు వేచి చూడాలి. ఒకవేళ, ఆయా సంస్థ సమస్యను మీరు ఆశించిన స్థాయిలో పరిష్కరించకపోతే డిజిటల్ పేమెంట్స్ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయాలి. ఆయా సంస్థ పరిధిలో ఉన్న అంబుడ్స్‌మన్ శాఖకు ఫిర్యాదు చేయాలని గుర్తుంచుకోండి. ఒకవేళ, అది దేశమంతటా సేవల్ని అందిస్తుంటే, వినియోగదారుడి చిరునామా పరిధిలోకి వచ్చే అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం మీరు అట్టి కార్యాలయాన్ని ప్రత్యక్షంగా సందర్శించాల్సిన అవసరం లేదు. అంబుడ్స్‌మన్ అధికారిక ఈమెయిల్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకు సంబంధించి దరఖాస్తు పత్రం ఆన్‌లైన్‌లోనే లభిస్తుంది.

- మీరు ఫిర్యాదు చేయాలనుకుంటే, వ్యక్తిగత వివరాల్ని నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను పొందుపర్చాలి. మీ సమస్యను వివరించాలి. ఏయే తరహా పరిష్కారాన్ని కోరుతున్నాయో తెలియజేయాలి.

గుర్తుంచుకోండి..

మీరు కంప్లయింట్ చేసిన డిజిటల్ సంస్థ నుంచి ఆశించిన స్థాయిలో స్పందించకపోతే అంబుడ్స్‌మన్‌కు ఏడాదిలోపు ఫిర్యాదు చేయవచ్చు. ఏదైనా ప్రత్యేక కారణం వల్ల ఫిర్యాదు చేయడం ఆలస్యమైనా అంగీకరిస్తారు. కాకపోతే, ఇదే సమస్యేను మీరు ఇతర ఫోరంల దృష్టికి తీసుకెళితే పెద్దగా పట్టించుకోరు.

- ఒకవేళ, డిజిటల్ అంబుడ్స్‌మన్ జవాబు వల్ల మీరు సంతృప్తి చెందకపోతే, అప్పీలేట్ అథారిటీకి ఫిర్యాదు చేయవచ్చు. దీనికి ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఇన్‌ఛార్జీగా వ్యవహరిస్తున్నారు. అప్పీలేట్ అథారిటీ జవాబు వల్ల సంతృప్తి చెందని పక్షంలో వినియోగదారుల ఫోరం లేదా కోర్టును ఆశ్రయించవచ్చు.

పరిహారం ఎంత?

వినియోగదారుడికి జరిగిన నష్టం, మానసిక వేదన వంటివన్నీ దృష్టిలో పెట్టుకుని.. కనీసం లక్ష లోపు నష్ట పరిహారాన్ని అంబుడ్స్‌మన్ ద్వారా కోరవచ్చు. గరిష్టంగా రూ.20 లక్షల దాకా పరిహారం అందుకోవచ్చు.

బ్యాంకులతో సమస్యలా?

మనలో చాలామందికి బీమా సంస్థలు, బ్యాంకులతో రకరకాల సమస్యలు ఎదురవుతుంటాయి. అలాంటప్పుడు, వాటిని ఎలా పరిష్కరించుకోవాలో తెలియక పట్టించుకోకుండా వదిలేస్తాం. మరికొందరేమో ఎలాగైనా బుద్ధి చెప్పాలని అనుకుంటారు. కాకపోతే, ఎలా ముందడుగు వేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందో తెలియదు. అలాంటప్పుడు, మీరు సంబంధిత అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయాలి. ఇందుకు మీరు ఎలా అడుగు ముందుకేయాలంటే..

- బ్యాంకు సేవలో లోప ముంటే.. ముందుగా బ్యాంకుకు ఫిర్యాదు చేయండి. పరిష్కారానికి 30 రోజుల గడువు ఇవ్వండి.
- మీరు ఆశించిన స్థాయిలో బ్యాంకు స్పందించకపోతే, సంబంధిత బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయండి. ఇందుకోసం ఆన్‌లైన్‌లో CMS.RBI.ORG.IN లో ఫిర్యాదు చేయవచ్చు.
- బ్యాంకు మీ సమస్యను పరిష్కరించని పక్షంలో.. ఏడాదిలోపు బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌కు తప్పకుండా ఫిర్యాదు చేయాలి.
- బ్యాంకుపై ఫిర్యాదు చేయాలనుకుంటే.. బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ పోర్టల్ (https://bankingombudsman.rbi.org.in)) నుంచి ఫిర్యాదు ఫారంను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అది పూరించి స్వయంగా బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ కార్యాలయంలో అందజేయాలి. సేవాలోపాన్ని తెలియజేసే సంబంధిత డాక్యుమెంట్లను తప్పకుండా జత చేయాలి.
- మీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చు.
- మీ సమస్యను రాజీ కుదర్చడం ద్వారా బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ పరిష్కరించొచ్చు. లేదా అవార్డును ప్రకటించొచ్చు.
- ఒకవేళ, బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ కూడా మీరు కోరుకున్నట్లుగా న్యాయం చేయలేదని భావిస్తే.. అప్పీలేట్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయవచ్చు. లేదా వినియోగదారుల ఫోరంను సంప్రదించవచ్చు.

బీమా కంపెనీలతో ఇబ్బందులా?

- బీమా సంస్థ నుంచి సేవాలోపం ఎదురైతే, ముందుగా మీరు బీమా సంస్థను ఆశ్రయించాలి. అంతేతప్ప, నేరుగా బీమా అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయకూడదు.
- ఒకవేళ బీమా అంబుడ్స్‌మన్ మీ ఫిర్యాదు విషయానికి సంబంధించి ప్రతిస్పందించడంలో విఫలమైనా, వారి స్పందన ఆశించిన స్థాయిలో లేకపోయినా, ఐఆర్‌డీఏ ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు ఫిర్యాదు (igms.irda.gov.in) చేయాలని గుర్తుంచుకోండి. లేకపోతే స్థానిక వినియోగదారుల ఫోరంలో కేసు దాఖలు చేయండి.

మహిళలకు కావాలి ఆర్థిక ధీమా

కుటుంబానికి సంబంధించి ప్రతి అవసరాన్ని సమకూర్చడంలో మహిళలు క్రియాశీలక పాత్ర పోషిస్తారు. కాకపోతే, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ వచ్చేసరికి వెనకడుగు వేస్తారు. ఇందుకు సంబంధించి భర్త లేదా తల్లీదండ్రుల మీద ఎక్కువగా ఆధారపడుతుంటారు. మగవారితో పోటీపడి ఉద్యోగాలు చేస్తున్న మహిళలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఆర్థిక విషయాల్లో ముఖ్యభూమిక పోషించాల్సిన అవసరమున్నది. అప్పుడే, తన గురించి కానీ, తనపై ఆధారపడ్డ కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం చేయగల్గుతారు.

ఆర్థిక ప్రణాళిక అనేది కేవలం పురుషులే చేయాలన్న సూత్రమేమీ లేదు. ఈ అంశంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన భవిష్యత్తులో ఇబ్బందులు పడే పరిస్థితి ఎదురు కావొచ్చు. ప్రస్తుతం ఉద్యోగినుల సంఖ్య అధికమైంది. మగవారితో పోల్చితే మహిళలే ఎక్కువ కాలం జీవిస్తారు. గర్భం దాల్చినప్పుడు ఉద్యోగ జీవితానికి తాత్కాలిక విరమణ చెప్పాల్సి ఉంటుంది. పొరపాటున భర్త దుర్మరణం చెందినా, విడాకులిచ్చినా ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమవుతుంది. అందుకే, మహిళలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆర్థిక ప్రణాళికలను రచించాల్సిందే. అంతేకాకుండా, తమ పిల్లలకూ పొదుపు-మదుపులకు సంబంధించి అవగాహన పెంపొందించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలకు సంబంధించి అనేకానేక పొదుపు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. వారి వయసు, నెలసరి జీతం, రిస్క్ తీసుకునే తత్వం బట్టి ఇందుకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

రిస్క్ తీసుకోవాల్సిందే..

అవివాహితులు ఉద్యోగం చేస్తున్నట్లయితే పెట్టుబడి గురించి తక్షణమే నిర్ణయం తీసుకోవాలి. కాస్త రిస్క్ తీసుకునేందుకు ముందడుగు వేయాలి. ఉన్నత విద్య, పెళ్లి వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీసు డిపాజిట్లు, లిక్విడ్ మ్యూచువల్ ఫండ్లు వంటివాటిపై దృష్టి సారించాలి. వీటిలో పెద్దగా నష్టభయం ఉండదు. మనం ఎప్పుడు కావాలంటే అప్పుడు అవసరమయ్యే నగదును తీసుకోవచ్చు. దీర్ఘకాలంలో ఇల్లు కొనాలనుకుంటే.. మంచి రేటింగు గల మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవడం ఉత్తమం.

- పెళ్లయిన మహిళలు రెండు రకాల బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఆర్జించే మహిళగా కుటుంబ ఖర్చుల కోసం కొంత సొమ్మును కేటాయించాల్సిందే. పిల్లల చదువులు, పదవీవిరమణ గురించి ఆలోచించాల్సిందే.

ఇలాంటి నారీమణులు బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్లు, కార్పొరేట్ ఎఫ్‌డీలు, బులియన్ మార్కెట్ వంటి అంశాలపై దృష్టి సారించొచ్చు. నష్టభయాన్ని తగ్గించి, అధిక రాబడిని ఇవి అందిస్తాయి. ఇక పదవీవిరమణ ప్రణాళిక విషయానికొస్తే.. పీపీఎఫ్, ఎన్‌పీఎస్ వంటి పన్ను ఆధారిత పథకాలను ఎంచుకుంటే మేలు.

- గృహిణులకు స్థిరమైన ఆదాయం ఉండదు. నెలసరి ఇంటి బడ్జెట్‌లో నుంచి ఎంతోకొంత మిగుల్చుకుని పొదుపు చేయాల్సిందే. ఈ సొమ్మును ఖాళీగా ఉంచడం బదులు బ్యాంకు రికరింగ్ డిపాజిట్లు, సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్, గోల్డ్ ఈటీఎఫ్ వంటి వాటిలో మదుపు చేయవచ్చు. నెలకు రూ.500 ఉంటే చాలు.. వీటిలో క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టొచ్చు.
- ప్రస్తుత పరిస్థితుల్లో ఒకే బాబు లేదా పాప ఉన్న మహిళల సంఖ్య తక్కువేం కాదు. వీరంతా స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికల్ని రచించాలి. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు వంటివే కాకుండా ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్లు, టెర్మ్, ఆరోగ్య బీమా పథకాలను ఎంచుకోవాలి.

బీమా ప్రణాళికలుండాలి..

ఆర్థిక ప్రణాళికలో బీమా అనేది అత్యంత కీలకమైన వ్యవహారం. గృహిణి అయినా ఉద్యోగిని అయినా, అనుకోకుండా ఎదురయ్యే ఆపద నుంచి రక్షించుకోవడానికంతో ముఖ్యమైనది. అందుకే, తప్పనిసరిగా బీమా పథకాలపై దృష్టి పెట్టాలి. కుటుంబ ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టే ఉద్యోగినులు తప్పకుండా బీమా పాలసీలను తీసుకోవాలి. పెరుగుతున్న ఆరోగ్య ఖర్చుల నేపథ్యంలో విధిగా ఆరోగ్య పథకాన్ని ఎంచుకోవాలి. ఆర్థిక ప్రణాళికలో మరో కీలకమైన విషయం.. పన్ను ప్రణాళిక. నారీమణులు తప్పకుండా పన్ను ప్రణాళికలు గురించి తెలుసుకోవాలి. పన్ను రాయితీలను దృష్టిలో పెట్టుకుని వీరంతా మెరుగ్గా వ్యవహరించాలి.

గృహరుణంపై వడ్డీ ఎంత?

బ్యాంకు	వడ్డీరేటు (%)	ఈఎంఐ (రూ.లలో)	ప్రాసెసింగ్ రుసుము? (రూ.లలో)
యునైటెడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా	8.55	23,174	----
స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా	8.30-8.65	---	గరిష్టంగా 10,000
యూకో బ్యాంకు	8.55-11.80	23,174-32,615	రుణ మొత్తంలో 0.5% (గరిష్టంగా రూ. 15,000)
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	8.60-9.15	26,225-27,282	రుణ మొత్తంలో 0.50% వరకు (గరిష్టంగా రూ. 3,000)
కార్పొరేషన్ బ్యాంకు	8.60-9.20	26,225-27,379	రుణ మొత్తంలో 0.50% వరకు (గరిష్టంగా రూ. 50,000)
అలహాబాద్ బ్యాంకు	8.60-9.60	26,225-28,160	రూ.1కోటి రుణానికి 0.40% (గరిష్టంగా రూ.15,000)
పంజాబ్ నేషనల్ బ్యాంకు	8.60-9.80	26,225-28,554	రుణ మొత్తంలో 0.35% (గరిష్టంగా రూ.15,000)
యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా	8.65-8.80	26,320-26,607	రుణ మొత్తంలో 0.50% (గరిష్టంగా రూ.15,000)
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు	8.65-8.90	26,320-26,799	రూ.75 లక్షల రుణానికి 0.50% (గరిష్టంగా రూ.20,000)
ఇండియన్ బ్యాంకు	8.65-9.60	26,320-28,160	రుణ మొత్తంలో 0.23% (గరిష్టంగా రూ.20,470)
సిండికేట్ బ్యాంకు	8.65-9.75	26,320-28,456	రుణం రూ.25 లక్షల మించితే 0.25% (గరిష్టంగా రూ.6,500)
ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్	8.70-8.80	26,416-26,607	రుణ మొత్తంలో 0.50% (గరిష్టంగా రూ. 30,000)
కెనరా బ్యాంకు	8.70-9.45	26,416-27,866	రుణ మొత్తంలో 0.50% (గరిష్టంగా రూ.10,000)
బ్యాంకు ఆఫ్ బరోడా	8.70-9.70	26,416-28,357	రుణం రూ.50 లక్షల మించితే 0.25% (గరిష్టంగా రూ.25,000)
పంజాబ్ అండ్ సింద్ బ్యాంకు	8.75-9	26,511-26,992	0.15-0.25% (గరిష్టంగా రూ.1,000)

పాత కారుకు రుణమెంత

కారులో తిరగాలని దాదాపు అందరికీ ఉంటుంది. కాకపోతే, కొందరే ఆ కలను తీర్చుకుంటారు. మరికొందరేమో అధిక మొత్తంలో ఒకేసారి చెల్లించక.. ముందుగా పాత కారును తీసుకోవాలని అనుకుంటారు. డ్రైవింగ్‌లో కాస్త చేయి తిరిగితే, కొత్త కారు తీసుకుందామని భావించేవారూ ఉంటారు. ఇలాంటి వారికి, పలు బ్యాంకులు రుణాల్ని అందిస్తున్నాయని గుర్తుంచుకోండి. 9.5 నుంచి 17 శాతం వడ్డీ రేట్లకే రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. రుణం చెల్లించే గడువునూ గరిష్ఠంగా ఏడేండ్ల దాకా అందిస్తున్నాయి. కారు విలువలో 90 శాతం వరకు రుణం పొందేందుకు అవకాశాన్ని కల్పిస్తున్నాయి. మీరు నెలవారీ వాయిదాల్లో సులభంగా ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించవచ్చు.

పేరు	వడ్డీ రేటు ఎంత?	ప్రాసెసింగ్ ఫీజు	రుణమొత్తం	రుణ వ్యవధి (సం.లో)
క్యాపిటల్ ఫస్ట్	13.50-14.50%	2%	రూ.1.5-25 లక్షలు	1-7
దేనా బ్యాంకు	9.05-11.50 %	రూ.575	రూ.1 లక్ష-2 కోట్లు	1-7
ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు	16%	1%	రూ.50 వేలు-15 లక్షలు	1-4
మహావీర్ ఫైనాన్స్ ఇండియా లి.	12-13%	1%	రూ.50 వేలు-10 లక్షలు	1-4
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	12.75-15.50%	రూ.5,310 దాకా	కనీసం రూ. 75 వేలు	1-7



సిప్పే సరైన రూటు..

స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలని కోరుకునేవారు వీలైనంత త్వరగా మదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే, భవిష్యత్తు అవసరాలకు సరిపడేటంత సొమ్మును జమ చేసుకోవచ్చు. ఒకే మదుపు సాధనంలో సొమ్ము పెట్టడం కంటే.. వివిధ మార్గాల్ని ఆశ్రయించడం అన్ని విధాల ఉత్తమం. ఇందుకోసం 'సిప్' చక్కటి విధానమని చెప్పొచ్చు. ఈ పద్ధతిలో రూ.500లతో కూడా పెట్టుబడిని ప్రారంభించవచ్చు. ఈ విధానంలో మార్కెట్‌లో హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా ప్రతి నెలా పెట్టుబడి పెడితే చాలు. దీని వల్ల నష్టభయాన్ని తగ్గించుకోవచ్చు. ఉదాహరణకు, ఫ్రాంక్లీన్ ఇండియా బ్లూచిప్ ఫండ్ మొదటి నుంచి నెలకు వెయ్యి రూపాయల చొప్పున మదుపు చేస్తే.. మొత్తం పెట్టుబడి రూ.3.07 లక్షలైంది. దానిపై 19 శాతం చొప్పున రాబడితో, ప్రస్తుతం రూ.62.68 లక్షలైందని గుర్తుంచుకోండి.

కేవలం అవగాహన కోసమే ఈ కథనాలు. నిపుణుల సలహాలు తీసుకున్నాకే పొదుపు- మదుపు విషయాల్లో తుది నిర్ణయం తీసుకోవాలి.

సుడోకు

డైలీ సుడోకు 89 సమాధానం

5	4	1	9	8	7	3	2	6
6	7	2	5	3	4	8	9	1
8	9	3	2	1	6	4	7	5
2	3	6	1	4	9	7	5	8
1	8	7	3	6	5	9	4	2
9	5	4	8	7	2	6	1	3
7	2	8	4	5	3	1	6	9
3	6	5	7	9	1	2	8	4
4	1	9	6	2	8	5	3	7

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు-90

				3			5	
		2		8	1			
6		7	9			8		
						3	1	
9			7		2			8
	6	4						
		1			5	7		9
			8	2		1		
	9			7				

వైవిధ్యమైన యూపీవీసీ కిటికీలు

అపర్ణా ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఓకోటెక్ సంస్థ నుంచి కొత్తగా యూపీవీసీ విండో రకాలు విడుదల అయ్యాయి. మూడు విభిన్నమైన ఈ రకాలను విల్లా విండోస్, టిల్ట్ అండ్ టర్న్ విండోస్, ఆర్చ్ విండోస్‌లుగా నామకరణం చేశారు. వీటిని బిగించుకుంటే ఇంటి అందం ద్విగుణీకృతం అవుతుందని ఓకోటెక్ ఘంటాపథంగా చెబుతున్నది. జర్మనీకి చెందిన అత్యుత్తమ యంత్ర పరికరాల సాయంతో యూపీవీసీ కిటికీలను తయారు చేస్తున్నామని సంస్థ అంటున్నది. కొత్తగా ఇల్లు కట్టుకునేవారెవ్వరైనా తమ కిటికీలు, తలుపులకు ఈ కొత్త రకాలు ఇట్టే నచ్చుతాయని చెబుతున్నది. ముఖ్యంగా, యువ గృహ యజమానులు ఈ ఆధునిక కిటికీలను చూడగానే ఆకర్షితులవుతారని సంస్థ సీఈవో మహేష్ చౌదరి అభిప్రాయపడ్డారు. మార్కెట్లో ఆధునిక యూపీవీసీ రకాల కిటికీలకు పెరుగుతున్న ఆదరణ బట్టి ఈ సరికొత్త రకాల్ని విడుదల చేశామన్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకు 300 టన్నుల నుంచి 450 టన్నులకు పెంచామని తెలిపారు.

* వైవిధ్యభరితంగా కనిపించే యూపీవీసీ విండోలు, కిటికీలు ల్యామినేట్ తరహావి దొరుకుతాయని.. కొనుగోలుదారులు తమ అభిరుచుల్ని బట్టి వీటిని ఎంచుకునే వీలును కల్పించామని సంస్థ అంటున్నది. ఇందులో గోల్డ్ ఓక్, డార్క్ ఓక్, రస్టిక్ ఓక్, వాల్‌నటర్, మహాగణీ వంటి ల్యామినేట్ రకాలు లభిస్తాయి. సాధారణ కలపతో చేసే కిటికీల కంటే ఇది మూడు రెట్లు సమర్థవంతంగా పని చేస్తాయని.. భవనంలో వాతావరణాన్ని సమతుల్యంగా ఉంచడంలో తోడ్పడుతాయని ఓకోటెక్ సంస్థ చెబుతున్నది. ఉప్పు నీటి వల్ల వీటికి ఎలాంటి నష్టం వాటిల్లదని, గాలిలో తేమను సమర్థంగా తట్టుకుందని ధీమా వ్యక్తం చేస్తున్నది. తలుపులు, కిటికీలకు చెదలు పడితే అందవికారంగా తయారవుతాయి. కానీ, ఇందులో అలాంటి ఇబ్బందే ఉండదు. పైగా, పర్యావరణానికి అనుకూలమైన ఈ రకాలు.. అగ్నివ్యాప్తి చెందకుండా గట్టిగా నిరోధిస్తాయి. డబుల్ సీల్ సిస్టమ్ సాయంతో రూపొందించినవి కావడం వల్ల బయటి శబ్దాలు లోనికి రాకుండా నిరోధిస్తాయి.

డెవలపర్లకు డబుల్ ధమాకా..

దేశంలో ఎక్కడ చూసినా లగ్జరీ నిర్మాణాలే. వీటిని కొనేందుకు కొనుగోలుదారులు రెండు నుంచి మూడు శాతం ఉంటే, తొంబై శాతానికి పైగా డెవలపర్లు.. ఎగువ మధ్యతరగతి లేదా అంతకుమించిన వారి కోసమే అపార్టుమెంట్లను డిజైన్ చేస్తున్నారు. అందుకే, దేశవ్యాప్తంగా ఒక్క హైదరాబాద్ తప్ప మిగతా నగరాల్లో అమ్మకాలు పెద్దగా మెరుగ్గా లేవు. ఈ సమస్యను గుర్తించిన కేంద్రం ప్రభుత్వం.. భారత నిర్మాణ రంగానికి డబుల్ ధమాకాను ప్రకటించింది. దీంతో, రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా అందుబాటు గృహాల గురించి అధిక శాతం డెవలపర్లు చర్చించుకుంటున్నారు. ఇంతకీ పథకం ఏమిటి? వడ్డీ ఎంత? వీటి వల్ల ఎవరికీ ఎక్కువగా ప్రయోజనం ఉంటుంది?

దేశీయ నిర్మాణ సంస్థలకు కేంద్రం డబుల్ ధమాకాను అందజేసింది. అధిక శాతం ప్రజలు అందుబాటు గృహాలను కావాలని కోరుతుంటే, డెవలపర్లు మాత్రం కేవలం 2 నుంచి 3 శాతం కొనుగోలుదారులను దృష్టిలో పెట్టుకుని లగ్జరీ గృహాలను చేపడుతున్నారు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అందుబాటు గృహాల్ని ప్రోత్సహిస్తోంది. తాజా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక నిర్ణయాన్ని వెలువరించారు. అందుబాటు గృహాల ప్రాజెక్టులను చేపట్టే బిల్డర్లకు వంద శాతం పన్ను మినహాయింపును ప్రకటించింది. దీంతో, రానున్న రోజుల్లో హైదరాబాద్‌తో పాటు గ్రేటర్ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి పట్టణాల్లో అందుబాటు గృహాల సంఖ్య పెరగడానికి ఆస్కారముందని నిర్మాణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

దేశంలోని ఏ నగరమైనా.. 2019 సెప్టెంబరు 1 లేదా ఆ తర్వాత స్థానిక సంస్థల నుంచి అనుమతి తీసుకునే అందుబాటు గృహాల ప్రాజెక్టులకు వంద శాతం పన్ను మినహాయింపు వర్తిస్తుంది. అంటే, ఈ నిర్మాణాల మీద వచ్చే లాభాలపై ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదన్నమాట. కాకపోతే, అనుమతి తీసుకున్న ఐదేండ్లలోపు ఎట్టి పరిస్థితిల్లో ఆయా నిర్మాణాన్ని పూర్తి చేసేయాలన్నది తాజా నిబంధన. గతంలో ఇది కేవలం మూడేండ్లు మాత్రమే ఉండేది. అందుకే, అధిక శాతం బిల్డర్లు వీటిని కట్టడానికి పెద్దగా ఆసక్తి చూపించలేదు. ప్రస్తుతం గడువును ఐదేండ్లకు పెంచడంతో సింహ భాగం ప్రమోటర్లు చౌక గృహాల్ని నిర్మించడానికి ముందుకొచ్చే అవకాశమున్నదని మర్చిపోవద్దు.

ఎక్కడ అనుమతిస్తారు?

హైదరాబాద్ వంటి మహానగరంలో వెయ్యి చదరపు మీటర్లు లేదా అంతకుమించిన విస్తీర్ణం గల ప్లాటులో అందుబాటు గృహాల్ని నిర్మిస్తామంటే అంగీకరిస్తారు. కాకపోతే, బండ గుర్తు ఏమిటంటే.. ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం కేవలం 60 చదరపు మీటర్ల కార్పెట్ ఏరియా మాత్రమే ఉండాలి. అంటే, 15-20 శాతం కామన్ ఏరియా, గోడలు, షెల్ఫ్‌లను పరిగణనలోకి తీసుకుంటే.. డబుల్ బెడ్‌రూమును 850 చదరపు మీటర్ల విస్తీర్ణంలో కట్టుకోవచ్చు. ఒకవేళ, కామన్ ఏరియాలను మరింత పెంచాలని ఎవరైనా నిర్ణయిస్తే మాత్రం.. ఫ్లాట్ తుది విస్తీర్ణం కచ్చితంగా పెరుగుతుంది.

- హైదరాబాద్ మినహా ఇతర నగరాలు, పట్టణాల్లో అందుబాటు గృహాల ప్రాజెక్టును ప్రారంభించాలంటే.. స్థల విస్తీర్ణం దాదాపు 2,000 చదరపు మీటర్లు లేదా అంతకు మించి ఉండాలన్నది నిబంధన. ఇందులో ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం ఎంతలేదన్నా 90 చదరపు మీటర్ల కార్పెట్ ఏరియా ఉండేలా డెవలపర్లు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందులో కామన్ ఏరియాలను కలుపుకుంటే, కనీసం ఎంతలేదన్నా 1260 చదరపు అడుగుల దాకా ఫ్లాట్లను కట్టొచ్చు.

చక్కటి ప్రోత్సాహం..

తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మధ్యతరగతి ప్రజానీకానికి ఉపయోగపడేలా అందుబాటు గృహాల్ని నిర్మించడానికి కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం ఉపయోగపడుతుంది. అయితే, ఈ నిర్మాణాల్ని చేపట్టాలని డెవలపర్లకు గట్టిగా ఉన్నా... స్థలాల కొరత ఈ రంగాన్ని గట్టిగా వేధిస్తున్నది. అందుకే, కేంద్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయిస్తే అనేక మంది ప్రమోటర్లు వీటిని చేపట్టడానికి ముందుకొస్తారు. మేం కూడా అతిత్వరలో ఈ తరహా గృహాల్ని కొత్తగా చేపట్టడానికి ప్రణాళికల్ని రచిస్తున్నాం.

– కె.రవీందర్‌రెడ్డి,
ఛైర్మన్, జనప్రియ ఇంజినీర్స్

2020 ఏప్రిల్ 1 నుంచి..

ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 80 ఐబీఏ ప్రకారం.. 2020 ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనను పొందుపరుస్తారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఐదేండ్లలో ఒకసారి లేదా రెండు సార్లు అనుమతి తీసుకున్నప్పటికీ, మినహాయింపు రావాలంటే, తప్పనిసరిగా 2019 సెప్టెంబరు 1 తర్వాత మొదటి అనుమతిని తీసుకుని ఉండాలి. ఐదేండ్లలోపు స్థానిక సంస్థ నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తీసుకోవాలి. దుకాణాలు, ఇతర వాణిజ్య సముదాయాల్ని నిర్మించేందుకు మొత్తం బిల్టప్ ఏరియాలో మూడు శాతం కంటే మించకూడదని గుర్తుంచుకోండి.

- మీరు ఒక ప్లాటులో అందుబాటు గృహాల ప్రాజెక్టును నిర్మిస్తున్నారంటే.. దానికే పరిమితం కావాలి. అంతేతప్ప, కొంత స్థలంలో అందుబాటు ఫ్లాట్లను కట్టి.. మిగతా లగ్జరీ ఫ్లాట్లను కడతామంటే ఒప్పుకోరు. పైగా, ఒక్కో ఫ్లాట్ స్టాంప్ డ్యూటీ విలువ రూ. 45 లక్షలు మించకూడదు. ఒక కుటుంబంలో ఒకే వ్యక్తి ఫ్లాటును కేటాయిస్తే.. మళ్లీ అదే కుటుంబంలో మరొకరికి ఫ్లాటును విక్రయించడానికి అంగీకరించరు.

540 ఎకరాల్లో..
జేబీ సెరీన్ సిటీ..

సొంతింటి కల నెరవేరాలన్న సగటు మనిషి ఆలోచనలకు అనుగుణంగా నాగార్జున సాగర్ రహదారిలో మెగా ప్రాజెక్టు రూపుదిద్దుకుంటున్నది. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ సంస్థల చేరువలో.. జేబీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ''జేబీస్ సెరీన్ సిటీ'' అనే ఆధునిక లగ్జరీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దాదాపు 540 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో గేటెడ్ కమ్యూనిటీ విల్లా ప్రాజెక్టు, రిసార్టు, వాణిజ్య సముదాయాలు వంటివి అభివృద్ధి చేస్తారు. ఇబ్రహీంపట్నం ప్రాంతం ప్రత్యేకత ఏమిటంటే.. ఇప్పటికే ఆక్టోపస్, ఎన్ఎస్‌జీ, బీడీఎల్‌తో పాటు ఐటీసంస్థలు పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ఫార్మాసిటీతో పాటు రక్షణ రంగ సంస్థలు, విద్యాసంస్థల్లో పని చేసే ఉద్యోగులు ఈ ప్రాంతంలోనే స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అందుకే, వీరిని దృష్టిలో పెట్టుకుని జేబీస్ సంస్థ జేబీస్ సెరీన్ సిటీకి అంకురార్పణ చేసింది. దీన్ని ప్రత్యేకత ఏమిటంటే.. సామాన్యుల నుండి సంపన్నుల వరకు.. తమ స్థాయికి తగ్గట్టు ప్లాట్లు కొనుగోలు చేయవచ్చు. దీనికి అదనంగా.. మరో నలభై రెండు ఎకరాల్లో విల్లాలనూ నిర్మిస్తున్నది.

క్లబ్‌హౌజ్ ప్రధాన ఆకర్షణ..
ఈ వెంచర్‌లో భూగర్భ డ్రైనేజీ, కేబుల్ కనెక్షన్లు, విద్యుత్, బ్రాడ్‌బ్రాండ్ వంటివన్నీ పొందుపరుస్తారు. ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగించేందుకు చెట్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. జనరేటర్లతో విద్యుత్ బ్యాకప్ కల్పించారు. వెంచర్ చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. క్లబ్‌హౌజ్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఇందులో ప్లాట్లు కొన్నవారు భద్రత గురించి చింతిచక్కర్లేదని సంస్థ చెబుతున్నది. ఇందుకోసం 24 గంటలు సెక్యూరిటీని ఏర్పాటు చేశామని అంటున్నది. టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ వంటివి ఆడుకోవడానికి ఆటస్థలాల్ని అభివృద్ధి చేస్తున్నది. ఇప్పటికే ఐదువందల నలభై ఎకరాల్లో చేసిన ప్లాట్లు కూడా ఎనభై శాతం వరకు అమ్ముడయ్యాయి.

ఆధునిక విల్లాలతో అభివృద్ధి..
నాగార్జునసాగర్ రహదారిలో పెద్ద ఎత్తున వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. కానీ, ఈ ప్రాంత ప్రజల అవసరాలు, నగర శివారులల్లోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వారితో పాటు రక్షణ, విద్యా, ఐటీరంగం, ఫార్మా రంగానికి చెందిన వారికోసం ప్లాట్లే కాకుండా విల్లాలను నిర్మిస్తున్నాం. దీంతో సాగర్ రహదారి మరింత కొత్త శోభను సంతరించుకోనుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్లకు బిన్నంగా జేబీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తయారు చేస్తున్నాం. జేబీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరిధిలో భూగర్భడ్రైనేజీ, భూగర్భ విద్యుత్, బ్రాడ్‌బాండ్, ఆటస్థలాలు, జనరేటర్ బ్యాకప్, క్లబ్‌హౌజ్ వంటి అత్యాధునిక వసతులు కల్పిస్తున్నాం. సగటు మనిషి కళలకనుగుణంగా జేబీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో వసతులు కల్పిస్తున్నాం. – మనోహర్‌రెడ్డి, ఎండీ, జేబీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్.

'వెలుగుల' వంటగది

ఇంటిలోని అన్ని ప్రదేశాలు సౌకర్యంగా, ఆకర్షణీయంగా ఉంచుకోవడంపై చాలా ఆసక్తి చూపుతుంటారు. ముఖ్యంగా ఇంటిలో చూడచక్కని వంటగది లేకుంటే ఏదో లోటు కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. ఇంటికి అతిథులు వచ్చినప్పుడు మీ వంటగది అలంకరణ గురించి గొప్పగా చెప్పాలంటే దానిలో ఆకర్షణీయమైన లైటింగ్ ఉండాల్సిందే. అలాంటి లైటింగ్ కోసం అన్వేషిస్తున్నారా? అయితే మీ కోసమే ఈ కథనం.

- వంట గదిలో తెలుపు, బంగారు రంగుల కలయికతో లైటింగ్ అమరిస్తే ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది.
- నలుపు ఎప్పుడూ కొత్తగా ఉంటుంది. మీ వంట గదిలోని టేబుల్‌పై నలుపు వస్తువులను తగిలిస్తే అందంగా కన్పిస్తుంది.
- వంటగదిలో చెర్రీ కలర్ ప్యాట్రన్డ్ లాంప్స్‌ను ప్రయత్నించవచ్చు. ఇవి మీ వంట గదికి సరికొత్త అందాన్నిస్తాయి.
- తాజాగా వచ్చిన ఎడిసన్ బల్బులను వంట గదిలో అలంకరించుకుంటే మీకు వెచ్చని అనుభూతిని ఇస్తాయి.
- ఇప్పటికీ కొందరు పాత కాలం పద్ధతులను ఇష్టపడుతుంటారు. వారి కోసం పాత మెటల్ లాకెట్టు ఆకార లైటింగ్ అందుబాటులో ఉంది. వంటగదిని మరింత ఆసక్తికరంగా మార్చుకోవడానికి పసుపు రంగు లైట్లను ఓసారి ప్రయత్నించి చూడండి. తేడా మీకే తెలుస్తుంది.
- వంటగదిలోని సింక్‌పైన, స్టవ్ పైన పసుపు స్పాట్ లైట్‌ను ఏర్పాటు చేసుకుంటే పార్టీ తరహా అనుభూతిని కలిగిస్తాయి.
- తెలుపు రంగును ఇష్టపడని వారెవరుంటారు. తెల్లటి మాడ్యులర్ కిచెన్, వైట్ కిచెన్ శాబు, దాని చుట్టూ తెల్లని కుర్చీలతో తెల్లటి డైనింగ్ టేబుల్, డైనింగ్ టేబుల్ మీద వైట్ వేలాడే లైటింగ్లను అలంకరించుకుంటే మీ వంటగదిలో మీకు సరికొత్త అనుభూతి కలుగుతుంది.
- వంటగదిలోని డైనింగ్ టేబుల్ మధ్యలో కాండిల్ లైట్‌ను అమర్చుకుంటే రెస్టారెంట్ తరహా ఆకర్షణీయంగా కన్పిస్తుంది.
- వేలాడుతున్న అలమారాల కింద లైట్లను అమర్చడం ద్వారా కిచెన్ శ్లాబు ప్రకాశవంతంగా కన్పిస్తుంది. వంటగదిని పగటిపూట, రాత్రిపూట అవసరమైనంత కాంతితో నింపుతుంది.
- మీ వంట గదిని ఎరుపు లేదా తెలుపు లేదా కలపతో డిజైన్ చేసినట్లయితే మూలల్లో బూడిద రంగు పొడవైన సైడ్ ల్యాంప్‌ను జోడిస్తే మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

నీటి కొరత ఎప్పటికీ ఉండదు!

కొత్తగా ఇల్లు కొనుక్కునే వారిని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహించడం వల్ల ఇక నుంచి ఇండ్ల అమ్మకాలు పుంజుకుంటాయని క్రెడాయ్ హైదరాబాద్ నూతన ఉపాధ్యక్షుడు, సైబర్ సిటీ డెవలపర్స్ ఎండీ వేణువినోద్ అభిప్రాయపడ్డారు. క్రెడాయ్ హైదరాబాద్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన 'సంపద'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. రూ.45 లక్షల్లోపు రుణ సాయంతో ఇల్లు కొనుక్కునే వారికి రూ.లక్షన్నర దాకా పన్ను పరిమితి లభిస్తుంది. అంటే, మొత్తం మూడున్నర లక్షల దాకా పన్ను ప్రయోజనం లభిస్తుందన్నమాట. పైగా, కొత్త ప్రాజెక్టుల్లో ఇల్లు కొనుక్కునే వారికి ఐదు శాతమే జీఎస్టీ వర్తిస్తుండటంతో చాలా మంది స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ముందుకొస్తారని తెలిపారు. ఇంకా, ఏమన్నారో ఆయన మాటల్లోనే..

''క్రెడాయ్ ఉపాధ్యక్షుడిగా ఈ రంగం అభివృద్ధి చెందడంలో నా వంతు పాత్ర పోషించే అవకాశం లభించిందని అనిపిస్తుంది. స్కిల్ డెవలప్‌మెంట్ మీద మా సంఘం ప్రధానంగా దృష్టి సారిస్తున్నది. కార్మికుల కొరత పెరుగుతున్న నేపథ్యంలో ఇది ముఖ్యమైన కార్యక్రమంగా భావిస్తున్నాం. దీంతో పాటు హైదరాబాద్‌లోని వివిధ గృహ సముదాయాల్లో నీటి సంరక్షణను పెంపొందించడంపై ప్రణాళికాబద్ధంగా అడుగులు ముందుకేయాలని అనుకుంటున్నాం. ఇందు కోసం నగరంలో పలు సదస్సులను నిర్వహించాల్సి ఉన్నది. ఈ క్రమంలో నిపుణుల సాయాన్ని కూడా తీసుకోవాలన్నదే మా ప్రయత్నం. ఇప్పటికే, తోటి క్రెడాయ్ మిత్రులు తమ నిర్మాణాల్లో నీటి సంరక్షణ పనుల్ని విజయవంతంగా చేపడుతున్నారు. ఇక నుంచి అందరం కలిసికట్టుగా అటు నిర్మాణ రంగానికి ఇటు కొనుగోలుదారులకు ఉపయోగపడే విధంగా క్రెడాయ్ హైదరాబాద్ ద్వారా పలు కీలకమైన అభివృద్ధి కార్యక్రమాల్ని చేపట్టాలని నిర్ణయించాం. దీనికి సంబంధించి సంఘ సభ్యులందరం చర్చించుతుది నిర్ణయానికొస్తాం. అదేవిధంగా, గృహసముదాయాల్లో సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను విజయవంతంగా వినియోగించే అంశంపై అధిక దృష్టి సారించాల్సిన అవసరమున్నది. ఈ రెండు పనులను విజయవంతంగా చేపడితే, భవిష్యత్తులో అట్టి అపార్టుమెంట్లలో నీటి సమస్యలు తలెత్తే అవకాశాలే ఉండవు.

సీఎం కేసీఆర్ ఉండగా..

చెన్నైలో నీటి కొరత తీవ్రంగా ఉన్నది. బెంగళూరులోనూ ఇంచుమించు ఇలాంటి సమస్య ఉత్పన్నం అవుతున్నది. అయితే, మన వద్ద నీటి కొరతను అధిగమించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ముందుచూపుతో ప్రణాళికలు రచించారు. కాళేశ్వరం నుంచి ఇప్పటికే నీరు విడుదలౌతున్నది. రాష్ట్రమంతటా ఇంటింటికీ తాగునీటిని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు ముందుకేస్తున్నది. ఈ క్రమంలో మనకు భవిష్యత్తులో ఎలాంటి నీటి కొరత ఏర్పడే ఆస్కారమే ఉండదు. మౌలిక సదుపాయాల్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తున్నది. సరికొత్త మున్సిపల్ చట్టాన్ని కూడా రూపొందించింది. మొత్తానికి, హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తుండటం వల్ల జాతీయ, అంతర్జాతీయ ఐటీ సంస్థలు నగరానికొస్తున్నాయి. ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో మనం బెంగళూరును దాటేసాం. కొత్త ఐటీ సంస్థలు పుట్టుకొస్తుండటం వల్ల నగరంలో ఇండ్లకు మెరుగైనా గిరాకీ ఉంటుంది. కాబట్టి, సొంతిల్లు కొనుక్కోవడానికి ఇంతకుమించిన తరుణం లేదని చెప్పాలి.

2020లోపు 2,500 ఫ్లాట్లు అప్పగిస్తాం..

ఇప్పటివరకూ మేం 35 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని కొనుగోలుదారులకు అప్పగించాం. 2013 నుంచి నేటివరకూ దాదాపు 2000 ఫ్లాట్లను అందజేశాం. 2020 లోపు మరో 2,500 ఫ్లాట్లను కొనుగోలుదారులకు విజయవంతంగా అందజేయాలనే లక్ష్యంతో దూసుకెళుతున్నాం. మా ప్రాజెక్టులు ప్రస్తుతం వివిధ దశల్లో నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇవి కాకుండా, కొత్తగా మేం ఒక టవర్‌ను లాంచ్ చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నాం. ఇందుకు సంబంధించి రెరా అనుమతి రాగానే ప్రకటిస్తాం. ఇది కాకుండా, కోకాపేట్‌లో 1,100 ఫ్లాట్ల ప్రాజెక్టును ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఇది ప్రస్తుతం అనుమతుల దశలో ఉన్నది. వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న మరికొన్ని ప్రాజెక్టులు ప్రణాళికా దశల్లో ఉన్నాయి.''

PLOTS for SALE
hmda
APPROVED OPEN PLOTS
LP. NO. 67/LO/HMDA/2008.
Revised 2019
Near by
Symbiosis International University, Sadh Nagar, Kothur, Bangalore Highway
HMDA APPROVED FLATS @ ISNAPUR
NEAR PATANCHERVU
63003 08585, 83330 09449

COMMERCIAL SPACE FOR SALE
@ Kollur
BHEL
Cyber Colony
G+3 Floors
Each Floor 7,800 sqft.
Please Contact:
99493 50006

PREMIUM PLOTS
VIRTUSA LIFE SPACES
VIRTUSA Tuxedo Park
@ SHADNAGAR TOWN
DTCP APPROVED
VIRTUSA CYNOSURE
Near MOKILA (@ Shankarpally)
LP No. 0241/LO/PLG/HMDA/18
HMDA APPROVED LAYOUT
» Ready to Construct
» Clubhouse » CC Roads
» 100 ft Road Facing
» Excellent Developments
» Reasonable Price
» Under Ground Electrical Cable
94949 74949

ప్రగతి రిసార్ట్స్
మెగా రెసిడెన్షియల్ వెంచర్
ప్రగతి స్వూర్తి సెంట్రల్ కౌంటీ
యాదాద్రి, వరంగల్ నేషనల్ హైవే పై ప్లాట్లు అమ్మకానికి కలవు
> క్లియర్ టైటిల్ > DTCP ఆమోదం ప్రకారం అన్ని సౌకర్యాలు
> యాదాద్రి చుట్టు ప్రక్కల గల అతి పెద్ద (82 ఎకరాలు) రెసిడెన్షియల్ వెంచర్
> యాదాద్రి ఇష్టపడు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రదేశం మరియు భవిష్యత్తు పెట్టుబడికి అత్యంత అనుకూలమైనది
DTCP APPROVED
(TLP No. 24/2016/H)
ప్రగతి రిసార్ట్స్ చిలుకూరులో ఉచిత సభ్యత్వం
9100073539 | 7661033339

ప్రీలాంచ్‌లో అమ్మితే జరిమానా..

రెరా చట్టంలోని సెక్షన్-3లో నిబంధనలను ఉల్లంఘించిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు రెరా అథారిటీ రూ. 25 లక్షల జరిమానా విధించింది. రియల్ ఎస్టేట్ చట్టంలోని సెక్షన్-59లో పొందుపరిచిన విధంగా సెక్షన్-3లోని నిబంధనలను ఉల్లంఘించిన వారు శిక్షార్హులవుతారు. ఈ చర్యకు ప్రాజెక్టు అంచనా వ్యయంలో 10 శాతాన్ని జరిమానాగా విధించే అధికారం రెరాకు ఉంటుంది. ఇందులో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థకు ప్రాజెక్టు వ్యయంలో

5% జరిమానాగా విధిస్తూ రెరా ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. 60 రోజుల్లోపు చెల్లించాలని ఆదేశించింది. వారి సంస్థకు సంబంధించిన అన్ని ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ దరఖాస్తులను వెంటనే సమర్పించాలని సూచించింది. రెరా నిబంధనలను ఉల్లంఘించినందుకుగానూ 2018 ఫిబ్రవరిలో ఆ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రెరాలో నమోదు చేయకుండానే ప్రమోటర్లు ప్రచారం చేశారని, ముందస్తుగా అమ్మారని బెంచ్ దృష్టికి వచ్చింది. ఈ సంఘటన బీహార్ రాష్ట్రంలో చోటు చేసుకుంది.

శంకర్‌పల్లి
HMDA layout
Empire bluwood
రామకృష్ణ విద్యాలయ ప్రక్కన
ఓనర్ ప్లాట్‌లు
5 పాట్లు 1650 Sq yds.
సింగిల్ బిట్ (West Face),
అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనువైనది
Contact: N. మానిక్ రెడ్డి
ఫోన్: 9399303555

నిధి అగర్వాల్, రామ్, నభానటేష్, ఛార్మి, పూరి జగన్నాథ్

రామ్‌లో ఎనర్జీ అన్‌లిమిటెడ్!

రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. పూరి జగన్నాథ్ దర్శకుడు. నిధి అగర్వాల్, నభానటేష్ కథానాయికలు. పూరిజగన్నాథ్‌తో కలిసి ఛార్మి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను గురువారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించారు. పూరిజగన్నాథ్ మాట్లాడుతూ 'మణిశర్మ మా చిత్రానికి పెద్ద పిల్లర్. అడగ్గానే ఐదు పాటలిచ్చారు. ఈ మధ్య కాలంలో వచ్చిన మంచి ఆల్బమ్ అని అంతా అంటున్నారు. నేపథ్య సంగీతం కూడా ఆకట్టుకునే విధంగా వుంది. సెన్సార్ కావాలి. రామ్‌తో తొలిసారి కలిసి పనిచేశాను. తనలో ఎనర్జీ అన్‌లిమిటెడ్. వాడుకున్నోళ్లకు వాడుకున్నంత. నాకు చేతనైనంత వాడాను. ఇంకా బోలెడు ఎనర్జీ వుంది తనలో. లైవ్‌లో క్యారెక్టర్ చేశాడు. ఇస్మార్ట్ శంకర్ మైండ్‌లో నిలిచిపోతాడు. రామ్ గ్రేట్ యాక్టర్. తను మాట్లాడిన తెలంగాణ యాస సినిమాకే హైలైట్‌గా నిలుస్తుంది. సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్' అన్నారు. రామ్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం పనిచేసిన ఆరు నెలల కాలం నా జీవితంలో బెస్ట్ టైమ్. సినిమా చూశాను. ఎలా పూర్తి చేశానో తెలియకుండా అయిపోయింది. ఆనీ మాస్టర్ కంపోజ్ చేసిన 'ఉండిపోరాదే..' సాంగ్ ప్రేక్షకుల్ని కట్టిపడేస్తుంది. అంత బాగా డ్యాన్స్ కంపోజ్ చేశారామె. సినిమాలో పాటలన్నీ ఒకెత్తయితే రీరికార్డింగ్ మరో ఎత్తు. సినిమాలోని ప్రతి అంశాన్ని ఎంజాయ్ చేస్తారు. నిధి అగర్వాల్ పాత్రలో ఒదిగిపోయింది' అన్నారు. 'సినిమా ఫస్ట్ కాపీ చూశాం. సినిమాపై నమ్మకం మరింత పెరిగింది. రామ్ గురించి ఎంత చెప్పినా తక్కువే' అని ఛార్మి అన్నారు. ఈ కార్యక్రమంలో నభా నటేష్, నిధి అగర్వాల్, డ్యాన్స్ మాస్టర్ ఆనీ తదితరులు పాల్గొన్నారు.

విక్రమ్

ఏజెంట్ అన్వేషణ

విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న తమిళ చిత్రం 'కడరం కొండన్'. రాజేష్.ఎం.సెల్వ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను పారిజాత మూవీ క్రియేషన్స్ సంస్థ 'మిస్టర్ కె.కె' పేరుతో తెలుగులో అనువదిస్తున్నది. టి.నరేష్‌కుమార్, టి. శ్రీధర్ నిర్మాతలు. అక్షర హాసన్, అభిహాసన్ ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. ఈ నెల 19న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'యాక్షన్ ఇతివృత్తంతో తెరకెక్కుతున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఇది. అండర్‌కవర్ ఏజెంట్‌గా విక్రమ్ కనిపిస్తారు. ఆయన అన్వేషణ ఎందుకోసమన్నది ఉత్కంఠను పంచుతుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌లో విక్రమ్ లుక్‌కు మంచి స్పందన లభిస్తున్నది. 'నువ్వు ఆడుతున్నది నాతో కాదు యముడితో' అంటూ ఆయన చెప్పిన సంభాషణలు తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి. విక్రమ్‌పై తెరకెక్కించిన యాక్షన్ సన్నివేశాలు అలరిస్తాయి. అభినయానికి ఆస్కారం ఉన్న పాత్రలో అక్షరహాసన్ కనిపిస్తుంది. తెలుగు ప్రేక్షకుల్ని తప్పకుండా మెప్పిస్తుంది. త్వరలో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, సమర్పణ: టి. అంజయ్య.

ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్

వినాయక్, లింగేశ్వర్

తరుణ్‌తేజ్, లావణ్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఉండిపోరాదే'. గోల్డ్‌టైమ్ ఇన్ పిక్చర్స్ పతాకంపై డాక్టర్ లింగేశ్వర్ నిర్మిస్తున్నారు. నవీన్ నాయని దర్శకుడు. ఈ సినిమాలో ఓ గీతాన్ని దర్శకుడు వి.వి.వినాయక్ విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'టైటిల్ బాగుంది. ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా అందంగా సినిమాను తెరకెక్కించినట్లుగా కనిపిస్తున్నది. సాబు వర్గీస్ బాణీలు వీనులవిందుగా ఉన్నాయి' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'ప్రేమకథకు కుటుంబ విలువలు జోడించి సినిమాను రూపొందించాం. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. త్వరలో సినిమా విడుదల తేదీని వెల్లడిస్తాం' అని తెలిపారు. కథను నమ్మి ఈ సినిమాను తెరకెక్కించామని, అంతర్లీనంగా చక్కటి సందేశం మిళితమై ఉంటుందని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్రీనివాస్ విన్నకోట, సంగీతం: సాబు వర్గీస్.

రాంబాబు, తమ్మారెడ్డి భరద్వాజ్, రత్నకుమార్

అమలాపాల్ నటన చూసి షాక్ అయ్యా!

అమలాపాల్ నటిస్తున్న తమిళ చిత్రం 'ఆడై'. రత్నకుమార్ దర్శకుడు. ఈ చిత్రాన్ని 'ఆమె' పేరుతో తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో రాంబాబుకల్లూరి, విజయ్ మోరవెనేని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్ర పోస్టర్‌ను గురువారం హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. అనంతరం తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ '1979లో చిత్ర పరిశ్రమకు వచ్చాను. చరిత చిత్ర పతాకంపై మా సంస్థలో కోతలరాయుడు, మొగుడుకావాలి వంటి చాలా సినిమాలు తీశాను. చిరంజీవి, సుమన్, భానుచందర్, శ్రీకాంత్, విద్యాసాగర్, మిక్కీ జె మేయర్, మాలతి..ఇలా చాలా మంది మా సంస్థ నుంచి వచ్చారు. ఈ 40 ఏళ్లల్లో ఎన్నో సినిమాలు చేశాం. కానీ 'ఆమె' చూసి షాక్ అయ్యాను. అసలు ఈ కథని దర్శకుడు ఎలా రాశాడు? ఎందుకు రాశాడు? నిర్మాత ఎలా తీశాడు? వంటి అన్ని విషయాలు ఆలోచించా. ఇలాంటి సినిమాలు చేయాలంటే పాషన్ వుండాలి. అది లేని వారు దీని గురించి ఆలోచించడానికి భయపడతారు. అమలాపాల్ నటన చూసి షాక్ అయ్యాను. ఈ జనరేషన్‌లో ఇంత గొప్పగా నటించే వాళ్లు లేరు. ఈ సినిమా చేస్తున్నందుకు గర్వపడుతున్నా. నా జీవితంలో మర్చిపోలేని సినిమా ఇది' అన్నారు. 'ఫార్ములా సినిమాలను చేసి బోర్‌కొడుతున్న సమయంలో ఈ ఇండస్ట్రీ నుంచి వెళ్లిపోదామా అని అనిపించింది. అలాంటి సమయంలో వచ్చిన కథ ఇది. తొలుత ఇది ఇంగ్లీష్ సినిమాకు కాపీయేమో అనుకున్నా. చాలా ధైర్యంగా నటించాను. ఓ సన్నివేశం చూసి ఇందులో నగ్నత్వం కన్నా నా కళ్లల్లో ఎక్కువ బాధకనిపించిందని అనురాగ్‌కశ్యప్ అన్న మాటల్ని మర్చిపోలేను' అన్నారు. ఈ కార్యక్రమంలో నందినిరెడ్డి, దర్శకుడు రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపాల్

రాముడే లంకకు వెళితే..

ఇషికవర్మ, రవికిరణ్

స్వీయ నిర్మాణ దర్శకత్వంలో మహేష్‌సూర్య కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'బడిదొంగ'. ఇషిక వర్మ, రవికిరణ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్ర లోగోను శుక్రవారం హైదరాబాద్‌లో రవీందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. దర్శకనిర్మాత, హీరో మహేష్ సూర్య చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఒకప్పుడు రావణుడు సీతని అపహరిస్తే ఆంజనేయుడు లంకకి వెళ్లొచ్చాడు. రాముడే వెళ్లి వుంటే ఏమిటన్నదే ఈ చిత్ర కథ. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది. హైదరాబాద్, యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతాం. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు. కథానాయికగా తనకిది తొలిచిత్రమని, మంచి పాత్ర లభించడం ఆనందంగా ఉందని ఇషిక వర్మ చెప్పింది. కథానుగుణంగా ఆరు పాటలుంటాయని సంగీత దర్శకుడు రాజా చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: వంశీ, సహనిర్మాతలు: రామ్ వశిష్ఠ, శ్రీనిత్య, హర్షవర్ధన్, టి.మల్లిఖార్జున్ రావు, జగదీశ్.

గురి తప్పని లక్ష్యం

'సాండ్ కీ ఆంఖ్' చిత్రంలో తాప్సీ

తాప్సీ, భూమి ఫడ్నేకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హిందీ చిత్రం 'సాండ్ కీ ఆంఖ్'. ఉత్తరప్రదేశ్‌లోని జోహ్రీ గ్రామానికి చెందిన వృద్ధులు చందూ తోమర్, ప్రకాషీ తోమర్ యాభై ఏళ్ల వయసులో షూటింగ్‌లో అరంగేట్రం చేసి జాతీయ స్థాయిలో మూడు వందలకుపైగా పతకాల్ని సాధించారు. ఈ ప్రయాణంలో వీరికి ఎదురైన సంఘర్షణ నేపథ్యంలో దర్శకుడు తుషార్ హీరానందానీ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ షూటర్ దాదీస్ పాత్రల్లో తాప్సీ, భూమి ఫడ్నేకర్ నటిస్తున్నారు. వృద్ధులుగా డీ గ్లామర్ లుక్‌తో కనిపిస్తున్న వారి ఫొటోలు ఆకట్టుకుంటున్నాయి. గురువారం టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'ఇన్నాళ్లు బామ్మలు మనకు కథలు చెబుతుంటే వినే వాళ్లం. ఇప్పుడూ ఇద్దరు బామ్మల కథ మనం తెలుసుకుందాం. వారు పేర్లు చందు తోమర్, ప్రకాషీ తోమర్. అర్జునుడిలా గురి తప్పకుండా లక్ష్యాన్ని ఛేదిస్తారు' అంటూ టీజర్‌లో సంభాషణలు వినో దాన్ని పంచుతూనే ఆలోచనల్ని రేకెత్తిస్తున్నాయి. దీపావళికి ఈ సినిమా విడుదలకానున్నది.

'సాంకేతికత కంటే సినిమాకు కథ ముఖ్యమని నేను నమ్ముతాను' అని అన్నారు రిచర్డ్ ప్రసాద్. స్వామిరారా, కొత్తజంట, బాబు బంగారం సినిమాలతో ఛాయాగ్రాహకుడిగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారాయన. రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీని అందించిన తాజా చిత్రం 'ఓ బేబీ'. ఇటీవలే ఈసినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో రిచర్డ్ ప్రసాద్ ముచ్చటించారు.

డబ్బుకంటే ఆత్మసంతృప్తి ముఖ్యం

రిచర్డ్‌ప్రసాద్

'ఆరేళ్ల నా శ్రమకు 'ఓ బేబీ' ద్వారా చక్కటి ఫలితం దక్కింది. ఈ విజయాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు. సినిమాటోగ్రఫీతో పాటు కథ, నందినిరెడ్డి దర్శకత్వం, సమంత అభినయానికి మంచి పేరు లభిస్తున్నది. ట్రైలర్ చూసి సహజ రంగుల్ని ఉపయోగిస్తూ సినిమాను అందంగా తీశావని సినిమాటోగ్రాఫర్ నిరవ్‌షా ప్రశంసించారు. భావోద్వేగాలతో కూడిన ఓ మంచి సినిమాకు పనిచేయాలన్న నా కోరిక ఈ సినిమాతో తీరింది. పది, పదిహేనేళ్ల వరకు గర్వంగా చెప్పుకునేలా ఉంటుంది.

కథే హీరో..

చెన్నై నా స్వస్థలం. అడయార్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో సినిమాటోగ్రఫీలో డిప్లొమా చేశాను. దర్శకుడు కృష్ణచైతన్య ద్వారా 'స్వామిరారా' చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసే అవకాశం లభించింది. నా దృష్టిలో కథే సినిమాకు తొలి హీరో. ఆ తర్వాత దర్శకుడు, హీరోలు వస్తారు. కథ నచ్చితేనే సినిమాలు చేస్తాను. ఒకేసారి రెండు మూడు సినిమాలు చేసి డబ్బు సంపాదించాలనే ఆలోచనలు నాకు లేవు. ఓ సినిమా పూర్తయిన తర్వాత మరో సినిమా అంగీకరిస్తాను. అందువల్లే చాలా తక్కువ సినిమాలు చేశాను. డబ్బు కంటే ఆత్మసంతృప్తి ముఖ్యమని నమ్ముతాను. సుధీర్‌వర్మ నుంచి నందినిరెడ్డి వరకు దర్శకులంతా పూర్తి స్వేచ్ఛనిచ్చారు. సినిమా బాగా రావడం కోసమే అందరం పని చేస్తాం కాబట్టి ఎప్పుడూ ఈగో సమస్యలు రాలేదు. ప్రత్యేకంగా ఓ జోనర్ అని కాకుండా అన్ని రకాల కథాంశాలకు పనిచేయడానికే ఇష్టపడతాను. సాంకేతికతపై ఆధారపడను. అవసరమైతేనే టెక్నాలజీని వాడతాను. దర్శకత్వం చేయాలనే ఆలోచన ఉంది. అయితే సినిమాటోగ్రాఫర్‌గా సంపాదించుకున్న సొంత డబ్బులతోనే ఆ సినిమా చేస్తాను. గతంలో చేసిన కొన్ని సినిమాల ఫలితాలు బాధించాయి. అయితే వాటన్నంటిని గొప్ప అనుభవాలుగా తీసుకొని తప్పుల్ని సరిదిద్దుకున్నాను. నందినిరెడ్డి దర్శకత్వంలో మరో సినిమాతో పాటు గురు ఫిలిమ్స్ నిర్మాణ సంస్థలో ఓ చిత్రం చేయబోతున్నాను.

స్వచ్ఛమైన ప్రేమకథ!

పునర్నవి భూపాలం, మహత్‌రాఘవేంద్ర

పునర్ణవి భూపాలం, మహత్ రాఘవేంద్ర, శ్వేతావర్మ, సూర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సైకిల్'. 'నాన్ పొల్యూటెడ్ లవ్‌స్టోరీ' అని ఉపశీర్షిక. ఆట్ల అర్జున్‌రెడ్డి దర్శకుడు. సైకిల్ గ్రే మీడియా, ఓవర్సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ విజయా ఫిలింస్, ఓం శ్రీ మణికంఠా ఫిలింస్ పతాకంపై పి.రామ్‌ప్రసాద్, డి. నవీన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. త్వరలో విడుదల కానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'భారతీయ సినిమాలో ఇంకా చెప్పడానికి కొత్త కథలు లేవు అనే స్థాయిలో ఇప్పటి వరకు చాలా చిత్రాలొచ్చాయి. అయినా ఇప్పటికీ కొత్త కథలు వస్తూనే వున్నాయి. ఆ కోవలోనే కొత్త కథతో రూపొందిస్తున్న మా చిత్రానికి 'సైకిల్' అనే టైటిల్‌ని పెట్టుకుని తొలి సన్నివేశంలోనే దానికి సంబంధించిన ఆసక్తికరమైన లింక్‌తో క్లీన్ కామెడీ లవ్ ఎంటర్‌టైనర్‌ని తెరకెక్కించాం. త్వరలో టీజర్‌తో పాటు ఆడియోని రిలీజ్ చేయబోతున్నాం' అన్నారు. సుదర్శన్, అనితా చౌదరి, మధుమణి, ఆర్ఎక్స్ 100 లక్ష్మణ్ తదితరులు నటించారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధం మనోహర్, సంగీతం: జి.ఎం. సతీష్.